అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 05-4-2024

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 సంచిక : 45

Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar

12 పేజీలు వెల : 6.50





చెరువులు, కుంటలను సాగర్ నీటితో నింపాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని ఎడమకాల్వకు విడుదల చేస్తున్నారని, ఆ నీటితో నల్లగొండ జిల్లాలోని చెరువులు, కుంటలు, కాలువలు నింపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణకేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు, బావులు పూర్తిగా అడుగంటిపోయాయని, దాంతో తాగు, సాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకొని తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చెరువులు, కుంటలు నింపాలని కోరారు. ముఖ్యంగా తాగునీటి రిజర్వాయర్లను నింపి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. సాగు నీరు లేక ఎండిపోయిన పంట పొలాలను ప్రభుత్వం, అధికారులు పరిశీలించి ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రవి నాయక్, డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, భవాండ్ల పాండు, వినోద్ నాయక్, తిరుపతి రామ్మూర్తి, పరుశురాములు, గోవింద్ రెడ్డి, ఉన్నం వెంకటేశ్వర్లు, పిల్లుట్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు, పాలనను గాలికొదిలేసిన ప్రభుత్వం

- మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి
- కోతులు చనిపోయిన ట్యాంక్‌ను పరిశీలన



నవతెలంగాణ-నాగార్జునసాగర్

ప్రభుత్వం ప్రజలను, పాలనను గాలికి వదిలేసిందని బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ (నందికొండ)లో వానరాలు చనిపోయిన మంచినీటి వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్ కుమార్, రమావత్ రవీంద్ర కుమార్‌తో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కోతులు చనిపోయిన వాటర్‌ట్యాంక్ నీరు తాగిన వారందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. నాగార్జునసాగర్‌ను మున్సిపాలిటీగా తీర్చిదిద్ది అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ దేనని అన్నారు. 2014కు ముందు ఉన్న రోజులు పునరావృతం అవుతున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో పెద్దవూర ఎంపీపీ ప్రత్యేక సలహాదారులు సుందర్ రెడ్డి, మండల అధ్యక్షులు రవి నాయక్, నందికొండ కౌన్సిలర్ జి. రమేష్, ఊర శ్రీనివాస్, సిరికొండ మధు, వీరయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.25 లక్షల నకిలీ కరెన్సీ పట్టివేత

- నలుగురు నిందితులు అరెస్టు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.25 లక్షల నకిలీ కరెన్సీ తరలిస్తుండగా మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 25 లక్షల నకిలీ కరెన్సీతో పాటు నిస్సాన్ కంపెనీకి చెందిన కారు, నాలుగు మొబైల్ ఫోన్స్, కీప్యాడ్ మొబైల్, రూ.8,240 వేల అసలైన నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన హరుణ్, సయ్యద్ సగీర్, జాకీర్ సయ్యద్, అలీ అఫ్తాబ్ అక్తర్ నుంచి రూ. 25 లక్షల నకిలీ కరెన్సీతో నిస్సాన్ కారులో మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు బయలు దేరారు. మార్గమధ్యలో ఎర్రకుంట వద్ద మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు తనిఖీలు చేస్తుండగా నిందితుల నిస్సాన్ కారు అనుమానాస్పదంగా కనిపించింది. దాంతో కారును పోలీసులు ఆపి తనిఖీ చేయగా రూ.25 లక్షల నకిలీ కరెన్సీ బయట పడింది. నిందితులు ఒకింత ఒరిజినల్ కరెన్సీ మధ్యలో మూడింతల నకిలీ కరెన్సీ పెట్టి చలామణి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు బాలాపూర్ పోలీసులకు అప్పగించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. బాలాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాణిజ్య పన్నుల శాఖ అధికారుల పై ఏసీబీ దాడులు



నవతెలంగాణ-కల్లూరు

ఖమ్మం జిల్లా కల్లూరు పట్టణ పరిధిలోని ఎన్ఎస్‌పీ క్రాస్ రోడ్ వద్ద వాహనదారుల నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడు తున్న వాణిజ్య పన్నులశాఖ అధికారులను ఏసీబీ అధికారులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న ఏసీటీవో శ్రీరామ్, వారి సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద అదనంగా ఉన్న పది వేల రూపాయల నగదు, పత్రాలను సీజ్ చేశారు. వాహనదారుల నుంచి అనధికారికంగా కమర్షియల్ ట్యాక్స్ అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించినట్టు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.582 కోట్ల ఈబీలు చెల్లించి.. నష్టాల్లో 33 కంపెనీలు..

(మొదటిపేజీ తరువాయి)

ప్రవాహంపై హిందూ, ఒక స్వతంత్ర పరిశోధనా బృందం సంయుక్తంగా చేపట్టిన పరిశోధనలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఈ 45 కంపెనీలు నాలుగు కేటగిరీలుగా (ఏ,బీ,సీ,డీ) విభజించాయి.33 కంపెనీలు ఇచ్చిన ఈబీలలో మొత్తం రూ.576.2 కోట్ల విరాళంలో రూ.434.2 కోట్లు (దాదాపు 75 శాతం) బీజేపీకి అందాయి. 2016-17 నుండి 2022-23 వరకు ఏడు సంవత్సరాలలో ఈ కంపెనీలు నష్టాలు లేదా దాదాపు జీరో లాభాన్ని కలిగి ఉన్నాయి. ఈ 33 కంపెనీల మొత్తం నికర నష్టాలు రూ.1 లక్ష కోట్లకు పైగా ఉన్నాయి. ఈ 33 కంపెనీలలో 16 కంపెనీలు (కేటగిరీ ఏ) మొత్తంగా సున్నా లేదా ప్రతికూల ప్రత్యక్ష పన్నులను చెల్లించాయి. ఈ నష్టాలను మూటగట్టుకున్న కంపెనీలు గణనీయమైన విరాళాలు ఇచ్చాయని పరిశోధనలో వెల్లడైంది. అటే అవి ఇతర సంస్థలకు షెల్ కంపెనీలు అయి ఉండవచ్చు లేదా ఆ కంపెనీల లాభ, నష్టాలను తప్పుగా నివేదించడంతో మనీ లాండరింగ్‌కు పాల్పడే అవకాశం ఉందని స్పష్టం చేశాయి. ఆరు కంపెనీలు మొత్తం రూ.646 కోట్లను విరాళంగా ఇవ్వగా అందులో రూ.601 కోట్లు (93 శాతం) బీజేపీకి అందాయి. ఈ కంపెనీలు 2016-17 నుంచి 2022-23 వరకు మొత్తంగా సానుకూల నికర లాభాలను కలిగి ఉన్నాయి. అయితే ఈబీల ద్వారా విరాళంగా ఇచ్చిన నగదు ఆ కంపెనీల మొత్తం నికర లాభాన్ని గణనీయంగా మించిపోయినట్లు అధ్యయనంలో వెల్లడైంది. ఈ కంపెనీలు (కేటగిరీ బీ) వారి లాభనష్టాలను తప్పుగా నివేదించి ఉండవచ్చునని తెలిపారు. మూడు కంపెనీలు మొత్తం రూ.193.8 కోట్లు విరాళంగా ఇవ్వగా, రూ.28.3 కోట్లు (సుమారు 15 శాతం) బీజేపీకి అందాయి. మిగిలిన వాటిలో కాంగ్రెస్ రూ.91.6 కోట్లు (47 శాతం), తణమూల్ - రూ.45.9 కోట్లు (24 శాతం), బీఆర్.ఎస్, బీజేడీ - రూ.10 కోట్లు, (5 శాతం చొప్పున), ఆప్ - రూ.7 కోట్లు (3.6 శాతం) అందుకున్నాయి. ఈ మూడు కంపెనీలు సానుకూల నికర లాభాలను కలిగి ఉన్నాయి కానీ 2016-17 నుంచి 2022-23 వరకు మొత్తంగా ప్రతికూల ప్రత్యక్ష పన్నులను నివేదించాయి. అటువంటి కంపెనీలు (కేటగిరీ సి) పన్ను ఎగవేతలు చేసి ఉండవచ్చు.

రాజ్యాంగం, రాష్ట్రాల హక్కులను రక్షిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అసహనం, విద్వేషం, హింసల ప్రాతిపదిక కలిగిన నిరంకుశవాద, ఫాసిస్ట్, హిందూత్వ దేశంగా మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. దేశంలోని ప్రతి వ్యవస్థలోనూ అనూహ్యమైన రీతిలో చొచ్చుకుపోయి భారతదేశ ప్రజల నరాల్లోకి తన మతోన్మాద విషాన్ని వ్యాపింపజేస్తున్న బీజేపీ మూల సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ బహిరంగంగా ప్రకటిస్తున్న లక్ష్యం ఇదే. ఆ ప్రయత్నాలకు వ్యతిరేకంగా భారతదేశాన్ని కాపాడేలా ఈ లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి.

గత లోక్‌సభ ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఈ ఐదేండ్లలో, భారత్ కూడా అనేక పోరాటాలను చూసింది, కార్మికులు, రైతులు, ఆదివాసీలు, దళితులు, మహిళలు, యువత, విద్యార్థుల ప్రజాస్వామ్య పోరాటాల ద్వారా తీవ్ర ప్రతిఘటనను చవి చూసింది. ప్రజలు ఐక్యంగా వుండి పోరాడితే ఈ ప్రభుత్వం సాగించే అణచివేతను, అధికారాన్ని శక్తి సామర్థ్యాలను ఈ పోరాటాలు సవాలు చేయగలవని, ఓడించగలవని రుజువైంది. ముఖ్యంగా రైతుల చారిత్రక పోరాటం దీన్ని రుజువు చేసింది కూడా. ఇదే కాలంలో, సీపీఐ(ఎం) నేతృత్వంలో వామపక్ష ప్రజాస్వామ్య సంఘటన (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం అమలు చేసిన ప్రత్యామ్నాయ విధానాలను కూడా మనం చూశాం. ఆర్థికపరంగా చిక్కుల్లో పడేయడానికి కేంద్రం అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ కేరళ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రజానుకూల విధానాలకు, మత సామరస్యతకు ఒక ఆశా కిరణంగా ఆవిర్భవించింది.

- బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించడమే ప్రతి దేశభక్తుని కర్తవ్యమన్న స్పష్టమైన అవగాహనతో సీపీఐ(ఎం) తన ఎన్నికల ప్రణాళికను భారతదేశ ప్రజల ముందుంచుతోంది. ఈ సమిష్టి కర్తవ్యాన్ని బలోపేతం చేసేందుకు, కేంద్రంలో లౌకికవాద ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో సాయపడేందుకు తన శక్తివంచన లేకుండా పాటు పడుతుందని సీపీఐ(ఎం) ప్రతిన చేస్తోంది. ఇందుకు గానూ, ప్రజానుకూల విధానాలకు హామీ కల్పించేందుకు గానూ పార్లమెంట్‌లో సీపీఐ(ఎం) బలమైన ఉనికిని కలిగివుండడం అత్యవసరం.
- రాజకీయాలు, రాజ్యం, ప్రభుత్వం, పాలన నుండి మతాన్ని వేరు చేయాలన్న సూత్రం పట్ల తన నిబద్ధతను ప్రకటిస్తూ, దీని కోసం రాజీలేని పోరాటం సాగిస్తామని సీపీఐ(ఎం) ప్రతిన చేస్తోంది. విద్వేష ప్రసంగాలు, నేరాలకు వ్యతిరేకంగా చట్టం కోసం పోరాడుతుంది. సీఏఏను రద్దు చేసేందుకు కూడా కట్టుబడి వుంది.



- యూఏపీఏ, పీఎంఎల్ఏ వంటి అన్ని నిరంకుశ చట్టాలను రద్దు చేసేందుకు సీపీఐ(ఎం) నిలబడుతుంది. స్వతంత్ర సంస్థల స్వయంప్రతిపత్తిని పరిరక్షిస్తూ, బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడానికి, ప్రజల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు కట్టుబడి వుంది.
- భారతదేశ ఆర్థిక సార్వభౌమాధికారాన్ని కాపాడే విధానాలకు సిపిఎం కట్టుబడి వుంది. ప్రభుత్వరంగ ప్రయివేటీకరణను పునస్సమీక్షించి, తిప్పికొట్టాలి. కుబేరులపై పన్ను విధించడంతో పాటూ సాధారణ సంపద పన్నును, వారసత్వ పన్నును కూడా చట్టబద్ధం చేయాల్సి వుంది. ప్రస్తుత లేబర్ కోడ్‌ల స్థానంలో కార్మికుల హక్కులు ప్రతిబింబించేలా కార్మిక అనుకూల చట్టాలు వుండాలి. స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కు చట్టబద్ధమైన హామీ కల్పించడం ద్వారా భారతదేశ రైతాంగానికి భద్రత కల్పించడంపైనే ఆహార భద్రత ఆధారపడి వుంటుంది.

పని హక్కును రాజ్యాంగ హక్కుగా చేర్చాలని సీపీఐ(ఎం) కోరుతోంది. ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలి. అదనంగా ఉద్యోగాలను సృష్టించగలిగేలా ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసి, విస్తరించాలి. ఎంజిఎన్ఆర్ఇజిఎకు బడ్జెట్‌లో కేటాయింపులను రెట్టింపు చేయాలి. పట్టన ఉపాధికి హామీ కల్పిస్తూ కొత్త చట్టాన్ని రూపొందించాలి. నిరుద్యోగ భృతిని కల్పించాలి. ఉపాధి నష్టంతో కూడిన వృద్ధికి సంబంధించిన ప్రస్తుత విధానాల్లో మార్పు తీసుకురావడం ద్వారా భారతదేశ ప్రజల లాభాలను నాశనం చేయడాన్ని తప్పనిసరిగా మార్చాలి.

- సార్వజనీన విద్యా హక్కును బలోపేతం చేయాలి, ఉన్నత విద్య ప్రయివేటీకరణను ఆపాలి.
- విద్యా రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు జీడిపిలో కనీసం ఆరు శాతానికి పెంచాలని సీపీఐ(ఎం) కోరుతోంది. వాణిజ్యీకరణ, మతతత్వకరణ, కేంద్రీకరణ విధానాలను తిప్పికొట్టడానికి కట్టుబడి వుంది.
- ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల కోసం చట్టాన్ని రూపొందించేందుకు సీపీఐ(ఎం) కట్టుబడి వుంది. ఎలాంటి నీరుగార్చకుండా రిజర్వ్‌డ్ పోస్టుల్లో ఖాళీల తక్షణ భర్తీకి, ఆదివాసీల రాజ్యాంగ, చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణకు, సాంస్కృతిక సమీకరణ ముగింపునకు కట్టుబడి వుంది. దేశంలో ఓబీసీలపై సక్రమ డేటాను పొందడానికి గానూ ఎన్నాళ్ళగానో చేపట్టాల్సి వున్న 2021 సాధారణ జనగణనతో పాటూ కుల గణన కూడా నిర్వహించడం అవసరం. మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లను తక్షణమే అమలు చేసేందుకు, నేరాల్లో మహిళా బాధితులకు న్యాయం అందించే క్రమాలను బలోపేతం చేయడానికి సీపీఐ(ఎం) కట్టుబడి వుంది.
- ఎన్నికల వ్యవస్థలో ధనబల వినియోగాన్ని అణచివేసేందుకు అత్యవసరంగా ఎన్నికల సంస్కరణలు చేపట్టాలని సీపీఐ(ఎం) కోరుతోంది. ఇందుకు గానూ, ఎన్నికలకు ప్రభుత్వ నిధులనే ఉపయోగించాలని పార్టీ కోరుతోంది. రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు విరాళాలు ఇవ్వడాన్ని నిషేధించాలని కోరుతోంది. ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరిచేందుకు కార్పొరేట్లు విరాళాలు ఇవ్వాలి. అటువంటి విరాళాలన్నీకూడా ప్రభుత్వ ఎన్నికల నిధిలో జమ చేయాలి. వాటిని ప్రభుత్వ నిధులుగా ఉపయోగించాలి.
- 370వ అధికరణ ద్వారా జమ్మూ కాశ్మీర్‌కు మంజూరైన స్వయం ప్రతిపత్తి హోదాకు సీపీఐ(ఎం) కట్టుబడి వుంది. జమ్మూ కాశ్మీర్ ప్రజల హక్కుల పరిరక్షించేందుకు గానూ ప్రతి వేదికను ఇందుకోసం ఉపయోగించుకోవడానికి సిపిఎం నిబద్ధతతో వుంది. రాష్ట్ర అసెంబ్లీకి తక్షణమే ఎన్నికలు నిర్వహించడానికి సీపీఐ(ఎం) కట్టుబడి వుంది. అలాగే ఈ దిశగా మొదటి చర్యగా పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కూడా కోరుతోంది.

మన దేశ ప్రయోజనాలను నెరవేర్చే అలీన విదేశాంగ విధానానికి సీపీఐ(ఎం) కట్టుబడి వుంది. మన దేశ భద్రతకు సంబంధించిన ప్రతి కోణాన్ని పరిరక్షించుకుంటూనే మన పొరుగు దేశాలతో సత్సంబంధాలు వుండాలని భావిస్తోంది.

- ప్రజల జీవన ప్రమాణాలు అత్యంత దయనీయంగా దిగజారిపోవడాన్ని దృష్టిలోవుంచుకుని ఆశ్రిత పక్షపాతం, పెట్టుబడిదారీవాదం, మతం-కార్పొరేట్ సంబంధాలకు సంబంధించిన ప్రస్తుత దిశా నిర్దేశాన్ని పూర్తిగా సవరించాలి. "
- సీపీఐ(ఎం) ప్రత్యామ్నాయ విధానాలను ఎన్నికల ప్రణాళిక రెండో భాగంలో ప్రజల ముందు సవివరంగా వుంచుతామని పేర్కొంది.

లీగల్ నోటీసులకు భయపడం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ ఇచ్చిన లీగల్ నోటీసులకు భయపడబోమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి చెప్పారు. వాటిపై కేటీఆర్‌కు పరిజ్ఞానం లేదని ఎద్దేవా చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మీడియా కథనాలను చూసి విచారణ జరపమంటూ తాము డీజీపీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే అనుమానం ఉందనీ, అందుకే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. టాస్క్‌పోర్స్ వాహనాల్లో డబ్బులు చేరవేశామంటూ రిమాండ్‌లో ఉన్న పోలీసు అధికారులు చెప్పారని గుర్తు చేశారు.

ప్రభుత్వ వాహనాలను సొంతానికి ఉపయోగించారనే కారణంగా గతంలో ఇందిరాగాంధీపై అనర్హత వేటు వేశారని తెలిపారు. దీని ప్రకారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ అనర్హులే అవుతారని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ. 2500 కోట్లు ఢిల్లీకి కప్పం కట్టారన్న కేటీఆర్ అన్న మాటలకు తాము కూడా లీగల్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. తీవ్రవాదుల కదలికలను అంచనా వేసేందుకు ఫోన్ ట్యాపింగ్ చేస్తారనీ, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేసిందని విమర్శించారు. ఆయన ఆదేశాల మేరకే ఆనాడు ఫోన్లు ట్యాపింగ్ చేశారని ఆరోపించారు.

కాంగ్రెస్‌లో చేరిన నిజాంపేట్ మేయర్



నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి దంపతులు గురువారం ముఖ్య మంత్రి నివాసం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఇన్‌చార్జి కోలన్ హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మేయర్‌తో పాటు కాంగ్రెస్‌లో చేరిన వారిలో సీనియర్ నాయకులు కోలన్ గోపాల్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ , కార్పొరేటర్లు చిట్ల దివాకర్, ఇంద్రజిత్ రెడ్డి, ఊటుకూర్ సురేష్ రెడ్డి, రాజేశ్వరీ చౌదరీ, వెంగయ్య చౌదరీ, గంగెయ్యుల శ్రీనివాస్ యాదవ్, ఆవుల ప్రసన్న జగదీష్ యాదవ్, ఆవుల జగదీష్ యాదవ్, కో ఆప్షన్ సభ్యురాలు వాణి స్టీఫెన్ పాల్, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఆమె భర్త నీలా గోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపట్టారు. నిజాంపేట్ రహదారిపై హనుమాన్ ఆలయం వద్ద కార్యకర్తలు మేయర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

హక్కుల కోసం నిరంతరం పోరాటాలు

- జి నాగయ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నేత సునీత్ చోప్రా అనీ, ఆయన పోరాట స్ఫూర్తితో బలమైన భూ పోరాటాలు- కూలి పోరాటాలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరముందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జి నాగయ్య అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో సునీత్ వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ అటవీ హక్కుల, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయకుండా బీజేపీ సర్కారు తొక్కి పట్టిందని విమర్శించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు అధ్యక్షతన సభలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, హరిబండి ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ప్రసాద్, మహిళ కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పన పద్మ, మూడ్ శోభన్ పి.ఆశయ్య కోట రమేష్ ఆర్. ఆంజనేయులు, రాహుల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్ఎస్ నేతలు

- రూ.1.67కోట్ల విద్యుత్ బకాయిలు చెల్లించనందుకే...

నవతెలంగాణ-ఉప్పల్

హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో నేడు సన్ రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే. అయితే మ్యాచ్‌కు ముందే ఉప్పల్ స్టేడియం నిర్వాహకులకు షాక్ తగిలింది. చాలా రోజులుగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు స్టేడియానికి విద్యుత్ నిలిపివేశారు. రూ.1.67 కోట్ల బకాయిలను సంబంధించి ఇప్పటికే నోటీసులు ఇచ్చినా హెచ్‌సీఏ అధికారులు స్పందించలేదని అధికారులు చెబుతున్నారు. ఎస్ఈ రాములు ఈ విషయం పై మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లులు కట్టకుండా విద్యుత్ వినియోగించారని తెలిపారు. దీనిపై 2015లోనే కేసు నమోదు చేశామని, 15 రోజుల క్రితం నోటీసులు పంపామని చెప్పారు. అయితే ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ పాసులు ఇవ్వనందుకే ఉప్పల్ స్టేడియంకు పవర్ కట్ చేశారని హెచ్‌సీఏ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జనరేటర్ల సహాయంతో విద్యుత్ వినియోగిస్తున్నట్టు హెచ్‌సీఏ అధికారులు తెలిపారు.

నేతన్నలపై కక్ష కట్టిన కాంగ్రెస్ సర్కారు

- వారిని ఆదుకోవాలి : సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నేతన్నలపై కాంగ్రెస్ సర్కార్ కక్ష కట్టిందనీ, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. బీఆర్ఎస్ పాలనలో పదేండ్లు పండుగలా కళకళలాడిన చేనేతరంగం.. కాంగ్రెస్ రాగానే మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు.



2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందో.. మళ్లీ కాంగ్రెస్ వచ్చి నాలుగునెలలు గడవకముందే అదే విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరి వల్ల గత నాలుగు నెలలుగా నేతన్నలు చేనేత పనులకు దూరం అవడంతో పాటు, పవర్ లూమ్స్ పూర్తిగా బంద్ అయ్యాయని తెలిపారు. చేనేత కార్మికులు, పవర్ లూమ్ ఆసాములతోపాటు కార్మికులు రోడ్డునపడటంతో.. పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి, ముందు చూపు లేకపోవడం వల్ల వేలాది మంది నేతన్నలు, పవర్ లూమ్ కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో వారి జీవితాలు దుర్భరంగా మారుతున్నా.. ప్రభుత్వానికి కనీస కనికరం లేదని వాపోయారు. తమకు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు.. ప్రతినిత్యం దీక్షలు, ధర్నాలు, నిరసనలతో.. ఏదో ఒక రూపంలో తమ ఆందోళన కొనసాగిస్తున్నప్పటికీ సర్కారులో ఏమాత్రం చలనం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నేతలే కార్మికులను అవమానించేలా మాట్లాడటం.. వారి మనోస్థైర్యాన్ని మరింత దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి వ్యాఖ్యలు ప్రతి కార్మికుని గుండెను గాయపరిచాయని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తడుక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఉరేసుకుని తనువు చాలించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్య కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యగానే నేతన్నలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం 05-4-2024

సంపుటి : 10 | సంచిక : 45 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

రూ.582 కోట్ల ఈబీలు చెల్లించి.. నష్టాల్లో 33 కంపెనీలు..



న్యూఢిల్లీ : వివిధ రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల(ఈబీ)ను విరాళంగా ఇచ్చిన సుమారు 45 కంపెనీల నిధుల మళ్లింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నష్టాల్లో ఉన్న దాదాపు 33 కంపెనీలు రూ. 582 కోట్ల ఈబీల ద్వారా వివిధ పార్టీలకు విరాళాలు అందించగా, వాటిలో 75 శాతం బీజేపీ ఖాతాల్లోకి వెళ్లడం గమనార్హం. ఈ నిధుల ...2లో



రాజ్యాంగం, రాష్ట్రాల హక్కులను రక్షిస్తాం

లోక్‌సభలో సీపీఐ(ఎం), వామపక్ష పార్టీల బలాన్ని పెంచండి

బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని, లోక్‌సభలో సీపీఐ(ఎం), వామపక్షాల బలాన్ని పెంచాలని, కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకికవాద ప్రభుత్వం ఏర్పడేలా చూడాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. లోక్‌సభ ఎన్నికల కోసం సీపీఐ(ఎం) ఎన్నికల ప్రణాళికను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బృందాకరత్, నీలోత్పల్ బసు తదితరులతో కలసి గురువారం విడుదల జేశారు. ప్రజల కోసం చేపట్టాల్సిన ప్రజానుకూల, ప్రత్యామ్నాయ విధానాలను ఆ మ్యానిఫెస్టో వివరించింది.

- ప్రజల కోసం రాజీలేని పోరాటాలు కొనసాగిస్తాం
- కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వ ఏర్పాటుకు శాయశక్తులా కృషి
- ఉపా వంటి క్రూర చట్టాలను రద్దు చేస్తాం
- బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించండి
- పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో సీపీఐ(ఎం) ఉద్ఘాటన

దేశం కోసం సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ: "కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దశాబ్ద కాలంగా సాగించిన పాలనతో లౌకికవాద, ప్రజాస్వామ్య, భారత రిపబ్లిక్ ఉనికే ప్రమాదంలో పడిన నేపథ్యంలో 2024 లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. రాజ్యాంగానికి నాలుగు మూల స్తంభాలుగా భావించే లౌకికవాద ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమత్వం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయం వ్యవస్థలను ఒక పద్ధతి ప్రకారం ధ్వంసం చేసే క్రమాన్ని ఈనాడు భారత్ చూస్తోంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని, పార్లమెంట్‌లో తనకున్న మెజారిటీని దుర్వినియోగం చేస్తూ, నిరంకుశవాద, మతోన్మాద మోడీ ప్రభుత్వం దేశంలోని కార్మికుల హక్కులను నాశనం చేసేందుకు ఫాసిస్ట్ పద్దతులను ఉపయోగిస్తోంది. తద్వారా భారతదేశాన్ని ప్రపంచంలోకెల్లా అత్యంత అసమానతలు కలిగిన సమాజాల్లో ఒకటిగా మారుస్తోంది. మరోపక్క ప్రజలను మతపరంగా విభజించేందుకు విషపూరితమైన తన మతోన్మాద సిద్ధాంతాలను ప్రయోగిస్తోంది. " అని సీపీఐ(ఎం) మ్యానిఫెస్టో ప్రకటించింది.

వివరాల్లోకి వెళితే... 18వ లోక్‌సభకు జరిగే ఎన్నికలు కీలక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. భారత రాజ్యాంగం ద్వారా నిర్దేశించబడిన భారత రిపబ్లిక్ యొక్క లౌకిక, ప్రజాస్వామ్య స్వభావాన్ని పరిరక్షించడానికి ఎన్నికల్లో "ప్రజలమైన మనం" మన ఓటు ద్వారా ఎన్నికల ఫలితాన్ని నిర్ణయించాలి. ఆ విషయంలో మనం ఎలాంటి పొరపాట్లు చేయరాదు - భారత రిపబ్లిక్ లౌకిక, ప్రజాస్వామ్య స్వభావాన్ని - పూర్తిగా ఆవేశంతో కూడిన, ...2లో

కర్తవ్యాలకు కట్టుబడి ఉంటాం

మోడీ ప్రభుత్వం తీవ్రంగా నీరుగార్చిన రాష్ట్రాల రాజ్యాంగ హక్కుల పునరుద్ధరణకు సీపీఐ(ఎం) గట్టిగా నిలబడివుంది. కేంద్రం వసూలు చేసే సర్‌చార్జీలు, సెస్సుల్లో వాటాలతో సహా మొత్తం కేంద్ర పన్నుల్లో 50శాతాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలని సీపీఐ(ఎం) కోరుతోంది. రాష్ట్రాలను పణంగా పెట్టి కేంద్రీకరణను పెంపొందించే విధానాలకు స్వస్తి పలకాలని కోరుతోంది. అలాగే ముఖ్యమంత్రి ప్రతిపాదించే ముగ్గురు నిపుణుల కమిటీ నుండే గవర్నర్‌ను ఎంపిక చేయడానికి సీపీఐ(ఎం) కట్టుబడివుంది

తొలిసారి పెద్దల సభకు..

రాజ్యసభ ఎంపీగా సోనియాగాంధీ ప్రమాణ స్వీకారం

ఒక బీఆర్ఎస్, ముగ్గురు వైసీపీ ఎంపీలు కూడా..



11లో..

మోడీని తిరస్కరించండి

బీజేపీకి మరో అవకాశం ఇవ్వొద్దు : తమిళ ఓటర్లకు కమల్ హాసన్ పిలుపు



చెన్నయ్ : దేశాన్ని పరిపాలించేందుకు బీజేపీకి, ప్రధాని నరేంద్ర మోడీకి మరోసారి అవకాశం ఇవ్వవద్దని మక్కల్ నిధి మయం (ఎంఎన్ఎం) వ్యవస్థాపకుడు కమల్ హసన్ తమిళనాడు ప్రజలకు పిలుపునిచ్చారు. చిదంబరం పార్లమెంటరీ నియోజవర్గం నుండి ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న వీసీకే అధ్యక్షుడు తోల్ తిరుమవలవంకు ...11లో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవితే సూత్రధారి

ఆమెకు బెయిల్ ఇవ్వొద్దన్న ఈడీ



- కొడుకు పరీక్షల నేపథ్యంలో బెయిల్ ఇవ్వాలన్న కవిత తరపు న్యాయవాది



11లో..

సీఎం పదవి నుంచి కేజ్రీని తొలగించలేం

అది ఆయన ఇష్టం : మరోసారి స్పష్టం చేసిన ఢిల్లీ హైకోర్టు



11లో..

దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీ

ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తాం



- రాష్ట్రంలో కరువుకు గత ప్రభుత్వానిదే బాధ్యత
- 6న జనజాతర సభను విజయవంతం చేయాలి : సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మంత్రులతో కలిసి సభాస్థల ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-కందుకూరు

భారత దేశాన్ని బీజేపీ విచ్చిన్నం చేస్తోందని, దేశంలో ప్రజలకు రక్షణ లేకుండా పోతోందని, ప్రభుత్వ రంగ సంస్థలను తన దోస్తులకు అప్పజెప్పుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని అన్నారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఈ నెల 6న నిర్వహించే కాంగ్రెస్ జన జాతర సభ ఏర్పాట్లను గురువారం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ , స్థానిక నేతలతో కలిసి భట్టి విక్రమార్క వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా సభా స్థలంలో ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పార్టీ నాయకులకు సీఎం సూచించారు. సభ విజయవంతం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలతోనే రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. గత వర్షాకాలంలో బీఆర్ఎస్ ...11లో

కొండంత నష్టం... గోరంత పరిహారం

ప్రకృతి వైపరీత్యాల సాయంలో కేంద్రం వివక్ష

- పదేండ్లలో కరువు నష్టం రూ.14.812 కోట్లు
- బీజేపీ సర్కార్ ఇచ్చింది రూ.2,306 కోట్లు
- వరద నష్టం రూ. 12,700 కోట్లు కాగా అందిన సాయం రూ. 1,787 కోట్లు
- రాష్ట్రంపై మోడీ సర్కార్ పక్షపాతం



రాష్ట్రంలో కరువు సమస్య తీవ్రంగా ఉంది. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. సాగు నీరు సంగతి పక్కన పెడితే తాగడానికి కూడా ఈ ఏడాది కష్టాలు తప్పవని భావిస్తున్నారు. తాజా పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో.... కాలం తెచ్చిన కరువని కాంగ్రెస్ అంటుండగా, ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువని బీఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించు కుంటున్నారే తప్ప పదేండ్లలో కరువు సాయం అందించడంలో కేంద్రం తీరును ఎండగట్టలేక పోయారు. ఫలితంగా రాష్ట్రం ప్రకృతి వైపరీత్యాల పరిహారం పొందడంలో తీవ్రంగా నష్ట పోయింది.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో పదేండ్ల పాటు అధికారంలో ఉన్న మోడీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ అనుసరిస్తున్న పక్షపాత వైఖరితో రాష్ట్రం అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయింది. పన్నుల వాటాల నుంచి మొదలుకొని చివరికి కరువు సాయం అందించడంలో సైతం వివక్షను చూపుతోంది. బీజేపీయేతర రాష్ట్రాలపై ఆర్థిక ఆంక్షలు విధిస్తూ ప్రతీకార రాజకీయాలకు ...10లో

కరువు వల్ల జరిగిన నష్టం... కేంద్రం ఇచ్చిన పరిహారం

సం॥	మండలాలు	నష్టం (కోట్లల్లో)	కేంద్ర పరిహారం
2015-16	231	3,506	274+791=1,065
2016-17	313	2,806	288
2017-18	232	2,200	302
2018-19	280	1,800	318
2019-20	383	4,500	333
	1,439	14,812	2,306

వరదల వల్ల జరిగిన నష్టం... కేంద్రం ఇచ్చిన పరిహారం

స॥	ఎకరాలు (లక్షల్లో)	నష్టం (కోట్లల్లో)	కేంద్ర పరిహారం
2018-19	8.94	2,100	-
2019-20	0.50	500	-
2020-21	12.33	4,500	599
2021-22	6.20	3,600	599
2022-23	16.00	4,000	629
2023-24	12.00	4,000	660
	5.00	1,500	-

(వరదలతో పాటు 2022, 23లో రాష్ట్రంలో కురిసిన వడగండ్ల వానల వల్ల పలు జిల్లాల్లో రూ.4,500 కోట్ల పంటలకు నష్టం జరిగింది)

ప్రాణాలు తీస్తున్న లాభాపేక్ష

సేఫ్టీ మెజర్‌మెంట్స్ పట్టని యజమాన్యాలు

- నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణాలు
- కాలం చెల్లిన రియాక్టర్లు..
- తనిఖీలు పట్టని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్లు
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపాలు
- నైపుణ్యలేమి.. అనుభవరాహిత్యం
- నిన్న కోలాండ్.. నేడు ఎస్‌బీ ఆర్గానిక్స్
- నెల రోజుల్లోనే మూడు ఘోర ప్రమాదాలు
- 11 మంది కార్మికులు మృతి..
- 50 మందికి పైగా తీవ్ర గాయాలు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి


కంపెనీ యజమానుల లాభాపేక్ష.. నిర్వాహకుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు మంటల్లో కలుస్తున్నాయి. పెట్టుబడులు రావాలి.. ఫ్యాక్టరీలు నెలకొల్పాలి.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలి.. అలాగే మనిషి ప్రాణాలూ కాపాడబడాలి.. కానీ..! ఉత్పత్తి పెంచడం.. లాభాలు పొందడం తప్ప యజమానులకు కార్మికులు, ఉద్యోగుల ప్రాణాల గురించి పట్టట్లేదు. కాలం చెల్లిన రియాక్టర్లను పెట్టడం, నైపుణ్యం, అనుభవంలేని కార్మికులు పని చేయించడం, సేఫ్టీ మెజర్‌మెంట్స్ లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నిన్న కోలాండ్.. నేడు ఎస్‌బీ ఆర్గానిక్ కెమికల్ ఫ్యాక్టర్లీలో భారీ పేలుళ్ల సంభవించి దాదాపు 11 మంది మృతి చెందగా 50 మంది పైగా కార్మికులు క్షతగాత్రులయ్యారు. నిరంతరం తనిఖీలు చేయాల్సిన ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్లు యజమానులిచ్చే కాసులకు కక్కుర్తిపడి ఎన్‌ఓసీ ఇస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఫ్యాక్టరీ యజమానులు ఇష్టారాజ్యంగా మారారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా సంగారెడ్డి జిల్లా పేరుగాంచింది. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం మినీ ఇండియాను తలపిస్తుంది. పరిశ్రమలు విస్తరిస్తున్న కొద్ది ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 2 వేల పరిశ్రమలున్నాయి. పటాన్‌చెరు ప్రాంతంలోనే 1500 వరకు పరిశ్రమలున్నాయి. ఫార్మా ...10లో

యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలి


మృతుల కుటుంబాలకు రూ.41 లక్షల చొప్పున పరిహారం 10లో..

సీజ్ చేసిన డబ్బు..ఎవరికిచ్చారు?

ఫోన్ ట్యాపింగ్ కేసులో రాధాకిషన్‌రావును నిలదీసిన దర్యాప్తు అధికారులు



- మొయినాబాద్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం వెనకా ఫోన్ ట్యాపింగే
- దర్యాప్తును లోతుగా సాగిస్తున్నామన్న పశ్చిమ మండలం డీసీపీ



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో కలకలం రేపిన ప్రతిపక్ష నాయకుల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక నిందితుడైన నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును గురువారం స్పెషల్ టీం అధికారులు ప్రశ్నలతో ముంచెత్తారు. ఏడు రోజుల కస్టడీలో భాగంగా తొలిరోజు విచారించి స్పెషల్ టీం అధికారులు.. గతంలో ఆయన ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తును ముందుకు కొనసాగించారు. విపక్ష నాయకులలో ఎంతమందివి ఫోన్ ట్యాపింగ్ చేశారు? అందులో తేలిన అంశాలపై ఎవరికి రిపోర్ట్ చేశారు? ఈ ఫోన్ ట్యాపింగ్‌లు చేయాలని ఎవరెవరు నాయకులు, అధికారులు మీకు ఆదేశాలిచ్చారు? అక్రమంగా ఈ విధంగా ఫోన్ ట్యాపింగ్ చేయటం చట్టపరంగా నేరమని మీకు తెలియదా? ఈ వ్యవహారం ద్వారా మీరు పొందిన లబ్ది ఏమిటి? వంటి మొదలైన ప్రశ్నలతో రాధాకిషన్‌రావును దర్యాప్తు అధికారులు ఉక్కిరిబిక్కిరి చేశారు. అలాగే, ...10లో

ఎన్ని అందమైన పేర్లు ఉన్నప్పటికీ
బానిసత్వం అనేది నీచమైనది - ఎపిజె అబ్దుల్ కలాం

రాజకీయ దాహార్తి...

సంపాదకీయం

రాష్ట్రంలో ఒకవైపు ఎండలతో వాతావరణం వేడెక్కింది. మరోవైపు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పొలిటికల్ హీట్ పెరిగింది. ఈ వారంలో ఆ హీట్‌కు తాగు, సాగునీటి ఎద్దడి అనేది కథా వస్తువైంది. ఇక్కడ గమ్మత్తేమిటంటే జనం గొంతెడుతున్న దుస్థితినీ, పంటలెండిపోతున్న పరిస్థితిని తమకనుకూలంగా మలుచుకునేందుకు అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ గోతికాడ నక్కలా కాచుక్కూర్చోవటం. ఎండాకాలం 'మండేకాలం...' అని మన పెద్దలు ఊరికే అనలేదు. కానీ ఇప్పుడు నీటి సమస్యపై నేతలు నిజంగానే మండిపోతున్నారు. కాకపోతే 'ఇది కాలం తెచ్చిన కరువు...' అంటూ కాంగ్రెస్ ఒంటి కాలి మీద లేస్తోంటే, 'లేదు.. లేదు... ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువు...' అంటూ బీఆర్ఎస్ శివాలెత్తుతోంది. ఇలా ఈ రెండు పార్టీల తిట్ల పురాణంతో మీడియా హోరెత్తుతోంది.

> మనమిప్పుడు ఏప్రిల్ మొదటి వారంలోనే ఉన్నాం. ఇంకా దాదాపు రెండున్నర నెలలపాటు భానుడి భగభగలను మనం భరించాల్సిందే. అప్పటి వరకూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన తాగునీటి సరఫరాకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. అధికారులను నియమించటంతోనే సరిపుచ్చకుండా కావాల్సినన్ని నిధులను విడుదల చేసి, జనం గొంతు తడపాలి. అలా కాకుండా లోక్‌సభ ఎన్నికల కోసమే అధికార, ప్రతిపక్షాలు ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతి విమర్శలతోనే కాలం వెళ్లదీస్తే ప్రజలు క్షమించరు.

వాస్తవానికి ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా ప్రతీ కాలానికి సంబంధించిన ప్రణాళికలు వేసుకోవటం పరిపాటి. వ్యవసాయ ప్రణాళిక, రుణ ప్రణాళిక, పంటల కొనుగోళ్ల ప్రణాళిక, విద్యా ప్రణాళిక తదితరాలు ఈ కోవలోకే వస్తాయి. ఆయా ప్రణాళికలు వేసుకోవటం, వాటికి చాలినన్ని నిధులు విడుదల చేయటం, ఆ తర్వాత వేసుకున్న ప్రణాళికలను అమలు చేయటమనేది ఇక్కడ కీలకాంశాలు. కానీ రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కార్... కరువు, తాగు, సాగునీటి ఎద్దడికి సంబంధించి ప్రణాళికలు వేసుకోవటంలో చాలా వెనుకబడిందని చెప్పక తప్పదు.

ఎందుకంటే... మనకు ఫిబ్రవరి ఆరంభం నుంచే 'నీటి ప్రమాద ఘంటికలు' మోగాయి. హైదరాబాద్‌తోపాటు పలు నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో 'తాగునీటికి కటకట' అనే శీర్షికలతో వార్తా కథనాలు




ప్రచురితమయ్యాయి. అప్పటి నుంచే నిర్దిష్టమైన ప్రణాళికలు వేసుకుని ఉంటే... ఇప్పుడు జనానికి ట్యాంకర్ల బాధ, భారం తప్పేవేమో. వాస్తవానికి సీఎంగా రేవంత్ డిసెంబరులో ప్రమాణం చేసిన తర్వాత వరుసగా మంత్రుల ప్రమాణ స్వీకారాలు, అసెంబ్లీ సమావేశాలు, పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల పరంపర కొనసాగింది. అటు తర్వాత లోక్‌సభ ఎన్నికల ప్రహసనం షురూ అయింది. ఈ క్రమంలో సర్కారుకు సమయం లేకపోవటం, ఉన్న కొద్దిపాటి సమయాన్ని కూడా 'రాజకీయానికే' వాడుకోవటంతో 'నీటి గోస' మరింత తీవ్ర రూపం దాల్చిందని చెప్పక తప్పదు. దీన్ని రాజకీయంగా వాడుకునేందుకు బీఆర్ఎస్ తహతహలాడుతోంది. వాస్తవానికి ఆ పార్టీ ఏలుబడిలో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ అనే పథకాలను ప్రారంభించి, ప్రజలకు కొంతలో కొంత మేలు చేయటాన్ని మనం విస్మరించకూడదు. అదే సమయంలో ఆ రెండు పథకాల్లో బోలెడంత అవినీతి జరిగిందంటూ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపించటం గమనార్హం.

ఈ రెండు పార్టీల రాజకీయం ఇట్లా ఉంటే... క్షేత్రస్థాయిలో మాత్రం తాగునీటి తండ్లాటతో జనం అవస్థలు పడుతున్నారు. పశువులు, పక్షులు, వన్యప్రాణులు గొంతెండి గోస పడుతున్నాయి. తాజాగా నాగార్జున సాగర్‌లో దప్పిక తీర్చుకునేందుకు వెళ్లిన వానరాలు... వాటర్‌ట్యాంకులో పడి మరణించటం, వారం రోజులపాటు అదే నీటిని సరఫరా చేయటం కలకలం రేపింది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సరఫరాపై పర్యవేక్షణకు పది మంది ఐఏఎస్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించటం హర్షణీయం. అయితే ఇది మాత్రమే సరిపోదు. ఒక నిర్దిష్ట ప్రణాళిక లేసుకుని తాగునీటి ఎద్దడిని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మనమిప్పుడు ఏప్రిల్ మొదటి వారంలోనే ఉన్నాం. ఇంకా దాదాపు రెండున్నర నెలల పాటు భానుడి భగభగలను మనం భరించాల్సిందే. అప్పటి వరకూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన తాగు నీటి సరఫరాకు నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి.

అధికారులను నియమించటంతోనే సరిపుచ్చకుండా కావాల్సినన్ని నిధులను విడుదల చేసి, జనం గొంతు తడపాలి. అలా కాకుండా లోక్‌సభ ఎన్నికల కోసమే అధికార, ప్రతిపక్షాలు ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతి విమర్శలతోనే కాలం వెళ్లదీస్తే ప్రజలు క్షమించరు. ఈ విషయాన్ని పాలకులు, ప్రతిపక్షాలు గమనించాలి. ఎందుకంటే... లోక్‌సభ ఎలక్షన్ల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు కూడా ఉన్నాయి కాబట్టి.

దేశానికి నేతకాదు, ప్రజాహితం కోరే నీతి కావాలి!



డాక్టర్ దేవరాజు మహారాజు


'భారత్'లో భా-అంటే భావన, ర-అంటే రాగం, త-అంటే తాళం. భావం, రాగం, తాళం- ఈ మూడింట మేలు కలయికే భారత్:- అని అన్నారు సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి. ఇంతటి అవగాహన అధికారంలో ఉన్న బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి ఉందా? ఉంటే ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో దేశంలో ఎవరూ ఎప్పుడూ పాల్పడనంత అవినీతికి ఎందుకు పాల్పడుతుందీ? పైగా కాంగ్రెస్ బ్యాంక్ ఎకౌంట్లన్నీ ఎందుకు బ్లాక్ చేస్తుందీ? అంటే ఎన్నికల సమయంలో విపక్షాన్ని ఆర్థికంగా కట్టడి చేసి, తాము మాత్రం విచ్చల విడిగా దోచుకోవడానికే కదా? దేశ ప్రజలు గమనిస్తున్నారు.

ఎలక్టోరల్ బాండ్స్ రహస్యం బయటపడగూడదని బీజేపీ-కేంద్ర ప్రభుత్వం ముందుగా ఎస్‌బిఐని కట్టడి చేసింది. ఏది ఏమైనా తమ పార్టీకి ఎంత చందా వచ్చిందో, ఎవరెవరు ఎంతెంత ఇచ్చారో బయటికి రాగూడదని జాగ్రత్తలు తీసుకుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా ప్రభుత్వానికి వంతపాడుతూ సుప్రీంకోర్టుకు అనేకసార్లు అబద్ధాలు చెప్పింది. ఎన్నికలు పూర్తయ్యేవరకు తాము ఇవ్వలేమని సుప్రీంకోర్టుకు తెలియ జేసింది. ఆ విషయంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించి, వెంటనే అందించాలని ఒత్తిడి చేసిన మీదట విధిలేక అందించింది. ఈ నాటకాన్ని దేశ ప్రజలు ఆసక్తిగా గమనించారు. ఆ సంచలన వార్తను తగ్గించడానికి - కేంద్రం, పౌరసత్వ చట్టాన్ని(సిఏఏ) అమలు చేస్తున్నామని ఉన్న ఫళాన ప్రకటించింది. ఇటు ఎస్‌బిఐ యూనిక్ సీరియల్ నెంబర్‌తో సహా ఎలక్టోరల్ బాండ్స్ వివరాలు సుప్రీంకోర్టుకు అందించేసరికి కేంద్రానికి ఏం చేయాలో పాలుపోక లిక్కర్ స్కాం పేరుతో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను, తెలంగాణ బీఆర్ఎస్ పార్టీకి చెందిన కవితను ఆగమేఘాల మీద అరెస్ట్ చేశారు. బాగానే ఉంది నాటకం-కానీ, ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న ఇద్దరిని ఏడాది నుండి జైల్లో ఉంచి కూడా ఏమీ నిరూపించలేకపోయారే- అంటే తమ అసమర్థతని తామే ప్రకటించుకున్నట్టే కదా? దేశ ప్రజలు నీతిలేని బీజేపీ నాటకాలన్నీ చూస్తూనే ఉన్నారు. అందుకే మాకు 'నేత' అక్కరలేదు. జనహితం కోరే 'నీతి' కావాలి- అని అంటున్నారు. నీతిమంతులెవరైనా సరే, ప్రజా సంక్షేమం కోరుతూ, దేశాన్ని అభివృద్ధి పథాన నడిపే వారు కావాలని అంటున్నారు.

ఏప్రిల్ 2019 నుండి 2024 మధ్య 12156 కోట్ల రూపాయలు ఎన్నికల చందా 26 రాజకీయ పార్టీలకు అందింది. ఇందులో ఆరువేల అరవై కోట్ల అత్యధిక మొత్తం బీజేపీ ఖాతాలోకి వెళ్లింది. అంటే సుమారు 48 శాతం. దీని అర్థం ఏమిటీ? మిగతా 25 రాజకీయ పార్టీలకు అందిన చందా మొత్తం కంటే, ఒక్క బీజేపీకి అందిన చందాయే ఎన్నోరెట్లు అధికం! బీజేపీకి అధిక మొత్తంలో చందాలిచ్చిన పది కంపెనీలు ఈ విధంగా ఉన్నాయి.

1. మేఘా ఇంజనీరింగ్ చాలా ఎక్కువ మొత్తంలో బీజేపీకి చందా ఇచ్చింది.
2. ఆ తరువాత రిలయెన్స్ గ్రూపు ఇచ్చిన చందా రూ.375 కోట్లు
3. మూడవ స్థానంలో వేదాంత గ్రూపు వస్తుంది. ఇది 226 కోట్ల రూపాయలిచ్చింది.
4. నాలుగో స్థానంలో ఎయిర్ టెల్ ఉంది. ఇది 197 కోట్ల రూపాయలిచ్చింది.
5. మదర్ లాల్ లిమిటెడ్ రూ.175 కోట్లు
6. కెవేటర్ ఫుడ్ పార్క్ రూ.144 కోట్లు
7. డి.ఎల్.ఎఫ్ రూ.130 కోట్లు
8. బిర్లా కార్బన్ రూ.105 కోట్లు
9. ఫ్యూచర్ గేమింగ్ రూ.100 కోట్లు
10. హల్దియా ఎనర్జీ రూ.81 కోట్లు.

ఎలక్షన్ చందాలిచ్చాయి. ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో బీజేపీకి అత్యధికంగా చందాలిచ్చిన కంపెనీల వివరాలు ఇవి- ఇంకా తక్కువ మొత్తంలో చందాలిచ్చిన కంపనీలు అనేకం ఉన్నాయి. ఈ వివరాలు కేవలం విషయం అర్థం చేసుకోవడానికే - అక్రమంగా బీజేపీ ఎంతెంత చందా వసూలు చేసిందో ఎన్నెన్ని అక్రమ నిల్వలు పోగేసుకుందోననే పూర్తి వివరాలు ఇక్కడ ఇవ్వడం లేదు. యం.ఎల్.ఎలను కొని, యం.పిలను కొని, ఎన్నికైన ప్రభుత్వాలని కూల్చి బీజేపీ ఎలా అధికారం చేపడుతూ వస్తుందో- మనం చూస్తున్నాం. అలా కొనగలగడానికి ఆ పార్టీకి అంత డబ్బు ఎలా వస్తుందో- ఇప్పుడీ ఎలక్టోరల్ బాండ్స్‌తో కొంత వెలుగులోకి వచ్చింది. ఇంకా బయటపడని అవినీతి ఎంత ఉందో - చూడాలి! అయితే మనం ఇక్కడ ఒక్క విషయం అర్థం చేసుకోవాలి! ముఖ్యం గా, ఎనర్జీ కంపెనీలు రాజకీయ పార్టీల ఖజానా నింపు తున్నాయి. ఎనర్జీ సెక్టర్‌కు సంబంధించిన కంపనీలు అమ్ముడయిన ఎలక్టోరల్ బాండ్స్‌లో ముప్పయి శాతం అంటే సుమారు 3600 కోట్ల రూపాయలు ఎన్నికల చందా కింద సమర్పించుకున్నాయి.



అధికారంలో ఉన్న రాజకీయ పార్టీకి ఇంత పెద్ద మొత్తంలో చందాలిస్తూ ఉండాల్సి వస్తే, ఇక అసలు దేశంలో వ్యాపార రంగం నిలదొక్కుకోగలదా? ఇంకా కొత్త కొత్త పరిశ్రమలు రావడానికి అసలు అవకాశం ఉందా? వంటి ప్రశ్నలు ఉత్పన్న మౌతున్నాయి. డిఎల్ఎఫ్‌పై జనవరి 2019లో సిబిఐ రెయిడ్ జరిగింది. వెంటనే ఆ కంపెనీ రూ.130 కోట్లు ఎన్నికల చందా ఇచ్చింది. అలాగే మార్చి 2020లో హల్దియా లిమిటెడ్‌పై ఈడి సోదాలు ప్రారంభించింది. వెంటనే ఆ కంపనీ బీజేపీకి 82 కోట్ల రూపాయల చందా ఇచ్చింది. ఇలా కంపనీలు పెద్ద మొత్తంలో ఎందుకు చందాలిస్తున్నాయీ? అనేది అర్థం చేసుకోవాలి. పర్యావరణానికి హాని కలుగజేసే పనులు చేయడానికి, నల్లడబ్బును తెల్లగా మార్చుకోవడానికి, ఇంకా ఇతరాత్ర అవినీతి పనులు చేసుకోవడానికి అధికారంలో ఉన్న బీజేపీకి చందాలి స్తున్నాయి. అంటే ఆ పార్టీ, ఆ ప్రభుత్వం వారి కార్యక్రమాల్ని చూసి చూడనట్టు వదిలేయాలి. అది వారి మధ్య గల అవగాహన- ఒప్పందం. దీన్నే క్విడ్-ప్రో-కో అంటే మళ్లీ మన దేశ నాయకుల భుజాలు తడుము కుంటారు. దౌర్జన్యంగా ఎదురు దాడికి దిగుతారు. వారెంత అవినీతికి పాల్పడు తున్నారో, ఎంత అనైతిక కార్యక్రమాల్ని ప్రోత్సహిస్తున్నా రో - చేస్తున్నారో- ఆత్మ విమర్శ మాత్రం చేసుకోరు. దేశ ప్రజలు ఈ విషయాలు గ్రహిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో వారు చేయాల్సింది చేస్తారు.

> దేశ ప్రజలకు విశ్వాసం కలిగించాలి. ఇప్పుడు 'మోడీ గ్యారంటీ' -అంటున్నారు. అటు కుటుంబాన్ని, ఇటు దేశ ప్రజల్ని గాలికి వదిలేసింది చూస్తూనే ఉన్నాం కదా? మోడీ గ్యారెంటీ అంటే ఏదీ మరి ప్రతి ఎకౌంట్లో రూ.15 లక్షల గ్యారెంటీ? ప్రాజెక్టుల గ్యారెంటీ? ఉద్యోగాల గ్యారెంటీ? సామాన్యుడికి తిండి అందించలేకనే కదా హంగర్ ఇండెక్స్‌లో అట్టడుగుకు పడిపోయాం? పడిపోయిన రూపాయి విలువ పైకి లేవదెందుకూ? వీళ్లా గ్యారెంటీ గురించి మాట్లాడేదీ? నిబద్ధత, నైతికతా లేని నాయకులు ఈ దేశానికి అక్కరలేదు. కేవలం నీతిగల వారు ప్రజాహితం కోరేవారు మాత్రమే కావాలి! పదేండ్లుగా సొల్లు ఉపన్యాసాలు వింటూనే ఉన్నాం. కపట ప్రేమలు, విచిత్ర వేషధారణలు, నటనలు చాలు- కట్టి పెట్టండి - అని ఈ దేశపు, అంతరాత్మ చెపుతోంది. స్వచ్ఛతకోసం, నిజాయితీ కోసం నిలబడే పార్టీ బీజేపీ కాదని ఈ దేశ ప్రజలు నిర్ణయించుకున్నారు.

కంపెనీలు మాత్రమే కాకుండా వ్యక్తిగతంగా కూడా కొందరు ఎలక్టోరల్ బాండ్స్ కొని బీజేపీకి ఎన్నికల చందా సమర్పించుకున్నారు. ఇలాంటి వారిలో మిత్తల్ సుమారు రూ.35 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్స్ కొని ఆ మొత్తం బీజేపీకి సమర్పించుకున్నాడు. ఎలక్ట్రికల్ వైర్, కేబుల్ తయారు చేసే పాలికేబ్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ - ప్రెసిడెంటూ అయిన ఇంద్ర ఠాకూర్ దాస్ జయ్ సింఘానీ సుమారు రూ.14 కోట్ల ఎలక్టోరల్ బాండ్స్ కొని మొత్తం డబ్బు బీజేపీ ఖాతాలో జమ చేశాడు. ఈ రకంగా ఇంకా ఎంతోమంది వ్యక్తిగతంగా దానాలు చేసిన దాతలున్నారు. వీరంతా బీజేపీ బెదిరింపులకు భయపడి, తమను తాము సురక్షితంగా ఉంచుకోవడానికి మాత్రమే ఇచ్చారు. బీజేపీ-ఆరెస్సెస్ ఆలోచనా విధానానికి ఆకర్షితులై స్వచ్ఛందంగా ఇచ్చిన వారు ఒక్కరంటే ఒక్కరు లేదు- ఫ్యూచర్ గేమింగ్ హోటల్ సర్వీసెస్ కంపనీ ఒక సంవత్సరంలో తమకు వచ్చిన లాభాల కంటే-ఆరు రెట్లు అధిక మొత్తం రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చింది. ఎందుకు ఈ కంపనీ అధికారంలో రాజకీయ పార్టీలకు పెద్ద మొత్తంలో చందాలిస్తూ ఉందో అర్థం చేసుకోవాలంటే లాటరీల గురించి కూడా ఇక్కడ కొంత తెలుసుకోవాలి! ఈ లాటరీ విధానం దేశంలో సుమారు పదమూడు రాష్ట్రాలలో వ్యాపించి ఉంది. లాటరీలో భాగస్వాములు కాదలచిన వారు కొంత మొత్తానికి లాటరీ టికెట్లు కొంటారు. అలా పెద్ద మొత్తంలో డబ్బు పోగవుతుంది. అందులోంచి బహుమతి వచ్చిన వారికి బహుమతిగా కొంత డబ్బు ఇస్తారు. మనకు ఇంతవరకే తెలుసు కానీ, లాటరీ నిర్వాహకులు స్థానిక ప్రభుత్వాలకు టాక్స్‌లు చెల్లించాలి. 1998నాటి లాటరీ రెగ్యులేషన్ చట్టం ప్రకారం రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాలు దీనికి సంబంధించిన విధి విధానాలు రూపొందించి ఆ స్కీమ్‌ను అజమాయిషీ చేస్తాయి. ప్రభుత్వం తమ పట్ల కొంత ఉదార స్వభావంతో ఉండాలని, ప్రభుత్వాలను మంచి చేసుకోవడానికి ఇలాంటి లాటరీ కంపనీలు ప్రభుత్వానికి చందాలిస్తుంటాయి. ఇప్పటి బీజేపీ కేంద్ర ప్రభుత్వ వైఖరి కూడా అదే-"చందా ఇవ్వు-దందా చేస్కో".

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అప్రూవర్‌గా మారిన వ్యాపారవేత్త అరవిందో ఫార్మ శరత్ రెడ్డి అరెస్ట్ అయిన తర్వాత బీజేపీకి రూ.5 కోట్ల చందా ఇచ్చాడు. ఎందుకిచ్చాడూ? ప్రభుత్వం తనమీద కఠినంగా ప్రవర్తించగూడదనే కదా? ఇక కేజ్రీవాల్ అరెస్ట్ విషయానికి వస్తే-ప్రతిపక్షాలన్నీ తీవ్రంగా నిరసించాయి. ఒక్కతాటిపైకి వచ్చి నినదిస్తున్నాయి. మరోవైపు "ఈవియం మిషన్లు' వద్దనీ బాలెట్ పేపర్‌తో ఎన్నికలు జరిపించాలనీ అడ్వొకేట్లు, ఉద్యోగులు సమాజంలోని వివిధ వర్గాల వారు ఢిల్లీలో ధర్నాలు చేస్తున్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతు ఉద్యమం కొనసాగుతూనే ఉంది. ప్రజాస్వామ్యం కనిపించడం లేదని, కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

దేశ ప్రజలకు విశ్వాసం కలిగించాలి. ఇప్పుడు 'మోడీ గ్యారంటీ' -అంటున్నారు. అటు కుటుంబాన్ని, ఇటు దేశ ప్రజల్ని గాలికి వదిలేసింది చూస్తూనే ఉన్నాం కదా? మోడీ గ్యారెంటీ అంటే ఏదీ మరి ప్రతి ఎకౌంట్లో రూ.15 లక్షల గ్యారెంటీ? ప్రాజెక్టుల గ్యారెంటీ? ఉద్యోగాల గ్యారెంటీ? సామాన్యుడికి తిండి అందించలేకనే కదా హంగర్ ఇండెక్స్‌లో అట్టడుగుకు పడిపోయాం? పడిపోయిన రూపాయి విలువ పైకి లేవదెందుకూ? వీళ్లా గ్యారెంటీ గురించి మాట్లాడేదీ? నిబద్ధత, నైతికతా లేని నాయకులు ఈ దేశానికి అక్కరలేదు. కేవలం నీతిగల వారు ప్రజాహితం కోరేవారు మాత్రమే కావాలి! పదేండ్లుగా సొల్లు ఉపన్యాసాలు వింటూనే ఉన్నాం. కపట ప్రేమలు, విచిత్ర వేషధారణలు, నటనలు చాలు- కట్టి పెట్టండి - అని ఈ దేశపు, అంతరాత్మ చెపుతోంది. స్వచ్ఛతకోసం, నిజాయితీ కోసం నిలబడే పార్టీ బీజేపీ కాదని ఈ దేశ ప్రజలు నిర్ణయించుకున్నారు.

మోడీ 'చందామామ' అయిపొయ్యాడు-చందా ఇవ్వు దందా చేస్కో అని కార్పోరేట్లకు దేశాన్ని అమ్మేస్తున్నాడు-

కేంద్ర సాహిత్య అకాడమీ విజేత, జీవశాస్త్ర వేత్త
(మెల్బోర్న్ నుంచి)

> అధికారంలో ఉన్న రాజకీయ పార్టీకి ఇంత పెద్ద మొత్తంలో చందాలిస్తూ ఉండాల్సి వస్తే, ఇక అసలు దేశంలో వ్యాపార రంగం నిలదొక్కుకోగలదా? ఇంకా కొత్త కొత్త పరిశ్రమలు రావడానికి అసలు అవకాశం ఉందా? వంటి ప్రశ్నలు ఉత్పన్న మౌతున్నాయి. డిఎల్ఎఫ్‌పై జనవరి 2019లో సిబిఐ రెయిడ్ జరిగింది. వెంటనే ఆ కంపెనీ రూ.130 కోట్లు ఎన్నికల చందా ఇచ్చింది. అలాగే మార్చి 2020లో హల్దియా లిమిటెడ్‌పై ఈడి సోదాలు ప్రారంభించింది. వెంటనే ఆ కంపనీ బీజేపీకి 82 కోట్ల రూపాయల చందా ఇచ్చింది. ఇలా కంపనీలు పెద్ద మొత్తంలో ఎందుకు చందాలిస్తున్నాయీ? అనేది అర్థం చేసుకోవాలి. పర్యావరణానికి హాని కలుగజేసే పనులు చేయడానికి, నల్లడబ్బును తెల్లగా మార్చుకోవడానికి, ఇంకా ఇతరాత్ర అవినీతి పనులు చేసుకోవడానికి అధికారంలో ఉన్న బీజేపీకి చందాలిస్తున్నాయి.

ఇజ్రాయిల్ రక్తదాహం!

తక్షణమే కాల్పుల విరమణ చేయాలంటూ భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని ఖాతరు చేయబోనంటూ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ఇటీవల చేసిన ప్రకటన యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ దాడుల్లో పాలస్తీనా ఇప్పటికే నెలల తరబడి నెత్తురోడుతోంది. అక్టోబర్ ఏడున ఈ అమానుష కాండ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 32 వేల మందికి పైగా పాలస్తీనీయులు మృతి చెందారు. వీరిలో అత్యధికులు మహిళలు, చిన్నారులే! పదివేల మంది మైనర్లు మరణించినట్లు గాజా మంత్రివర్గం అధికారికంగా ప్రకటించింది. సొరంగాల సాకుతో ఆసుపత్రులపైన కూడా బాంబులు, తూటాల వర్షం కురిపించి మంచాలమీద కదల్లేని స్థితిలో ఉన్న వందలాది రోగులను కూడా అత్యంత క్రూరంగా హత్యచేయించిన దుర్మార్గం ఇజ్రాయిల్ సొంతం! ఏకపక్ష యుద్ధకాండలో ఇప్పటివరకు 1.10 లక్షల మంది గాయపడ్డారు. ఇది గాజా జనాభాలో సుమారు ఐదు శాతం! గాయపడ్డవారిలో 68.1 శాతం మంది సాధారణ



పౌరులని లాన్‌సెట్ అంచనా వేసింది. వీరుగాక మరో పది వేల మంది ఆచూకీ గల్లంతైంది. వీరు బతికి, కళ్ల ముందు కనపడతారన్న ఆశలు ఎవరికీ లేవు. మృతదేహాలు దొరకలేదు కాబట్టి విగత జీవుల లెక్కల్లో వీరిని చేర్చలేదు అంతే! అక్కడ కనిపించే హృదయ విదారక దృశ్యాల గురించి ఎంత చెప్పినా తక్కువే!

ఇంత ఘోరం జరుగుతోంది కాబట్టే కాల్పుల విరమణ చేయాలంటూ ఆలస్యంగానైనా భద్రతామండలి తీర్మానాన్ని చేసింది. ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసం ఒకవైపు జరుగుతుండగా, మరోవైపు ఇప్పటివరకు మీనమేషాలను లెక్కించిన భూగోళపు అత్యున్నత భద్రతా సంస్థ ఎట్టకేలకు శాంతి సందేశాన్ని వినిపించింది. గతంలో మూడుసార్లు వీటో చేసి ఈ తీర్మానాన్ని అడ్డుకున్న అమెరికా ఈసారి ఓటింగ్‌కు గైర్హాజరు కావడం గమనార్హం. మండలిలో మిగిలిన 14 దేశాలూ తీర్మానానికి అనుకూలంగా ఓటువేశాయి. ఈ తీర్మానాన్ని భద్రతా మండలి చర్చిస్తున్న సమయంలో కూడా గాజాలో నెత్తుటి ధారలను పారించి క్రూరత్వాన్ని చాటుకున్న ఇజ్రాయిల్, అమెరికా అనుసరించిన వైఖరిని తీవ్రంగా తప్పుపట్టింది. ఈ సారి కూడా వీటో ఎందుకు ఉపయోగించ లేదని నిలదీసింది. దీనికి ప్రతిగా భూతల దాడులకు ప్రత్యామ్నాయాలను వెతికేందుకు తమ దౌత్యబృందం తలపెట్టిన వైట్‌హౌస్ సందర్శనను రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. అదే సమయంలో తమ దాడులు కొనసాగుతాయని, భద్రతామండలి తీర్మానాన్ని ఖాతరు చేసేది లేదని నెతన్యాహు తేల్చిచెప్పారు. చెప్పినట్లుగానే భద్రతా మండలి తీర్మానం చేసిన 24 గంటల తరువాత కూడా గాజా వీధుల్లో సైనికుల పదఘట్టనలు, కాల్పుల శబ్దాలు, బాంబుల మోతలు వినిపిస్తున్నట్లు వార్తలు వస్తుండటం బాధాకరం! అదే సమయంలో అమెరికా ఇప్పుడు తీసుకున్న వైఖరికి కూడా కట్టుబడి ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దేశ అధ్యక్ష పదవికి జరగనున్న ఎన్నికలే దీనికి కారణం కావచ్చు.

గాజాలో విస్తృతంగా పర్యటించిన ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఫ్రాన్సిస్ స్కా అల్బనీస్ ఇజ్రాయిల్ ఊచకోత (జినోసైడ్) కు పాల్పడుతోందని స్పష్టం చేశారు. ఈ మేరకు 'ది అనాటమీ ఆఫ్ ఎ జినోసైడ్' పేరుతో రూపొందించిన నివేదికను ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘానికి అందజేశారు. 'గాజాలో ఒక సమూహంగా పాలస్తీనీయన్లపై మారణహోమం జరుగుతోంది. దీనిని నిర్ధారించడానికి అవసరమైన సాక్ష్యాధారాలు ఉన్నాయి. మానవత్వంపై జరుగుతున్న ఈ అమానుష హింసాకాండను నివేదించడం నా కర్తవ్యం. సభ్య దేశాలు తక్షణం స్పందించకుంటే మరింత ఘోరం జరుగుతుంది. ఇజ్రాయిల్‌పై తక్షణం ఆంక్షలు విధించాలి. ఆ దేశానికి ఆయుధాల అమ్మకాలను నిలిపివేయాలి. ఇటువంటి హింసాకాండ మళ్లీ జరగకుండా చూడాలి' అంటూ అని ఆమె నివేదికలో పేర్కొన్న అంశాలు క్షేత్రస్థాయిలో నెలకొన్న భయానక పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో, గాజా ప్రజానీకం ప్రశాంతంగా ఊపిరి పీల్చడానికి అవసరమైన కార్యాచరణను చేపట్టాలి. రంజాన్ మాసం ముగియడానికి మరో వారం మాత్రమే సయయం ఉండటంతో ఆ లోగానే కాల్పుల విరమణను పాటించేలా ఇజ్రాయిల్‌ను కట్టడి చేయాలి. లేనిపక్షంలో పేరు గొప్ప ఊరు దిబ్బగా భద్రతా మండలి మిగిలిపోయే ప్రమాదం ఉంది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

కేజ్రీవాల్ అరెస్ట్ : సమైక్యంగా నిరసన తెలియచేయాలి!

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) అరెస్టు చేసి అదుపులోకి తీసుకోవడమనేది భారతదేశంలో ప్రజాస్వామ్యం నెమ్మదిగా తుడిచిపెట్టుకు పోవడంలో కీలకమైన మలుపు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ దారుణమైన దాడి అనేక కోణాల్లో మొదటిదిగా భావించబడుతోంది. సిట్టింగ్ ముఖ్యమంత్రిని, పైగా అసెంబ్లీలో ఐదింట నాలుగు వంతుల కంటే ఎక్కువ మెజారిటీ కలిగిన పార్టీకి నాయకత్వం వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేయడం తొలిసారి. జాతీయ పార్టీ అధినేతను కటకటాల వెనక్కి నెట్టడం కూడా ఇదే మొదటిసారి. లోక్‌సభ ఎన్నికలు ప్రకటించిన తర్వాత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత ఇలా అరెస్టు ప్రహసనం జరగడం కూడా ఇదే ప్రథమం.

> ఎన్నికల బాండ్ల పథకం ద్వారా ప్రతిపక్షాలకు చట్టపరమైన నిధులను నిలిపివేసిన తర్వాత, ఎన్నికల ట్రస్టుల ద్వారా కార్పొరేట్ల విరాళాలను గుత్తాధిపత్యం చేసిన తర్వాత, శిక్షాత్మకమైన పన్ను విధింపు చర్యల ద్వారా ప్రతిపక్షాలను ఆర్థికంగా ఇరుకున పెట్టడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వ అధికారాలపై వ్యవస్థాగతమైన దాడులకు పాల్పడిన తర్వాత కేజ్రీవాల్ అరెస్టు చోటు చేసు కుంది. ప్రతిపక్ష పార్టీల మాదిరిగానే ప్రతిపక్షాల పాలనలో వున్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దాడులను ఎదుర్కొంటున్నాయి. సమాఖ్యవాద సూత్రాలపైనే దాడులకు తెగబడడంతో ఇవన్నీ చేసుకుంటున్నాయి.

ప్రభుత్వ సాధనాలన్నింటినీ ఉపయోగించి ప్రతిపక్షాన్ని మొత్తంగా లేకుండా చేయాలన్నది పాలక పార్టీ ఉద్దేశంగా వుంది. కేంద్ర దర్యాప్తు సంస్థలను కీలకమైన ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడానికి ఉపయోగిస్తున్నారు. కేజ్రీవాల్ అరెస్టుకు ముందుగా, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇ.డి అదుపులోకి తీసుకుంది. ముఖ్యమంత్రి పదవికి ఆయన రాజీనామా చేసిన వెంటనే ఈ అరెస్టు చోటుచేసుకుంది. అంతకుముందు, ఢిల్లీ డిప్యూటీ ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కూడా అరెస్టయ్యారు. దాదాపు ఏడాది నుండి జైల్లో వున్నారు.ఇంకా అనేకమంది ప్రతిపక్ష నేతలు, మంత్రులు ఇలాగే జైల్లో వుండడమో లేదా కేంద్ర సంస్థల దర్యాప్తులను ఎదుర్కొనడమో చేస్తున్నారు.వీరందరూ కూడా బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాల్లోని మంత్రులు, నేతలే.

ప్రతిపక్ష నేతలను, చట్టసభల సభ్యులను బెదరించడానికి, వారు బీజేపీలోకి ఫిరాయించేలా చేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను చట్టవిరుద్ధంగా ఉపయోగిస్తున్నారు. ఎన్నికల బాండ్ల పథకం వివరాలన్నీ బహిర్గతమైన తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) మోస పూరితమైన పాత్ర బయటపడింది. మద్యం విధానం కేసులో కేజ్రీవాల్‌ను ఇరికించారు. ఫార్మాస్యూటికల్ కంపెనీ 'అరబిందో ఫార్మా' మేనేజింగ్ డైరెక్టర్ శరత్‌చంద్రరెడ్డిని ఇ.డి అరెస్టు



చేసింది. 2022 నవంబరులో ఈ అరెస్టు జరిగిన ఐదు రోజుల తర్వాత ఆయన కంపెనీ రూ.5 కోట్లను ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీకి విరాళంగా ఇచ్చింది. ఆ తర్వాత ఆయనకు బెయిల్ లభించింది, అప్రూవర్‌గా మారారు. నాలుగు మాసాల తర్వాత బాండ్ల ద్వారా బీజేపికి రూ.25 కోట్లు అందచేశారు. కేజ్రీవాల్ మీద, ఆప్ నేతల మీద కేసులు ఎలా మోపారో దీన్ని బట్టి తెలుస్తోంది.

ప్రతిపక్ష పార్టీలు ఇ.డి, సిబిఐల వేధింపులు, దాడులతో పాటుగా ఆదాయపన్ను అధికారుల దాడులను కూడా ఎదుర్కొంటున్నాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.135 కోట్ల మేరకు పన్నులు చెల్లించాలంటూ పంపిన నోటీసులను ఎదుర్కొంటోంది. ఈ మొత్తాన్ని ఐ.టి విభాగం రికవరీ చేసుకోవడానికి ముందుగానే ఆ పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేశారు. ఇతర పార్టీలు కూడా ఇలాంటి చర్యలనే ఎదుర్కొంటున్నాయి. ఉదాహరణకు, 2016-17 సంవత్సరానికి సీపీఐ(ఎం) పన్ను మినహాయింపును ఉపసంహరిం చుకుంది. దేశ వ్యాప్తంగా పార్టీకి గల వందలాది బ్యాంక్ ఖాతాల్లో కేవలం ఒక ఖాతాను లిస్ట్ చేయని సాంకేతిక పరమైన లోపానికి గాను రూ.15.59 కోట్లను పన్నుగా చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ అవాంఛనీయ చర్యకు నిరసనగా సీపీఐ(ఎం) ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిం చింది. ప్రస్తుతం ఈ విషయం న్యాయస్థానం పరిధిలో వుంది.

ఎన్నికల బాండ్ల పథకం ద్వారా ప్రతిపక్షాలకు చట్టపరమైన నిధులను నిలిపివేసిన తర్వాత, ఎన్నికల ట్రస్టుల ద్వారా కార్పొరేట్ల విరాళాలను గుత్తాధిపత్యం చేసిన తర్వాత, శిక్షాత్మకమైన పన్ను విధింపు చర్యల ద్వారా ప్రతిపక్షాలను ఆర్థికంగా ఇరుకున పెట్టడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వ అధికారాలపై వ్యవస్థాగతమైన దాడులకు పాల్పడిన తర్వాత కేజ్రీవాల్ అరెస్టు చోటుచేసుకుంది. ప్రతిపక్ష పార్టీల మాదిరిగానే ప్రతిపక్షాల పాలనలో వున్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దాడులను ఎదుర్కొంటున్నాయి. సమాఖ్యవాద సూత్రాలపైనే దాడులకు తెగబడడంతో ఇవన్నీ చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ అరెస్టును భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పొంచి వున్న ముప్పుగా చూడాలి. ఇక ఎలాంటి సాకులు లేవు, వున్న ముసుగు కూడా తొలగించబడింది. నియంతృత్వ పాలన ఎన్నికల నిరంకుశత్వాన్ని స్థాపించింది. ఎన్నికల కమిషన్, కార్యనిర్వాహక వర్గం అధీనంలో వుంది. విరుచుకు పడుతున్న ప్రభుత్వంతో ఘర్షణ పడేందుకు ఉన్నత న్యాయవ్యవస్థ నిరాకరిస్తోంది.

ఇటువంటి పరిస్థితుల్లో లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ కలిసి ప్రజల వద్దకు వెళ్లడం, ప్రజాస్వామ్యానికి, పౌరుల హక్కులకు కలుగుతున్న ముప్పుకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడం తప్ప మరో మార్గం లేదు. ప్రజల నిరసనలు కేవలం ఢిల్లీకే పరిమితం కారాదు.

దేశవ్యాప్తంగా ప్రతి చోటా వ్యాపించాలి, జరగాలి. మార్చి 31న ఢిల్లీలో 'ఇండియా' బ్లాక్ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తోంది. కేరళ ఈ విషయంలో ఇప్పటికే మార్గనిర్దేశనం చేసింది. అక్కడ రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ప్రజా నిరసనలు, ప్రచారాలు, ఆందోళనలు చేపట్టడం, జరగడం అత్యంత ముఖ్యం.ప్రజా సమీకరణ ఈ రీతిలో చోటుచేసుకుంటే కచ్చితంగా ఎన్నికల్లో అది బీజేపీని దెబ్బతీస్తుంది.

(మార్చి27 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
5
శుక్రవారం | ఏప్రిల్ 05, 2024 | www.navatelangana.com

పాలేరు నీటితో తక్షణమే చెరువులు నింపాలి



నవతెలంగాణ-నేలకొండపల్లి
తక్షణమే పాలేరు నీటితో చెరువులు నింపి గొంతెండుతున్న ప్రజలు, పశువులు దాహార్తిని తీర్చి ఆదుకోవాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కె.వి.రామారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవన్లో విలేకరులతో ఆయన మాట్లాడారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి సకాలంలో సాగునీరు అందకపోవడంతో వేలాది ఎకరాల్లో రైతులు సాగుచేసిన పంటలు నిలువునా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టించి అందిన కాడికి అప్పులు చేసి పంటలు సాగుచేసిన రైతన్నకు నోటి కందాల్సిన పంట నిలువునా ఎండిపోవడంతో పుట్టెడు దుఃఖంతో కుమిలిపోతున్నాడన్నారు. పంట దక్కించుకునేందుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో పాలు పోక రైతన్న తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడన్నారు. ఈ పరిస్థితుల్లో కనీసం దాహార్తితో అల్లాడుతున్న పశువులు, జనం గొంతులు తడిపేందుకైనా తక్షణమే పాలేరు రిజర్వాయర్ నుండి కాలువల ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు నింపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాగునీటి కొరతతో మనుషులతో పాటు మూగజీవాల జీవనం భారంగా మారిందన్నారు. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షనీయమని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - బోనకల్
బోనకల్ రైతు వేదిక నందు ప్రతి మంగళవారం రైతు నేస్తం పేరిట నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు మరీదు త్రివేణి, ధారగాని కళ్యాణి కోరారు. మండల పరిధిలోని రావినూతల, ముష్టికుంట్ల గ్రామాలలోని రైతులకు బోనకల్ రైతు వేదిక నందు ప్రతి మంగళవారం 'రైతు నేస్తం' పేరిట నిర్వహించే దృశ్యశ్రవణ (వీడియో కాన్ఫరెన్స్) సేవలపై క్షేత్ర స్థాయిలో గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో వారు మాట్లాడుతూ ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు, రైతులకు క్షేత్రస్థాయిలో వివిధ పంటలలో ఎదుర్కునే సమస్యలపై ముఖాముఖిగా చర్చిస్తారని తెలిపారు. డిజిటల్ సేవలలో భాగంగా శాస్త్ర వేత్తలు, నిపుణులు ఎల్లపుడూ అందుబాటులో ఉంటారన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు వివిధ పంటల యాజమాన్యం, చీడపీడల నివారణ, సమగ్ర పోషక యాజమాన్యం, నీటి యాజమాన్యం, కోతల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వాతావరణ పరిస్థితులు గురించి తగు సమాచారం ముఖ్య శాస్త్రవేత్తల ద్వారా రైతులకు నేరుగా వివరిస్తారని తెలిపారు. బోనకల్ రైతు వేదిక నందు ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను వారు కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ వలన రైతులకు వ్యవసాయంపై అనేక అంశాల మీద అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముష్టికుంట్ల రావినూతల గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సునీత్‌చోప్రా ఆశయాలు ముందుకు తీసుకెళ్దాం

ఆయన మరణం
వ్యవసాయరంగానికి తీరని లోటు
- వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్



నవతెలంగాణ-సత్తుపల్లి
ప్రజా నాయకుడు సునీత్‌చోప్రా ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక రావి వీరవెంకయ్య భవన్‌లో సునీల్‌చోప్రా ప్రథమ వర్ధంతిని జరిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, విద్యార్థి, యువజన ఉద్యమాలను దేశవ్యాప్తంగా విస్తృతంలో చేయడంలో అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శిగా సునీల్‌చోప్రా సుదీర్ఘకాలం పనిచేశారన్నారు. వ్యవసాయ కూలీల అభివృద్ధి కోసం అనేక డాక్యుమెంట్స్‌ను రూపొందించి వాటిని కేంద్రప్రభుత్వానికి అందించి వాటిపై సమగ్ర చట్టాలు చేయాలని కోరారన్నారు. ఏప్రిల్ 4, 2023న ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో సునీల్‌చోప్రా గుండెపోటుతో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణం వ్యవసాయ రంగానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు, వ్యకాస మండల కమిటీ నాయకులు ముత్తిని శ్రీను, బండి వేలాద్రి, సప్పిడి భాస్కర్, కమలమ్మ, తడికమళ్ల రామకృష్ణ, కవిత, రెడ్డమ్మ, సత్యవతి, రామారావు, బాషా, తిరుపతి పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-వైరాటౌన్
వైరా పట్టణంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఖమ్మం జిల్లా కార్యాలయాన్ని గురువారం వైరా పట్టణంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బొడ్డపాటి దాసు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు మంచు కిరణ్ కుమార్ అధ్యక్షత జరిగిన సమావేశంలో డాక్టర్ బొడ్డపాటి దాసు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కార్యాలయాన్ని వైరాలో ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యాలయంలో హ్యూమన్ రైట్స్ కార్యకర్తలకు నిరంతరం రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన తరగతులు నిర్వహిస్తూ, ప్రజలకు చట్టాలను గూర్చి తెలియజేస్తూ వారిని చైతన్యపరుస్తామని అన్నారు. ఈ కార్యాలయాన్ని వైరాలో ఏర్పాటు చేయడానికి కషి చేసిన జిల్లా ప్రధానకార్యదర్శి ఆదూరి మణిని, ఆదూరి ఆనందంను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ ప్రోగ్రాం కో - ఆర్డినేటర్ కోట వెంకట్, బహుజన అభ్యుదయ సేవా సమితి వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తెళ్ళూరి చిన్న ఏసు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బొడ్డపాటి దాసు, జాతీయ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కోట వెంకట్, రాష్ట్ర కో ఆర్డినేటర్ కన్నెపోగు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తెళ్ళూరి ఏసు, జిల్లా అధ్యక్షులు మంచు కిరణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు రోషిని, జిల్లా ప్రధానకార్యదర్శి ఆదూరి మణి, జిల్లా కమిటీ సభ్యులు ఆదూరి కృష్ణవేణి, కొణిజర్ల, తల్లాడ, ఎర్రుపాలెం, కల్లూరు మండల అధ్యక్షులు కోట యశోద, తెళ్ళూరి మరియమ్మ, కటుకూరి నిర్మల, భవాని, పాస్టర్ కటుకూరి రూపస్ బాబు, సరిత తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య?

నవతెలంగాణ - బోనకల్
రైలు కింద పడి ఓ యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంచలనంగా మారింది. కొంతమంది స్థానికులు ఆత్మహత్య చేసుకున్నాడని మరికొంతమంది ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందాడని అంటున్నారు. పూర్తి వివరాల మాత్రం బయటకు వెల్లడి కావడం లేదు. స్థానికులు, విశ్వాసనీయ సమాచారం ప్రకారం రావినూతల గ్రామ పంచాయతీ పరిధిలోనే బోనకల్ స్టేషన్‌కు చెందిన కూల్ డ్రింక్స్ వ్యాపారి బండి యాకోబు రెండవ కుమారుడు బండి సురేష్. భార్యాభర్తల కలహాలతో మొదట భార్య విడాకుల అనంతరం రెండేళ్ల క్రితమే సురేష్ రెండవ వివాహం చేసుకున్నాడు. భార్య ఖమ్మంలోని వ్యవసాయ శాఖలో హార్టికల్చరల్ డిపార్ట్మెంట్లో ప్రభుత్వ ఉద్యోగం చేస్తుంది.బోనకల్ లోనే నివాసం ఉంటున్నారు. అయితే సురేష్ ఖమ్మం నగరంలో ఓ షాపు పెట్టుకొని వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ప్రతిరోజు భార్యాభర్తలు తమ వాహనం ద్వారా ఖమ్మం వెళ్తున్నారు. భార్య ఉద్యోగానికి వెళ్లగా సురేష్ తన షాప్‌కి వెళ్లి వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సురేష్ బుధవారం రాత్రి 8 గంటల సమయంలో బోసు బొమ్మ సెంటర్ వైపు ఆర్‌ఓబి బ్రిడ్జి కింద చాలాసేపు ఫోన్‌లో మాట్లాడినట్లు స్థానికులు అంటున్నారు. సుమారు 9 గంటల సమయంలో ఖమ్మం వైపు నుంచి విజయవాడ వైపు వెళుతున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ బోనకల్ రైల్వే స్టేషన్ దాటుతుండగా సురేష్ రైల్వే ట్రాక్ పైకి వచ్చి నిలబడినట్లు ఆ సమయంలో రైల్వే డ్రైవర్ హార్న్ కొట్టినా కదలకుండా నిలబడినట్లు స్థానికులు అంటున్నారు. ఆత్మహత్య చేసుకునేందుకే ట్రాక్ పైకి వచ్చినట్లు మండల కేంద్రంలో చర్చ జరుగుతుంది. అయితే ఇది ఇలా ఉండగా సురేష్ ఫోన్ మాట్లాడుకుంటూ రైల్వే ట్రాక్ దాటుతుండగా అదే సమయంలో వస్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ ప్రమాదవశాత్తు తగలడతో బండి సురేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు, మరికొందరు అంటున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే శాతవాహన డ్రైవర్ స్థానిక రైల్వే మాస్టర్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న రైల్వే సిబ్బంది మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైల్వే పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని బండి సురేష్ మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి బుధవారం రాత్రి తరలించారు. సురేష్ ఆత్మహత్య చేసుకున్నాడా? లేక రైలు ప్రమాదం వలన మతి చెందాడా ? అనే విషయాలు మిస్టరీగా మారాయి. చివరిసారిగా ఫోన్‌లో సుమారు అర్ధగంటకు పైగా రైల్వే ట్రాక్ సమీపంలో ఎవరితో మాట్లాడాడు, ఏమి మాట్లాడాడు అనే విషయాలు తెలిస్తే గాని పూర్తి విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. సురేష్ మృతి చెందటంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఘనంగా త్రివేణి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



నవతెలంగాణ- ఖమ్మం
ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు పాఠశాల యాజమాన్యం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించినట్లు త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎండ్‌బిజిఎన్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ కామర్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సర్వేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలకు ఒత్తిడి లేని విద్యను అందించాలని సూచించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుస్థిర ప్రభుత్వం కోసమే ఎంఎల్ఏలను చేర్చుకుంటున్నాం

- దేశానికి తెలంగాణ మోడల్
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ- ఖమ్మం
కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుండి ఈ ప్రభుత్వాన్ని కూల్చేస్తాం, పడగొడతామంటూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని, ప్రభుత్వం పటిష్టంగా ఉంటే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విధంగా నిర్ణయాలు తీసుకోవచ్చునన్న ప్రజాస్వామ్య స్ఫూర్తికి లోబడి ఇతర పార్టీల నుంచి ప్రజా ప్రతినిధులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని, రాష్ట్రంలో కేసిఆర్ మాదిరి ఇష్టానుసారంగా పాలన చేయడం లేదని, జవాబుదారి తనంతో పని చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. గురువారం ఖమ్మంలోని సంజీవరెడ్డి భవనం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నుంచి సహచర మంత్రులందరూ వారి వారి శాఖలకు సంబంధించి నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ పురోగతి సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఐక్యంగా ఉంటే పాలన పారదర్శకంగా సాగుతుందని, అందుకోసమే ఇతరులు పార్టీలో చేరతానని వస్తున్నప్పుడు చేర్చుకుంటున్నామన్నారు. కేసిఆర్ మాదిరి ఇతర పార్టీలను బలహీనపర్చడం ద్వారా లబ్ది పొందాలని కాంగ్రెస్ పార్టీ భావించడం లేదని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని తాము భావిస్తున్నామన్నారు. రిజనల్ రింగు రోడ్డు ఖర్చు కేంద్రమే భరించే విధంగా ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి అంటూ కేసిఆర్ మాట్లాడడంలో అర్థం లేదని, ఏ ప్రాజెక్టునూ ఆయన పూర్తి చేయకపోగా నిర్మాణ వ్యయం విపరీతంగా పెరిగిందని అన్నారు. యాదాద్రి పవర్ ప్రాజెక్టు ఒక్కసారిగా రూ.24 వేల కోట్ల నుంచి రూ.35 వేల కోట్లకు పెరిగిందని ఆయన తెలిపారు. ప్రపంచం మొత్తం ఆధునిక పద్ధతులను అనుసరిస్తుంటే కేసిఆర్ పురాతన పద్ధతిని ఆలోచించి రాష్ట్రంపై భారం మోపారని అన్నారు. ముడి పదార్థాలు దొరికే చోట కాకుండా ఇష్టానుసారంగా ప్రాజెక్టుల నిర్మాణం జరగడం వల్ల ట్రాన్స్పోర్టు భారం రాష్ట్రంపై పడుతుందన్నారు. భద్రాద్రి ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ అనుమతులే తీసుకోలేని కేసిఆర్ మూడు నెలల కాంగ్రెస్ పాలనను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. తనకు ఇష్టమైన ఒకట్రెండు శాఖలపై మాత్రమే రివ్యూ చేసేవాడని, ఇది రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. తెలంగాణలో ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారెంటీలపై హామీ ఇచ్చామని, వాటిని నెరవేర్చామని, మూడు నెలల్లో 30వేల ఉద్యోగాలు ఇచ్చామని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలో కూడా హామీల అమలు, ఉపాధి వనరులు తదితర విషయాల ద్వారా లబ్ధి పొందవచ్చునని తెలిపారు. ఖమ్మం జిల్లా ప్రజలు పది స్థానాల్లో తొమ్మిదింటిలో కాంగ్రెస్‌ను గెలిపించారని, మరోసారి పార్లమెంటు ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆర్థిక, సహజ, మానవ వనరులను ఉపయోగించుకుని రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తామన్నారు. కరువు కాంగ్రెస్ పార్టీ తెచ్చింది కాదని డిసెంబరు అధికారంలో చేపట్టినప్పుడు రాష్ట్రంలో పరిస్థితి ఏమిటో రాష్ట్ర ప్రజలకు తెలుసునని, ప్రాజెక్టులలో చుక్కనీరు లేదని ఇప్పుడు తాగునీరు, సాగు నీటి ఎద్దడికి కాంగ్రెస్ పార్టీ కారణం కాదని ఆ పాపం బిఆర్ఎస్ దేనన్నారు. రాష్ట్రంలో 12 నుంచి 14 పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతుందని ఆయన తెలిపారు. తుక్కుగూడలో జరిగే బహిరంగ సభలో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేస్తారని తెలిపారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, మహ్మద్ జావిద్, డిసిసిబి అధ్యక్షులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్
- అంతర్రాష్ట్ర సరిహద్దుల సమన్వయ సమావేశం



నవతెలంగాణ- ఖమ్మం
స్వేచ్ఛాయుత, న్యాయబద్ధ, ప్రశాంత వాతావరణంలో ప్రలోభాలకు తావులేని ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి. గౌతమ్ తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, రాజుపేట శ్రీరస్తు కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ ఖమ్మం జిల్లా, ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లాల అంతర్రాష్ట్ర సరిహద్దుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెండు జిల్లాల కలెక్టర్లు విపి. గౌతమ్, ఎస్. ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతిరాణా టాటా, ఖమ్మం జిల్లా సీపీ సునీల్ దత్‌తో పాటు సరిహద్దు నియోజకవర్గాల రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, రవాణా, ఐటీ, కమర్షియల్ ట్యాక్స్, జీఎస్టీ, అటవీ, బ్యాంకింగ్ తదితర శాఖల నోడల్ అధికారులు సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో కలెక్టర్ విపి.గౌతమ్ మాట్లాడుతూ అంతర్రాష్ట్ర సరిహద్దు వెంబడి ప్రత్యేక చెక్‌పోస్టులతో నిఘాను పటిష్టం చేసినట్లు తెలిపారు. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు వెంబడి నగదు, మద్యం, గంజాయి, విలువైన వస్తువులు తదితరాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే విషయంలో ఇప్పటికే తీసుకున్న చర్యలు, కొనసాగించాల్సిన చర్యలు, రెండు జిల్లాల మధ్య సమన్వయం, సహకారంపై చర్చించారు. ఈసీఐ ఎథికల్ ఓటింగ్‌తో పాటు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించేందుకు అత్యంత ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ఆ దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రలోభాలకు తావులేని వాతావరణంలో ఎన్నికలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిర్వహించేందుకు ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్టీఆర్, ఖమ్మం జిల్లాల సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. రెండు జిల్లాల డీఈవో, సీపీలతో పాటు వివిధ విభాగాల నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. రెండు జిల్లాల మధ్య పరస్పర సహకారానికి ఈ సమావేశం మంచి వేదిక అని ఆయన అన్నారు. రెండు రాష్ట్రాల్లో ఓటుహక్కు కలిగిన వారు ఉన్నట్లు, పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని, ఇండిబుల్ ఇంక్ పెట్టగానే, తుడుచుకోకుండా చూడాలని అన్నారు. ఏఎస్డి జాబితాను గమనించాలని, ఓటును బదిలీకి ఈ నెల 14 వరకు సమయమున్నట్లు, దీనిపట్ల అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు మాట్లాడుతూ రాజుపేట అష్టలక్ష్మీ టెంపుల్ చెక్‌పోస్టు, గంపలగూడెం రాజవరం చెక్‌పోస్టు, నూతిపాడు చెక్‌పోస్టులతో పాటు అటువైపు ముత్తగూడెం, ఖాజీపురం చెక్‌పోస్టుల వద్ద నిఘాను కట్టుదిట్టం చేసినట్లు వివరించారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఎదురయ్యే సవాళ్లను రెండు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎదుర్కోనున్నట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలు (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు (ఎస్ఎస్‌టీ) క్రియాశీలంగా పనిచేస్తున్నాయని, రెండు జిల్లాల ఉన్నతాధికారులు, నోడల్ అధికారులు ఇదే విధమైన సహకారాన్ని ఎన్నికలు ముగిసే వరకు కొనసాగించనున్నట్లు తెలిపారు. జిల్లాకు మంచి సహాయ సహకారాలు అందిస్తున్న ఖమ్మం జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా మాట్లాడుతూ సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. డబ్బు, మద్యం వంటి వాటి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిలువరించేందుకు ఖమ్మం జిల్లా అధికారుల సహాయ సహకారాలతో సరిహద్దు గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, అటవీ, బ్యాంకింగ్ తదితర ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల మధ్య సమన్వయానికి ప్రత్యేక సమాచార మార్పిడి ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతమున్న చెక్‌పోస్టుల వద్ద నిఘాతో పాటు వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలను ముమ్మరం చేస్తున్నట్లు వెల్లడించారు. డబ్బు, మద్యంతో పాటు గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరం మేరకు అదనపు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నామని, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు.

ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, ధన బలం, కండ బలం రహిత శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని, సరిహద్దు వెంబడి నిఘా విషయంలో రెండు జిల్లాల మధ్య పటిష్ట సమన్వయం ఉన్నట్లు తెలిపారు. స్థానిక అధికారుల సహకారంతో అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. డబ్బు, మద్యం, గంజాయి వంటి అక్రమ రవాణాను నిలువరించేందుకు ప్రధాన రహదారులతో పాటు డొంక రూట్ల పైనా దృష్టి సారిస్తున్నట్లు అన్నారు.

ఎన్టీఆర్ జిల్లాకు సహాయ సహకారాలు అందిస్తున్న ఖమ్మం జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్, సీపీ సునీల్ దత్‌లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, సీపీ కాంతిరాణా టాటాలు సత్కరించారు.

ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలి...

అసిస్టెంట్ ఆర్ఓ రాజేశ్వరి



నవతెలంగాణ-ఖమ్మం రూరల్
మండల పరిధిలోని బారుగూడెం,పెద్ద తండాలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఓటరు అవగాహనా సదస్సులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పి.రాజేశ్వరీ మాట్లాడారు. స్వీప్ ప్రోగ్రాం,సి-విజిల్ యాప్,ఓటరు హెల్ప్ లైన్ యాప్ ల గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు తమ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు.18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు రాంప్రసాద్, ఆర్ఐ ప్రసాద్, నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వధూవరులకు పొంగులేటి ఆశీర్వాదం

నవతెలంగాణ -కూసుమంచి
కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి గురువారం హైదరాబాద్ నుంచి రాగా మండలంలోని నాయకన్‌గూడెం టోల్ ప్లాజా వద్ద కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. నాయకన్‌గూడెం గ్రామంలో లిక్కి వెంకటేశ్వర్లు కుమారుడు ప్రదీప్ వివాహ వేడుకకు హాజరై కొత్తజంటను ఆశీర్వదించారు. ఇదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న జహంగీర్ తల్లిని, పెరిక సింగారంలో అజ్మీరా మంగ్యాను పరామర్శించారు. అజ్మీరా దీప్లా కుమార్తె కల్యాణానికి హాజరై నూతన వధూవరులను దీవించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-సత్తుపల్లి
సత్తుపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ ఫీడర్-1లో మెయింటెనెన్స్ పనుల నిమిత్తం ఆ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ ఉబ్బన శరత్ తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు ఫీడర్-1 పరిధిలో ఉన్న ప్రాంతాలు జలగంనగర్, వేంసూరు రోడ్డు, ఎన్టీఆర్‌నగర్, కృషి బైపాస్‌రోడ్డు, విద్యానగర్, వాణి విద్యాలయం రోడ్డు, మిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల రోడ్డు విద్యుత్ సరఫరా ఉండదని, ఈ అసౌకర్యానికి ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ శరత్ కోరారు.

పదో తరగతి విద్యార్థినుల వీడ్కోలు సభ

నవతెలంగాణ-సత్తుపల్లి
సత్తుపల్లిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు ఎన్ నాగేశ్వరరావు అధ్యక్షతన గురువారం ఘనంగా జరిపారు. వార్షికోత్సవం సందర్భంగా పదో తరగతి విద్యార్థినులకు వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంప్లెక్సు హెచ్ఎం పూరేటి యాకోబ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థినులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇటీవల పది పరీక్షలు రాసిన విద్యార్థినులు ఉత్తమ జీపీఏను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎస్‌సీ-1982 బ్యాచ్ విద్యార్థినులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. వార్షికోత్సవం, వీడ్కోలు సభ సందర్భంగా విద్యార్థినులు నృత్యాలతో అలరించారు.

ఆపసోపాలే...

- అత్యవసర చికిత్సకు వస్తే వీల్‌చైర్ లేకపాయే..
- జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగుల అవస్థలు
- డిఎంఈ పాలన వచ్చాక భ్రష్టు పడుతున్న వైద్య సేవలు
- చిన్నపాటి కేసులను కూడా వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలకు రిఫర్ చేస్తున్న ప్రస్తుత ప్రభుత్వాసుపత్రి వైద్యులు..?
- పాత విధానంలో జిల్లా ప్రభుత్వాసుపత్రి వైద్యుల పాలనే భేష్ అంటున్న రోగులు



నవతెలంగాణ-ఖమ్మం
ఖమ్మంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో పాలన వైద్యుల వైద్య సేవలు పాలన విభాగాలు భ్రష్టు పట్టాయని రోగులు ఆరోపిస్తున్నారు. ఖమ్మం జిల్లాకు మెడికల్ కాలేజీ పాలన వ్యవస్థ వచ్చాక విద్యార్థులకు ఎంబిబిఎస్ మెడికల్ వైద్య అందుబాటులోకి రావడం ప్రభుత్వ విభాగంలో రావడం సంతోషకరం అయితే జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో మెడికల్ కాలేజీకి చెందిన ప్రభుత్వ వైద్యులను నియమించడంతో ఇక్కడ రోగులకు వైద్య సేవలు భ్రష్టు పట్టిందని, గత వైద్యుల వైద్య సేవలు భేష్ అని ఇక్కడ వైద్యులు సరిగా స్పందించడం లేదని వచ్చిన రోగులు వాపోతున్నారు .కాగా అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కూడా ప్రస్తుత సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్లు పనితీరు కూడా ఆశాజనకంగా లేదని, ఖమ్మం జిల్లాకి మెడికల్ కాలేజీ కళాశాల సేవలు అందుబాటులోకి వచ్చాయన్న సంతోషకర అంశాన్ని చెప్పుకుంటున్నప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యశాల వైద్య సేవలు భిన్నంగా ఉందని రోగులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా రోగి ఏదైనా రోడ్డు ప్రమాదంలో కానీ ఇతర అత్యవసర పరిస్థితిలో కానీ జిల్లా ఆసుపత్రికి వస్తే కనీసం వీల్‌చైర్ అందుబాటులో లేకుండా పోయిందని, అందుకు సంబంధించిన సిబ్బంది సెక్యూరిటీ ఇతర శానిటరీ ఇతర ఫోర్త్ క్లాస్ ఉద్యోగులు, సిబ్బంది వైద్యులు ఇలా చెప్పుకుంటూ వెళితే ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ప్రభుత్వ ఆసుపత్రి సేవలు తార్కానమిస్తున్నాయని చెప్పక తప్పదు...

చిన్న, చిన్న వైద్య సేవలకు కూడా తప్పించుకుంటున్న వైద్యులు..?
ప్రధాన వైద్యశాలలో గతం రోజుకు ఓపి 600 నుంచి 950 వరకు సాధారణ అవుట్ పోస్టు విభాగంలో ఓపి సేవలు అందించారు. ప్రస్తుతం అది కాస్త 350 నుంచి 450 వరకు మాత్రమే రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ వైద్యులు వరంగల్, హైదరాబాద్‌లకు చిన్నచిన్న డయాగ్నోసిస్‌లో కూడా రిఫర్ చేస్తున్నారని సమాచారం. . గతంలో ఇక్కడి వైద్యులు వద్ద స్థానికులు కావడంతో భోజన సమయానికి వెళ్లే సమయం కూడా ఎవరైనా రోగులు అత్యవసర పరిస్థితిలో వస్తే వారిని పరీక్షించి సమైత నర్సింగ్ సిబ్బందికి అప్పగించి వైద్య సేవలను ముమ్మరం చేస్తూ రోగులకు మేమున్నామని భరోసామిచ్చిన పాత వైద్యులు ఇప్పుడు లేకపోవడంతో ఇక్కడ వైద్య సేవలు భ్రష్టుపట్టాయని బాహాటంగానే ఆరోపిస్తున్నారు.

అత్యవసర చికిత్సకు వస్తే వీల్ చైర్ లేకపాయే...
ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం సుశీల అనే మహిళ అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి రాగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండాల్సిన వీల్‌చైర్లు లేకపోవడంతో ఆ మహిళ గంటపాటు అవస్థల గురయ్యారు. చివరికి రోగి బంధువులు చేతుల మీద తీసుకెళ్లి చికిత్స చేయించుకునే పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రిలో వీల్‌చైర్ లేదని ఆర్ఎంవోకి విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఉన్న చైర్లు వాటికున్న చక్రాలు విరిగిపోవటంతో పదుల సంఖ్యలో మూలన పడేసి మరమ్మతులు లేకుండా కొన్ని నెలలుగా అలాగే ఉండిపోయాయి. దీనివలన రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

గత పాలనకు.. ప్రస్తుత పాలనకు తేడా అధికమే..
మెడికల్ కాలేజీ విభాగం నుంచి నియమితులై సూపరింటెండెంట్గా బాధ్యతలు చేపట్టిన ప్రస్తుత సూపరింటెండెంట్ సేవలు మెరుగ్గా లేవని, ఆశాజనకంగా లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు.. ఏదైనా వైద్యభాగంలో వారి సేవలు ద్విగుణీకృతంగా ఉన్నప్పటికీ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ప్రస్తుతం పాలన అంతగా లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



వద్దిరాజు ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-ఖమ్మం



రాజ్యసభ సభ్యులుగా రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర ప్రమాణస్వీకారం చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం ఉదయం ఆయన చేత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధనఖర్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ధనఖర్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్, రాజ్యసభ సభ్యులు పలువురు రవిచంద్రకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

'రైతు నేస్తం' సేవలను సద్వినియోగించుకోవాలి

నవతెలంగాణ-బోనకల్

బోనకల్ రైతు వేదిక నందు ప్రతి మంగళవారం రైతు నేస్తం పేరిట నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ సేవలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు మరీదు త్రివేణి, ధారగాని కళ్యాణి కోరారు. మండల పరిధిలోని రావినూతల, ముష్టికుంట్ల గ్రామాలలోని రైతులకు బోనకల్ రైతు వేదిక నందు ప్రతి మంగళవారం 'రైతు నేస్తం' పేరిట నిర్వహించే దృశ్యశ్రవణ (వీడియో కాన్ఫరెన్స్) సేవలపై క్షేత్ర స్థాయిలో గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో వారు మాట్లాడుతూ ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు, రైతులకు క్షేత్రస్థాయిలో వివిధ పంటలలో ఏదుర్కొనే సమస్యలపై ముఖాముఖిగా చర్చిస్తారని తెలిపారు. డిజిటల్ సేవలలో భాగంగా శాస్త్రవేత్తలు, నిపుణులు ఎల్లపుడూ అందుబాటులో ఉంటారన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు వివిధ పంటల యాజమాన్యం, చీడపీడల నివారణ, సమగ్ర పోషక యాజమాన్యం, నీటి యాజమాన్యం, కోత సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వాతావరణ పరిస్థితులు గురించి తగు సమాచారం ముఖ్య శాస్త్రవేత్తల ద్వారా రైతులకు నేరుగా వివరిస్తారని తెలిపారు. బోనకల్ రైతు వేదిక నందు ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను వారు కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ వలన రైతులకు వ్యవసాయంపై అనేక అంశాల మీద అవగాహన ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముష్టికుంట్ల, రావినూతల గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ మెనూ బిల్లులను విడుదల చేయాలి

-పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్

నవతెలంగాణ-ఖమ్మం

పెండింగ్లో ఉన్న మెనూ బిల్లులను విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ 5,600 కోట్లను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మంలోని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయంలో పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఖమ్మం జిల్లాలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, అద్దె భవనాలతో నడుపుతున్న హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు సాగర్, భాను, ఉదయ్, భాస్కర్, ప్రభు, తరుణ్, విష్ణు పాల్గొన్నారు.

పాలేరుకు చేరిన సాగర్ జలాలు

నవతెలంగాణ-కూసుమంచి



ఖమ్మం జిల్లా తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుండి సోమవారం నీటిని విడుదల చేశారు. గురువారం నాడు మండలంలోని నాయకన్ గూడెం గ్రామం నుండి పాలేరు జలాశయంలోకి సాగర్ జలాలు చేరుకున్నాయి. పాలేరు జలాశయంలోకి ప్రస్తుతం 1500 క్యూసెక్కుల నీరు వస్తుందని ఎన్ఎస్పి అధికారులు తెలిపారు. సాగర్ నుండి వచ్చే జలాలను వృధా కాకుండా అధికారుల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉండాలని, ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలియజేశారు.

పోలింగ్ కేంద్రాల పనులు త్వరగా పూర్తి చేయండి

- ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి
- కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్ దత్

నవతెలంగాణ-కల్లూరు



త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే పనులు త్వరితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్ పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని హనుమ తండా, కలాలివాడ, పేరవంచ, వెంకటాపురం, ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మౌలిక సదుపాయాల కోసం ఇటీవల ప్రభుత్వ విడుదల చేసిన నిధులతో చేపట్టిన పనులు ఏ విధంగా జరుగుతున్నాయని పంచాయతీరాజ్ ఎస్సీ చంద్రమౌళిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రం ఉన్న ప్రతి పాఠశాలలో రాంపులు తప్పనిసరి ఉండాలని ఆదేశించారు. విద్యుత్తు, మంచినీరు, మరుగుదొడ్ల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆయాయా పాఠశాలలో విద్యార్థులు గ్రంథాలయం పుస్తకాలు చదువుతున్నారా అని విద్యార్థులు అడిగి తెలుసుకొని మంచిగా చదువుకోవాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ ఫెన్సింగ్, ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎన్నికల సందర్భంగా కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ వద్ద, పెనుబల్లి మండలం ముత్తగూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ సునీల్ దత్, రికార్డులు పరిశీలించారు. ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా చెక్ చేయాలని, వాహన నెంబర్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మద్యం, డబ్బు, అక్రమ రవాణా చేస్తుంటే ఎంతటి వారి నైనా ఉపేక్షించవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెసి, కల్లూరు ఆర్డీవో మధుసూదన్ నాయక్, తహసిల్దార్ పులి సాంబశివ, ఎండిఓ చంద్రశేఖర్, పంచాయతీరాజ్ డిఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మోడిఫైడ్ సైలెన్సర్లపై ప్రత్యేక డ్రైవ్

- వింత శబ్దకాలుష్యం కలిగించే 79 సైలెన్సర్లు తొలగింపు
- ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

నవతెలంగాణ-ఖమ్మం



ద్విచక్ర వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. నగరంలో ఇటీవల కాలంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మోడిఫైడ్ సైలెన్సర్లతో నడిపే వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కొందరు యువత ద్విచక్ర వాహనాలకు సంబంధిత సంస్థ ఇచ్చిన సైలెన్సర్లను మార్చుచేసి.. అధిక శబ్దం వచ్చే వాటిని అమర్చుతున్నారని, దీని వల్ల విపరీతమైన ధ్వని కాలుష్యం ఏర్పడడంతో పాటు ప్రజలు భయభ్రంతులు కలిగేలా రోడ్లపై అకస్మాత్తుగా వింత శబ్దాలు చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. మరి కొందరు వాహనాల హారన్లను సైతం అదే తరహాలో అమర్చుతున్నారని, అటువంటి వారి ఆట కట్టించేందుకు ట్రాఫిక్ పోలీసు దృష్టి సారించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమైయ్యారని చెప్పారు. మోడిఫైడ్ సైలెన్సర్ల వరకూ తొలగించి ఒక్కో వాహనదారుడికి రూ.1,000 జరిమానా విధిస్తున్నామని, ఇకపై ధ్వని కాలుష్యాన్ని కల్గించే వాహనాన్ని సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా సంబంధిత వాహనానికి ఉన్న మోడిఫైడ్ సైలెన్సర్ను తొలగించి, జరిమానా వేసి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తొలగించిన సైలెన్సర్ల స్థానంలో ఆ సంస్థ ఇచ్చిన పొగగొట్టాలని అమర్చాలని సూచిస్తున్నామని పేర్కొన్నారు. ఈ డ్రైవ్లు ఇంకా కొనసాగుతాయని, నిబంధనలు అతిక్రమించి తరచూ ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అదేవిధంగా లైసెన్సు, నంబర్ ప్లేట్ నంబర్ సక్రమంగా లేని, నంబర్ ట్యాంపారింగ్ కలిగిన, నంబర్ తుడిపివేసిన వాహనాలను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నామని, పట్టుబడిన వాహనాలపై అయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ మోహన్‌బాబు, ఎస్సై రవి, సాగర్ పాల్గొన్నారు.

సునీత చోప్రా ఆశయ సాధనను సాధిద్దాం

- ప్రజాసంఘాల నాయకుల ప్రతిజ్ఞ

నవతెలంగాణ-ఖమ్మం



వ్యవసాయ రంగం అభివృద్ధి కావాలని వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘకాలం పాటు పోరాడిన వ్యక్తి, విద్యార్థి యువజన ఉద్యమాలను దేశవ్యాప్తంగా పెంపొందించడంలో అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి సునీత్ చోప్రా అని, ఆయన ఆశయ సాధనకై కృషి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బషీరుద్దీన్ అన్నారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవనంలో సునీత్ చోప్రా మొదటి వర్ధంతి సభను ఏఐఏడబ్ల్యూయూ, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సునీత్ చోప్రా వ్యవసాయ కార్మిక సంఘం, అఖిలభారత సహాయ కార్యదర్శిగా అనేక దశాబ్దాల పాటు పనిచేశారని తెలిపారు. వ్యవసాయ కూలీలకు వారి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టాలు చేయాలని, అనేక డాక్యుమెంట్లు రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారని, విద్యార్థి దశలో జేఎన్యులో ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించి విద్యార్థి హక్కుల కోసం అనేక పోరాటం నిర్వహించారన్నారు. యువజన ఉద్యమం నిరుద్యోగ సమస్యపై అనేక ఉద్యమాలు నిర్వహించారని, 1980లో డివైఎఫ్ఐ అఖిలభారత కోశాధికారిగా పనిచేశారని తెలిపారు. పాలస్తీనా ఏర్పాటుకై వారి హక్కుల కోసం ప్రపంచవ్యాప్తంగా పాలస్తీన సంఘీభావ సభల్లో పాల్గొని వారికి మద్దతు తెలిపారని, 2023 ఏప్రిల్ నాలుగో తేదీన ఢిల్లీ నగరంలో రైల్వే స్టేషన్‌లో గుండె నొప్పి వచ్చి మరణించారని, ఆయన జీవితాంతం పేద ప్రజల పక్షాన ఉండి పోరాడాడు. ఆయన ఆశయ సాధనకై ముందుకు సాగుదామని ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పొన్నగంటి సంగయ్య, ప్రతాప్ నేనీ వెంకటేశ్వరావు, వడ్లమూడి నాగేశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు నరేష్, హుస్సేన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, సుధాకర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

భక్తితో ఐక్యత

- ఎమ్మెల్యే కోరం, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

నవతెలంగాణ-కామేపల్లి



భక్తితోనే ఐక్యత ఏర్పడుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య, టీపీసీసీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన శ్రీ గణపతి సహిత రామలింగేశ్వర హనుమతు నవగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తం ప్రతిష్ట ,ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని అర్చకులచే తీర్థ ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు ఏపూరి మహేందర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, స్థానిక ఎంపీటీసీ సభ్యులు ఏపూరి హేమమాలిని, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటీ సత్యనారాయణ, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, ఎస్‌కే. పత్తే మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కోరం, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

మండల పరిధిలోని కెప్టెన్ బంజర గ్రామ కాంగ్రెస్ నాయకులు అజ్మీర లాలు కుమార్తె అనిత, సురేష్‌ల వివాహ వేడుకల్లో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాష్ట్ర టీపీసీసీ జనరల్ సెక్రెటరీ శ్రీరామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్ కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు నల్లమోతు లక్ష్మయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దేవుళ్ళ రామకృష్ణ, షేక్ పత్తే మహమ్మద్, ముక్తి సాంబశివరావు, మాజీ సర్పంచ్ అరెం రవి, ఎస్కే. కాసిం, మాలోతు భావు సింగ్, లావుడియా వినోద్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

టీజీపీఏ మండల నూతన కమిటీ ఎన్నిక

- మండల అధ్యక్షులుగా కట్టకూరి ఉమారావు

నవతెలంగాణ-ముదిగొండ



తెలంగాణ గురుకుల పాఠశాల పేరెంట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మండల నూతన కమిటిని ముదిగొండలో గురువారం ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షులుగా కట్టకూరి ఉమారావు(ముదిగొండ), ప్రధాన కార్యదర్శిగా ఇరుకు ఉపేందర్ (ముదిగొండ), ఉపాధ్యక్షులుగా బంక అరుణ (వెంకటాపురం), చింతల నాగేశ్వరరావు (వెంకటాపురం), సహాయ కార్యదర్శులుగా కట్టకూరి ఉపేందర్ (ముదిగొండ), బంక రమ(వెంకటాపురం) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టిజిపిఎ మండల అధ్యక్షులు ఎన్నికైన కట్టకూరు ఉమారావు మాట్లాడుతూ నామీద ఎంతో నమ్మకంతో మండల అధ్యక్షునిగా ఎన్నిక చేసినందుకు జిల్లా, రాష్ట్ర కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో టీజీపీఏను బలోపేతం చేస్తూ గ్రామ శాఖలను ఏర్పాటు చేస్తానని ఉమారావు పేర్కొన్నారు.

వంగవీడులో వైద్యశిబిరం

నవతెలంగాణ-మధిర

మధిర మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ హెచ్. వీరబాబు ఆధ్వర్యంలో గురువారం వంగవీడు గ్రామపంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బందితో ఇంటింటికి డెంగ్యూ లార్వా సర్వే, డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పించారు. బిపి, షుగర్, జ్వరాలతో బాధపడుతున్న వారికిపరీక్షలు నిర్వహించి తగిన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందించారు. అవసరమైన వారికి ఐవి ఫ్లూయిడ్స్ ఎక్కించారు. ఈ హెల్త్ క్యాంపులో వైద్య సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన గృహ నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-మధిర

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి అనసూయ దంపతుల నూతన గృహ శంకుస్థాపన కార్యక్రమం మండలంలోని సాయినగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ రంగా హనుమంతరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు దార బాలరాజు, మధిర శివాలయం మాజీ ఛైర్మెన్లు వంకాయలపాటి నాగేశ్వరావు, పాటిబండ్ల సత్యం బాబు, కాంగ్రెస్ నాయకులు యన్నం కోటేశ్వరరావు, యర్రగుంట రమేష్, టీడీపీ నాయకులు గడ్డం రమేష్, వాస్తు బ్రహ్మ వేణు, బీవీ ఆర్,ఏఐటీయూసీ డివిజన్ అధ్యక్షులు చెరుకూరి వెంకటేశ్వరరావు, సిపిఐ పట్టణ నాయకులునాయకర్, సాయినగర్ కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని ముద్దునూరు గ్రామపంచాయతీ కొత్త రంగాపురం గ్రామంలో గురువారం శ్రీ విఘ్నేశ్వర, భక్త హనుమాన్, జంట నాగులు, విగ్రహాలను ప్రతిష్టించారు. ధ్వజస్తంభం పోతురాజు, బొడ్రాయిలను, ఆవిష్కరించారు. ప్రధాన అర్చకులు గ్రామస్తుల సహకారంతో గత మూడు రోజులుగా వేదమంత్రోచ్చారణలతో, మంగళ వాయిద్యాలు, మంగళ తోరణాలతో జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై, హనుమాన్, జైశ్రీరామ్ అంటూరంగాపురం గ్రామం మొత్తం భక్తుల నామస్మరణతో మార్మోగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎర్రమల వెంకటేశ్వరరెడ్డి, ఏపూరి మోహన్‌రావు, ఎర్రమల రామిరెడ్డి, పారుపల్లి కొండయ్య, గూడూరు వెంకటరామిరెడ్డి, ఎర్రమల శివ నాగిరెడ్డి, ఎర్రమల శ్రీనివాస్‌రెడ్డి, బొగ్గుల కృష్ణారెడ్డి, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి, ఆనంద, భక్తి, పారవశులయ్యారు.

మతోన్మాదశక్తులతో దేశానికి ముప్పు

- ప్రజా చైతన్యమే కమ్యూనిస్టులు కర్తవ్యం
- రాచర్ల జయరామయ్య వర్ధంతిలో వక్తలు

నవతెలంగాణ-కారేపల్లి



మతోన్మాద శక్తులతో దేశానికి ముప్పు అని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ అన్నారు. కారేపల్లి మండలం చీమలపాడులో గురువారం సీపీఐ(ఎం) నాయకులు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రాచర్ల జయరామయ్య 28వ వర్ధంతి నిర్వహించారు. ఈ సంధర్బంగా యనమనగండ్ల రవి అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ పెరిగిన ధరలు, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు. అమలు చేయని హామీలు వంటి వాటిని నుండి ప్రజల దృష్టి మరల్చటానికి మత కార్యక్రమాలు, మతాల మధ్య రగడ రాజేస్తున్నారని విమర్శించారు. జయరామయ్య సాయుధ పోరాటంలో నైజాం సైన్యంకు వ్యతిరేకంగా చేసిన పోరాటం చూపిన తెగువతో పాటు ప్రజాసమస్యలపై పోరాడిన తీరు శ్లాఘనీయన్నారు. ప్రజా చైతన్యమే కమ్యూనిస్టుల కర్తవ్యమన్నారు. ప్రజల విశాల దృక్పధంతో రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ప్రజావ్యతిరేక, మతోన్మాధ శక్తులకు బుద్ది చెప్పాలని కోరారు. అంతకు ముందు జయరామయ్య స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని ఎగరవేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.నరేంద్ర, గిరిజన సంఘం మండల అధ్యక్షులు అజ్మీర శోభన్ బాబు, సీపీఐ(ఎం) నాయకులు వల్లబోయిన కొండలరావు, రేమళ్ల వీరస్వామి, రాసబంటి పుల్లయ్య, ఎర్రిపోతు నాగయ్య, ముచ్చర్ల రమేష్, పోతురాజు చందర్రావు, భారత లక్ష్మి, షేక్ చిన్న సైదులు, రాచర్ల రణధీర్, రాచర్ల విజయ్, నాగమణి, మాలోతు హనుమా తదితరులు పాల్గొన్నారు.

విజయ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు

- ముఖ్యతిథిగా హాజరైన ప్లేబ్యాక్ సింగర్ హేమచంద్ర

నవతెలంగాణ-కొణిజర్ల



పాటలతో ఉర్రూతాలగుంచిన ప్లేబ్యాక్ సింగర్ హేమచంద్ర.

మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకకి గంటా రమేష్ ఫార్మర్ ప్రొఫెసర్ కాకతీయ యూనివర్సిటీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మెన్ పారుపల్లి ఉషా కిరణ్ కుమార్ వైస్ చైర్ పర్సన్ విజయలక్ష్మిలతో కలిసి గంటా రమేష్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని వైభవంగా ప్రారంభించారు. అనంతరం కళాశాల చైర్మెన్ పారుపల్లి ఉషా కిరణ్ కుమార్ విజయలక్ష్మిలు మాట్లాడుతూ కళాశాల జీవితం అనేది చాలా అమూల్యమైనదన్నారు. విద్యార్థులకు జీవితపాఠాలు నేర్చుకునేది కాలేజీల్లోనే అన్నారు. ఇటీవలే విడుదల అయినా జెఎన్టియు ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ర్యాంకు సాధించారని తెలిపారు. తమ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్‌లో చాలామంది విద్యార్థులు మంచి సంస్థలలో ఉద్యోగాలు సాదించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు విద్యను అందించి భావిభారత పౌరులుగా తయారు చేస్తున్న టీచింగ్ నాన్ టిచింగ్ సిబ్బందిని అభినందించారు. విద్యార్థులు కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అదేవిధంగా గంటా రమేష్ మాట్లాడుతూ విజయ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యతో పాటు విజ్ఞానాన్ని ఇస్తూ ఉత్తమ ఫలితాలను రాబట్టడంలో ముందు వరుసలో ఉందనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. విద్యార్థులు కళాశాలలో ఉన్న అన్ని వసతులను సద్వినియోగం చేసుకుని జీవితంలో సక్సెస్ సాధించాలన్నారు. కళాశాల వైస్ చైర్ పర్సన్ విజయలక్ష్మి విద్యార్థులకు శుభాకాంక్షాలు తెలిపారు. వార్షికోత్సవాల సందర్భంగా విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల వార్షికోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆటలు, పాటలు డ్యాన్స్ ప్రోగ్రాంలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ హేమచంద్ర హాజరై తన గాత్రంతో విద్యార్థులను ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి. జాన్ బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. చిన్నయ్య, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ ఆయుష తరుణం కోకన్వీనర్ వివిధ విభాగాల అధిపతులు, ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా చేయండి దీమాగా ఉండండి

- ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ షేక్ ఇబ్రహీం

నవతెలంగాణ-తల్లాడ



భీమా చేయండి ధీమాగా ఉండండి అంటూ తల్లాడ ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ షేక్ ఇబ్రహీం సూచించారు. స్థానిక ఎస్బిఐ బ్రాంచ్‌లో గురువారం భీమా చెక్కులను, నామినీలకు అందజేసి మాట్లాడారు. ఇటీవల నారాయణపురం గ్రామానికి చెందిన, తమ్మిశెట్టి సావిత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన పథకాలలో ప్రీమియం చెల్లించి ఉన్నారు. రెండు పాలసీలకు ఇద్దరు కుమారులను నామినీగా నమోదు చేయించారు. ఆమె కుమారులు శ్రీను, నరసింహారావులకు చెరొక రెండు లక్షల రూపాయలు, మొత్తం నాలుగు లక్షల రూపాయలు చెక్కులను అందజేసినట్టు తెలిపారు. నాలుగు రోజుల వ్యవధిలోనే క్లైమ్లు అందజేశామన్నారు. సావిత్రి చెల్లించిన ప్రీమియం 20 రూపాయలు, 436 రూపాయలు ఇన్సూరెన్స్ క్లెయిమైనది 4 లక్షల రూపాయలని తెలిపారు. ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ పథకంలో వార్షిక ప్రీమియం 1000 రూపాయలు చెల్లిస్తే 20 లక్షల రూపాయల ప్రమాద బీమా పొందే అవకాశం ఉందని, ఎస్బిఐ ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖాతాలు లేని వారు ఆధార్ కార్డు, ఫోటోతో బ్యాంకులో సంప్రదించాలని, వెంటనే ఖాతాలు ఓపెన్ చేస్తామన్నారు. తల్లాడ, అన్నారుగూడెం, వెంకన్నపేట గ్రామాలలో కస్టమర్ సర్వీస్ పాయింట్‌లు అందుబాటులోకి తెచ్చామని, పినపాకపినపాకలో త్వరలో కస్టమర్ సర్వీస్ పాయింట్ ఏర్పాటు చేస్తామని, ఎస్బిఐ ఖాతాదారులు సర్వీస్ పాయింట్లను, సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్వాక్రా గ్రూపుల వారు రుణం పొందే సమయంలో బ్రాంచికి రావాల్సి ఉంటుందని, నెల నెల సర్వీస్ పాయింట్లలో కిస్తీలు చెల్లించవచ్చున్నారు. బ్యాంకు సేవలు ప్రజల వద్దకే అందుబాటులోకి తేవాలని లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఎస్బిఐ ఖాతాదారులు పాల్గొన్నారు.

బొగ్గుగని కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లిలోని జేవీఆర్‌ఓసీ-2, మండలంలోని కిష్టారం ఓసీల్లో గురువారం కార్మికులకు ఉష్ణోగ్రతలు అధికమవుతున్న దృష్ట్యా వేసవి తాపాన్ని కొంతవరకైనా తగ్గించేందుకు సింగరేణి సంస్థ ఆదేశాల మేరకు ఆయా ప్రాజెక్టు ఆఫీసర్లు ఎన్వీఆర్ ప్రహ్లాద్, ఎంవీ మునగంటి వేదాద్రి నరసింహారావు ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీవోలు ప్రహ్లాద్, నరసింహారావు మాట్లాడుతూ ఈ మజ్జిగ ప్యాకెట్లను జూన్ 15వ తేదీ వరకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గనిలో పనిచేస్తున్న కార్మికులు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అందుకు తగ్గట్టుగా జాగ్రత్తలు తీసుకుంటూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలరీ మేనేజర్ పి. నరసింహారావు, సంక్షేమ అధికారి దేవదాస్, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శులు జి. నరసింహారావు, ఎస్.రామారావు, కిష్టారం ఓసీ మేనేజర్ రామకృష్ణ, కార్మిక సంఘాల నాయకులు కిశోర్, బాలాజీ, సంక్షేమాధికారి విజయసందీప్ పాల్గొన్నారు.

7
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | ఏప్రిల్ 05, 2024 | www.navatelangana.com

బ్రిలియంట్ విద్యార్థికి ఏఎస్పీ అభినందన



నవతెలంగాణ-బూర్గంపాడు

ఇటీవల ప్రకటించిన సైనిక్, నవోదయ ఫలితాల్లో సీటు సాధించిన సారపాక బ్రిలియంట్ విద్యాలయం విద్యార్థి కె.నేత్ర నిఖిల్‌ను భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పారితోష్ గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఆయన కార్యాలయంలో విద్యార్థి నేత్రనిఖిల్‌కు మిఠాయిలు తినిపించి చదువులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తూ జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తూ ఉజ్వల భవిష్యత్ ఉన్నతికి కృషిచేస్తున్న బ్రిలియంట్ విద్యాసంస్థ అధినేత బీఎస్ఆర్‌ను సైతం అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తండ్రి నవీన్‌కుమార్, పల్లవిలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకి రూ.19 వేల వేతనం ఇవ్వాలి



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్టులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు అనుసరించి సమాన పనికి సమాన వేతనం నెలకు రూ.19 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు అన్నారు. గురువారం మణుగూరు కోర్టులో పని చేస్తున్నటువంటి కార్మికులతోటి సమావేశమైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల శ్రద్ధ చూపించట్లేదని, వారు పని చేస్తున్నటువంటి పనికి కనీస వేతనం 19 వేలు ఇవ్వాడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి వైఫల్యం చెందారని అన్నారు. ఇప్పటికైనా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రమణ, సుజాత, విజయ తదితరులు పాల్గొన్నారు.

రంగనాథ ఆశ్రమంలో అన్నదానం



నవతెలంగాణ-దమ్మపేట

తెలంగాణ రాష్ట్ర పామాయిల్ అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ తన మనవరాలు వారుని జన్మ దినోత్సవ సందర్భంగా గురువారం రంగనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దమ్మపేట మండలంలోని మల్లేశ్వర స్వామి దేవాలయ సమీపంలో ఉన్న శ్రీ రంగనాథ స్వామి ఆశ్రయం వద్ద ప్రత్యేక హెూమాలు నిర్వహించి, వృద్ధులు వికలాంగులకు అన్నార్తులకు భోజన ప్యాకెట్లు తయారు చేయించి సుమారుగా 400ల ప్యాకెట్‌లను మండల వ్యాప్తంగా ఆలపాటి రామచంద్ర ప్రసాద్ దంపతులు ప్రత్యేక శ్రద్ధతో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ అన్నం లేక అల్లాడుతున్న కొద్దిమందికైనా తన వంతు సహాయం చేసినందుకు తనకు ఆనందంగా ఉందని తన మనవరాలు వారుని జన్మదినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.



పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



నవతెలంగాణ-పాల్వంచ

పాల్వంచకు చెందిన రజా ఏ ముస్తఫా ముస్లిం వెల్ ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరు పేద ముస్లింలకు గురువారం రంజాన్ తోఫాలాను పంపిణీ చేశారు. జామే మసీద్ కాంప్లెక్స్‌లో గల రజా ఏ ముస్తఫా ముస్లిం వెల్ ఫేర్ సొసైటీ కార్యాలయంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న షాదీఖానా చైర్మెన్, జామే మసీద్ అధ్యక్షులు ఫయాజ్ ఉల్ హస్సన్ మాట్లాడుతూ పట్టణంలోని నిరు పేద ముస్లింలకు రంజాన్ తోఫాలాను పంపిణీ చేయటం హర్షనీయమన్నారు. ధనిక, పేద అనే తారతమ్యభేదం లేకుండా రంజాన్ పండుగను అందరు ముస్లింలు సమానంగా చేసుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఈ రంజాన్ తోఫాలను పంపిణీ చేసిన రజా ఏ ముస్తఫా ముస్లిం వెల్ ఫేర్ సొసైటీని అయన అభినందించారు. అల్లాహ్ మనకు ఆదికారికంగా ఇచ్చిన ధనాన్ని అయన చూపిన మార్గంలో ఖర్చు పెట్టాలన్నారు. సమాజంలోని ఆర్థిక అసమానతలను తొలగించడానికి ఇస్లాం చూపిన మార్గం జాకాత్ అన్నారు. అనంతరం రజా ఏ ముస్తఫా ముస్లిం వెల్ ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు ఎస్.కె.మీరా సాహెబ్ మాట్లాడుతూ 2012లో తమ సంస్థను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. నాటి నుండి నేటి వరకు అంటే సుమారు 13 సంవత్సరాలుగా ప్రతి రంజాన్ నెలలో పట్టణంలో ఉన్న పేద ముస్లిం లను గుర్తించి వారికీ అవసర మైన వస్తువులను అందచేయటం జరుగుతుందన్నారు. సుమారు లక్షా యాభై వేల విలువ చేసే పండుగకు సంబందించిన వస్తువులు అందించటం ఆనవాయితీగా వస్తుందన్నారు. తమ సంస్థ ద్వారా అందించే రంజాన్ తోఫాలో బియ్యం, పంచదార, బట్టలు, సేమియాలు, పాలు, డ్రై ఫ్రూట్స్ ఉంటాయాన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సొసైటీ భాద్యులు ఖాసీం అలీ, ఎండి కలీం, ఎండి అన్వర్, ఎండి మొయిన్, ఎండి సాదిక్ ఉల్ హసన్, ఎండి యూసఫ్‌లు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానానికి విరాళం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయిబాబా వారి మందిరంలో గురువారం ఉదయం బాబాకు అభిషేకం అర్చనలు జరిపారు. స్వర్ణ ఆభరణాలు దరింప చేసి హారతి పాడారు. సారపాక ఐటీసీ ఉద్యోగి మల్లాది వెంకట రామారావు పుట్టినరోజు పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు రూ.25వేల విరాళం వెంకట రామారావు చేతులమీదుగా ఆలయ కోశాధికారి కుంచాల రమేష్‌కు అందజేశారు. అనంతరం దాతను శాలువా బాబా వారి మెమంటూతో సత్కరించారు. ఎనిమిది వందల మందికి పైగా భక్తులు బాబా వారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలోఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



చంతనే గోదావరి తాగేందుకు గుక్కెడి నీరు లేకపోయే

చెంతనే గోదావరి అయినా చుక్క నీరేది...నాడు చలమలను తీసి మైళ్ళ దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వచ్చిందని బాధపడ్డాం...కానీ తెలంగాణ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తుంది. చుట్టూ గోదావరి ప్రవాహం ఉన్నా తాగేందుకు చుక్క నీరు లేక గొంత ఎండుతుందని ప్రజలు లబోదిబోమంటున్నారు.

మహాప్రభో ప్రజల గొంతెండుతోంది

- పేరుకే మిషన్ భగీరథ
- అలంకారప్రాయంగానే వాటర్ ట్యాంకులు
- సింగరేణి కారణంగా అడుగంటుతున్న భూగర్భ జలాలు
- తాగునీటి సమస్యలను పరిష్కరించాలని మండిపడుతున్న ప్రజలు



నవతెలంగాణ-మణుగూరు

తాగునీరు కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాలలో మంచినీటి సరఫరా సరిగ్గా జరగకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మరో పక్క మంచినీటిని సరఫరా చేసేందుకు నిర్మించిన వాటర్ ట్యాంకులోనికి మిషన్ భగీరథ ద్వారా నీరు ఉండడంతో వచ్చే నీటి సరఫరా అంత మాత్రంగానే జరుగుతుందని ప్రజలు మండిపడుతున్నారు. 2018లో ఏర్పాటు చేసిన ఈ మంచినీటి పథకం ద్వారా నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్లు సరిగా లేకపోవడం అక్కడక్కడ లీకేజీలు ఉండటంతో వచ్చే నీటి సరఫరా పలు గ్రామాలతో పాటు ఆదివాసీ గ్రామాలలో ఆదివాసులు మంచినీటి కోసం నానా అగచాట్లు పడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. కరకగూడెం మండలంలో తాగేందుకు నీళ్ల రావడంలేదని 2023 మార్చి, ఏప్రిల్ నెలలో అధికారులతో జరిగిన అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో స్వయంగా ప్రస్తావిస్తూ సమస్యలకు పరిష్కారం ఎక్కడుందో అధికారులు కనిపెట్టలేకపోతున్నారని మండిపడ్డారు. ఈ స్థాయిలో మంచినీటి సమస్య ఉందంటే ఇక సమస్య ప్రజల పరిస్థితి ఏమిటంటే పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు.

ట్యాంకులకు నీళ్లు అందడం లేదు

మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే తాగునీరు కోట్ల రూపాయలతో నిర్మించిన వాటర్ ట్యాంకులకు సరఫరా పైకి ఎక్కలేక టాంకులు నిండలేకపోతున్నాయి. ట్యాంకులతోపాటు గ్రామాలలో అమర్చిన పైపులైన్లలో లీకేజీలు ఉన్న వాటిలో ఏవైనా ఇరుక్కుపోయినా మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్య తరచూ తలెత్తడంతో పాటు కొన్ని గ్రామాలలో పైపులైన్లు లీకేజీలతో ప్రజలకు తాగునీటి సరఫరా సరిగ్గా జరగకపోవడంతో గుక్కెడు నీటి కోసం నానాతంటాలు పడాల్సి వస్తుందని సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

సింగరేణి గనుల ద్వారా భూగర్భ జలాలు అడ్రస్ లేకుండా పోయాయి

గోదావరి పరివాహక ప్రాంతం కావడంతో పాటు అసలే గుక్కెడు నీళ్ల దొరక్క ఇబ్బందులు పడుతున్న ప్రజలకు మరో సమస్య వేధిస్తుంది. మణుగూరు పరిసర గ్రామాలలో సింగరేణి గనులు కారణంగా సహజ నీటి వనరులు వాటికి అవసరం కావడంతో గోదావరి పరివాహక ప్రాంతంలోని నీటిని వాడుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. మూలిగే నక్క పై తాటి పండు తాటిపండు పడినట్లుగా అసలే తాగేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సింగరేణి పరిశ్రమలు కారణంగా పూర్తిగా నీటి కరువు ఏర్పడింది. ఏదేమైనా సంబంధిత మిషన్ భగీరథ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నీటి సమస్య సత్వర పరిష్కారానికి కృషి చేయాలని, వేసవి సమీపించే నాటికి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని మణుగూరుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు : కుంజా సామ్రాజ్యం పగడేరు



పడేరు పంచాయతీలో మిషన్ భగీరథ నీళ్ల నామమాత్రంగానే వస్తున్నాయి. రోజుకు నాలుగు బిందెలు మించి రావడం లేదు. ఒక్కొక్కసారి ఒకటి, రెండు బిందెలు మాత్రమే వస్తున్నాయి. వాగు వద్దు గుంపులో మిషన్ భగీరథ పంపు కనెక్షన్లు ఇవ్వలేదు. లోడిగోళ్ళ గుంపు, కింద గుంపు, వాగుడు గుంపు తదితర ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీళ్ల రాక అవస్థ పడుతున్నాం. వాగులు, వంకలు, బావులు ఉన్న ఇంటికి నీళ్ల కోసం వెళ్లడం జరుగుతుంది.

అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదు

కొండ్రు గౌరీ గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు



సమితి సింగారం పంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ నీళ్ల రోజు విడిచి రోజు వస్తున్నాయి. అవి కూడా చాలీచాలకుండా వస్తున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దొడ్డి నెహ్రూ బజార్ జూనియర్ కాలేజ్ వెనుక భాగంలో మిషన్ భగీరథ నీళ్ల పూర్తిగా రావడం లేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న ట్యాంక్ నుండి నీళ్ల సరిగా రావడం లేదు. ఈ విషయంపై అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా దరఖాస్తులు చేసినా ఫలితం లేదు. సాంకేతిక సమస్యలు పరిష్కరించి నీళ్లదించాలి.



తాగునీటి కోసం గుడిసె వాసుల ధర్నా

- పేదల దాహార్తి తీర్చండి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-ఇల్లందు

గుడిసె వాసుల దాహార్తి తీర్చాలని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీపీ చీమల నాగరత్నమ్మకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నబి మాట్లాడారు. సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ రాజీవ్ నగర్ శివారులో గత ఐదు సంవత్సరాలుగా ఇండ్లు నిర్మించుకొని నివాసముంటున్న సున్నం రాజయ్య నగర్ దేవులపల్లి యాకయ్య నగర్‌లలోని నివసిస్తున్న గిరిజన ఇతర పేద ప్రజల దాహార్తి తీర్చాలని అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. తాగునీరు లేక కిలోమీటర్ దూరం వెళ్లి మంచి నీళ్ల తెచ్చుకుంటున్నామని, ఇప్పటికైనా ప్రభుత్వం కనికరించి మా దాహార్తి తీర్చాలని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్ కుమార్, మన్యం మోహన్ రావు, దారావత్ రాందాస్, వీరస్వామి, హుస్సేన్, వెంకన్న, కౌసల్య కోటమ్మ, విజయ, నీలా రాణి, జ్యోతి, రజియా, హబీబున్నిసా, అఫ్జల్ బీ, పద్మ, సుజాతా, కమల, భవాని, మల్లయ్య, రాజు, కుమారీ, అమ్మి ప్రమీల, ఉపేందర్, మంగ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తికోయలకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- గిరిజన గ్రామాల సందర్శనలో కలెక్టర్



నవతెలంగాణ-కొత్తగూడెం

వేసవి దృష్ట్యా మారుమూల గుత్తి కోయల గిరిజన గ్రామాలను కలెక్టర్ సందర్శించారు. గుత్తికోయలను వారి సమస్యలు నేరుగా అడిగితెలుసుకున్నారు. గురువారం చుంచుపల్లి మండలంలోని పెనగడప గ్రామ పంచాయతీ పరిధిలో గల గుత్తి కోయ గ్రామాలైన జగ్గారం, మర్రిగూడెం, పాలవాగు, గడ్డి గుప్ప తదితర గూడేలాలను కలెక్టర్ ప్రియాంక అలా సందర్శించారు. వేసవి దృష్ట్యా మారుమూల గిరిజన గుత్తి కోయ గ్రామాలను తాగునీటి ఎద్దడి సమస్యలపై సమాచారం తెలుసుకునేందుకు గుత్తికోయల గూడాలను సందర్శించారు. ఈ సందర్భంగా జగ్గారం గుత్తి కోయ గ్రామం, స్థానిక జగ్గారం పాలవాగు, మర్రిగూడెం, గడ్డి గుప్ప గ్రామాల ప్రజల తాగునీటి సమస్య, తాగునీరు ఏ విధంగా సేవిస్తున్నారు. తర్వాత వారికి అందుతున్నటువంటి మౌలిక సదుపాయాలైనటువంటి ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు, రేషన్ కార్డులు, వారి యొక్క పిల్లలు అంగన్వాడీ కేంద్రాలలో చదువుతున్న విధానాన్ని, గర్భిణీలు ఎక్కడ డెలివరీ అవుతున్నారు..? అని అడగగా రామవారంలోని మాత శిశువు కేంద్రం హాస్పిటల్ నందు కాన్పులు అవుతున్న విధానాన్ని గ్రామ మహిళలు తెలిపారు. వారి పిల్లలు రెసిడెన్షియల్ స్కూల్స్ స్థానిక పెనగడప స్కూల్స్ నందు చదువుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్య పాలైనప్పుడు ఏ విధంగా ఆరోగ్యం కోసం మీరు ఏ దవఖానాల సందర్శిస్తున్నారని..? అడగగా పెనగడపలోని పీహెచ్‌సీకి వెళుతున్నామని చెప్పారు. ఏఎన్ఎంలు, ఆశాలు వచ్చి మా ఆరోగ్య సమస్యలు పరిస్థితులు తెలుసుకుంటున్నారని తెలిపారు. మీకు పెన్షన్లు అందుతున్నయా...? అని అడగగా కొంతమందికి వస్తున్నవి, కొంతమందికి రావడంలేదని తెలుసుకున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమాలు పూర్తయిన తర్వాత దరఖాస్తు చేసుకోండి అని తెలిపారు. డ్వాక్రా మహిళలు పొదుపు సంఘాలు ఇవన్నీ కూడా మీరు వీటిలలో సభ్యులుగా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీలను పనుల కోసం అందరికీ జాబ్ కార్డ్స్ ఉన్నాయా అని అడిగారు. అందరికీ జాబ్ కార్డ్స్ ఉన్నాయని, ఉపాధి హామీ పనులు కూడా వెళ్తున్నామని చెప్పారు. మాకు పోడు చేసుకోవడానికి ఉన్నటువంటి భూములలో వరి, పత్తి సాగు చేస్తున్నామని, వాగు నీటి చెలమల ద్వారా తాగునీటిని సేవిస్తున్నామని మాకు బోర్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డిఓ విద్యాచందన, మిషన్ భగీరథ ఇఇ తిరుమలేష్, మిషన్ భగీరథ డీఈఈ శివయ్య, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ పి.వసంత, తహసీల్దార్ పానం కృష్ణ, ఎంపీడీవో వీడివి అశోక్ కుమార్, ఎంపీవో గుంటి సత్యనారాయణ, అన్ని రకముల విభాగాలకు సంబంధించిన అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



చదివిన పాఠశాల రుణం తీర్చుకోలేనిది

- పూర్వ విద్యార్థి, ప్రవాస భారతీయుడు చక్రధర్



నవతెలంగాణ-అశ్వారావుపేట

కన్నవారి, పుట్టిన ఊరి, చదివిన బడి ఋణాన్ని ఎవరూ తీర్చుకోలేనిది, అలాగే తల్లిదండ్రులకు, ఉన్న ఊరికి, చదివిన బడికి కేటాయించేది ఏదైనా అది అమూల్య మే నని అమరవరం పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రవాస భారతీయుడు గంజి రామ చక్రధర్ హితవు పలికారు. ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా, కుక్కునూరు మండలం, అమరవరం జిల్లా పరిషత్ పాఠశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాల స్మారకం (పైలాన్)ను గురువారం ఆయన హాజరై ఆవిష్కరించారు. స్థానిక ప్రధానోపాధ్యాయులు ఎం.వి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి చక్రధర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ప్రాథమిక విద్యలోనే ఏదో లక్ష్యాన్ని ఎంచుకుని చదివిన అప్పుడే ఏదో ఒక రంగంలో ఉన్నత స్థానంలో ఉంటారని సూచించారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూ విద్యాబోధనతో పాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందించాలని విజ్ఞప్తి చేసారు.



తాను పల్లెటూరి బడిలో చదివి కఠోర శ్రమతో దేశం కాని దేశంలో బతుకుతెరువు కోసం స్థిరపడటం ఆనందంగా ఉన్నప్పటికీ కన్న నేలను, చిన్ననాటి సహచరులను తరుచూ కలవలేక పోతున్నందుకు ఏదో తెలియని, వ్యక్తం చేయలేని వెలితి వెంటాడుతూ ఉందని ఆవేదన చెందారు. నా సహ విద్యార్థుల సహకారం, మాకంటే ముందు తరం పూర్వ విద్యార్థుల సూచనలు, సలహాలు మేరకు పాఠశాలకు ఎంతమేర సహాయం చేయగలం మో అంత మేరకు పాఠశాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

అనంతరం అమరవరం పీజేసీ రూపకర్త రావులపాటి శంకర్ రావు మాట్లాడుతూ ఏ దేశమేగినా, ఎందుకాలిడినా ముందుగా మనం గుర్తుకు రావాల్సింది కనిపెంచిన తల్లిదండ్రులు, ఆడిపాడిన జన్మభూమి, విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు, వేదిక అయిన బడి మాత్రమే నని, అందుకోసం ఈ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను నిర్వహించడం జరిగిందని హర్షం వ్యక్తం చేసారు. ఈ ఉత్సవాలకు సహకరించిన ప్రస్తుత పాఠశాల సిబ్బందికీ, హాజరై విజయవంతం చేసిన నాటి-నేటి విద్యార్థులకు, మా ఆహ్వానం మన్నించి వయో భారంతో సైతం దూరాభారం నుండి వచ్చిన పూర్వ గురువులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్లాటినం జూబ్లీ ఉత్సవం రూపకర్తలు తోటమళ్ళ వెంకటి, ఆర్.వెంకటి(వెంకటి ద్వయం), గ్రామ పెద్ద, పాఠశాల హితకారులు గ్రామీణ వైద్యులు డాక్టర్ రాధాక్రిష్ణ మూర్తి, బయ్యన వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, వల్లాల రవీంద్రనాధ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల కోడ్ పేరుతో ప్రమోషన్ నిలుపుదల చేయరాదు

- సికాఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయగిరి శ్రీనివాస్

నవతెలంగాణ-కొత్తగూడెం

పార్లమెంటు ఎన్నికల కోడ్ పేరుతో ప్రమోషన్స్ నిలుపుదల చేయరాదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటియూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయగిరి శ్రీనివాస్, సెంట్రల్ ఆఫీస్ బేరర్ వై.వెంకటేశ్వరరావులు సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. గురువారం ఈ మేరు ఎస్ఓటు డైరెక్టర్ (పా) కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి సంవత్సరం మార్చి ఫస్ట్,సెప్టెంబర్ ఫస్ట్, ఏప్రిల్ ఫస్ట్, అక్టోబర్ ఫస్ట్, కార్మికులకు రావలసిన కెరీర్ గ్రోత్ స్కీం హైయ్యర్ గ్రేడ్, క్యాటగిరి ప్రమో షన్స్‌ను ఎన్నికల కోడ్ నేపథ్యంతో నిలుపుదల చేయడంతో కార్మికు లు, ఉద్యోగస్థులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఆఫీస్ ఆర్డర్‌ను జారీ చేయాలని, క్రింద స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

విద్య కాషాయీకరణను వ్యతిరేకిద్దాం

- శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమించాలి
- నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రామకృష్ణ



నవతెలంగాణ-కొత్తగూడెం

కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో బిజెపి అనుబంధ ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులుపై ఆనాటి స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ పిలుపు నిచ్చారు. కొత్తగూడెం శేషగిరి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు జర్పుల ఉపేందర్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి విద్యను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలని చూస్తుందన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేసే అందుకే విదేశీ విశ్వవిద్యాలయాలకు అనుమతి ఇచ్చిందని స్వదేశంలో కూడా ఆదానీ, అంబానీ, టాటా లాంటి కార్పొరేట్ సంస్థలకు విశ్వవిద్యాలయాలు పెట్టుకునేందుకు వెసులుబాటు కల్పించిందన్నారు.ఈ విధానాలు ప్రభుత్వ విద్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలని విమర్శించారు. విద్యను కాషాయీకరణ వైపు తీసుకువెళుతూ శాస్త్రీయమైన ఆలోచనలను. శాస్త్రీయ విద్యను దూరం చేసే అందుకే మత భావాల గల పాఠ్యాంశాలను జాతీయ నూతన విద్యా విధానం పేరుతోను తీసుకొస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక సంస్కరణను విధానాలకు వ్యతిరేకంగా చైతన్యం గల ఏఐఎస్ఎఫ్ నాయకత్వంలో విద్యార్థులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. విశ్వవిద్యాలయాలలో ఆరెస్సెస్ ఎజెండా అమలుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని, ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవారినే యూనివర్శిటీలలో నియమాకాలు చేస్తుందని తెలిపారు.కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం10 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా, జీడిపిలో 6 శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. కేఎస్ఎమ్ కళాశాలను అప్‌గ్రేడ్ చేసి జెఎన్‌టియూ యూనివర్సిటీగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.పహీం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్, ఆఫీస్ బేరర్స్ అజిత్, వంశీ, షాహిద్, పవన్ సాయి, జిల్లా నాయకులు రణధీర్, రాజు, శిరీష, సింధు, అను, నవ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | ఏప్రిల్ 05, 2024 | www.navatelangana.com



ఘనంగా పంచపాండవుల జాతర

- మహెూత్సవ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

నవతెలంగాణ-పినపాక

పినపాక మండలం దుగినేపల్లి శివారు రెడ్డిగూడెం గ్రామంలో కొలువై ఉన్న దేవాలయంలో పంచ పాండవుల జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ జాతర మహెూత్సవ వేడుకలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పాయంకు ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ విశిష్టత పూజా విధానం వివరించారు. పూజా కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని దేవుని కోరుకున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి గుడి ప్రతిష్ఠ

- పాల్గొన్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు మండలం అనంతారం గ్రామంలో గురువారం నిర్వహించిన శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవాలయ ప్రతిష్ఠ మహెూత్సవానికి వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి వీరాంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నాయకులు, జూలూరుపాడు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దయాకర్‌రెడ్డి పూజలు

ఈ ప్రతిష్ఠ మహెూత్సవానికి ప్రముఖులు తుంబురు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, జూలూరుపాడు మండల సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకురి మధుసూదన్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్, ధరావత్ రాంబాబు, ఉద్యమకారుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ రాథోడ్, ఎల్లంకి పుల్లయ్య, గాదె కృష్ణయ్య, దుద్దుకూరి నరసింహారావు,శిరం శెట్టి భూపతిరావు, మాచినేని సత్యం, పురస్తాపురపు శ్రీను, ఎండపల్లి చిట్టిబాబు, రామిశెట్టి నాగేశ్వరావు, కళ్యాణం ప్రసాద్, మిరియాల కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

చనుమోలు విఖ్యాత్ మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ - జూలూరుపాడు

జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చనుమోలు సుబ్బారావు కుమారుడు చనుమోలు విఖ్యాత్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జర్నలిస్ట్ యూనియన్ ముఖ్య బాధ్యులు షఫీ, జిల్లా, స్థానిక పాత్రికేయులు తదితరులు గురువారం విఖ్యాత్ భౌతికకాయాన్నిసందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప సానుభూతి తెలిపారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్పెషల్ బ్రాంచ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బందితో కలిసి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతి తెలిపారు.

గిరిజన బిడ్డను గెలిపించండి

నవతెలంగాణ-జూలూరుపాడు

భారతీయ గోర్ బంజారా పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రవిచందర్ చౌహన్ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన, ఆదివాసీ పక్షాన పార్లమెంట్లో పోరాడటానికి అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్రానికి వచ్చే నిధులు, నియామకాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ఒక్క అవకాశం కల్పించాలని కోరారు.



పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం

నవతెలంగాణ-పినపాక

మండలంలోని గోపాలరావుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువనేత అచ్చ నవీన్‌కు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో కన్వీనర్‌గా నియమించి అరుదైన గౌరవం కల్పించిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోడిశాల రామనాథం అన్నారు. గురువారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేసే ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ సోషల్ మీడియా కోకన్వీనర్ గా తనపై బాధ్యతలు ఉంచిన అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని జీవితాంతం కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ లక్ష్యంగా పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు రామనాథం ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు నవీన్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లక్ష్మారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

- హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

నవతెలంగాణ- చర్ల

మండల పరిధిలోని గుంపెనగూడెం గ్రామంలో గత మూడు రోజుల నుండి ముత్యాల అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. గురువారం భద్రాచలం శాసనసభ్యులు తెల్ల వెంకట్రావు ధ్వజస్తంభ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షునిగా గద్దల రమేష్

నవతెలంగాణ-పాల్వంచ



పాల్వంచ మండలానికి చెందిన గద్దల రమేష్ కు గురువారం హైదరాబాద్ లో మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డా పిడమర్తి రవి చేతుల మీదుగా మాదిగ జేఏసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులుగా నియామక పత్రం అందజేశారు. మాదిగ జేఏసీ సంఘ బలోపేతానికి కృషి చేయాలని,క్రమశిక్షణతో జిల్లాలోని అన్ని కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ మాదిగల పక్షాన ప్రశ్నించే ప్రజా గొంతుకనై మాదిగ జాతి కోసం పోరాడుతానని అన్నారు. నా మీద నమ్మకంతో జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన పిడమర్తి రవికి, రాష్ట్ర బాధ్యులు రాష్ట్ర కన్వీనర్ వినాయకరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు జోగారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దల నాగేశ్వరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దేల తిరుమలరావు, రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేసారు.

పోడు వివాదంలో అటవీ గార్డుపై దాడి



నవతెలంగాణ-ములకలపల్లి

ఏజెన్సీలో పోడు గొడవలు సద్దుమణిగేలా లేవు. ఇటీవల ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు పంచాయతీ చంద్రాయపాలెం వద్ద ఘటనలో పోలీసు సిబ్బందిపై దాడి ఘటన మరువకముందే ములకలపల్లి మండలం అన్నారం పరిధిలో అటవీ గార్డుగా పనిచేస్తున్న పూర అనే వ్యక్తిపై గురువారం మధ్యాహ్నం దాడి జరిగింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అన్నారం అటవీ పరిధిలో పోడు భూముల్లో ట్రాక్టర్ ద్వారా చెరువు కట్టలు పోస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అటవీ గార్డు పూర ఆ ప్రాంతానికి వెళ్లాడు. అయితే అక్కడే ఉన్న పోడుసాగుదారుడు చుక్కయ్యతో గొడవ జరిగింది. చుక్కయ్య చేతిలో ఉన్న పారతో గార్డు పూర తలపై రెండుసార్లు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ములకలపల్లి అటవీరేంజ్ సిబ్బంది తీవ్రంగా గాయపడిన గార్డును చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ములకలపల్లి పోలీస్ స్టేషన్ నందు అటవీ శాఖ వారు ఫిర్యాదు చేశారు.

పంట మాడుతోంది, గొంతెండుతోంది

రైతులను పట్టించుకోని కాంగ్రెస్

- ఎంపీ అభ్యర్థి నామ
- స్థాయిని మరిచి మాట్లాడుతున్న సీఎం
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా
- దోపిడీ పాలన - మాజీ ఎమ్మెల్యే తాటి

నవతెలంగాణ - అశ్వారావుపేట

రాష్ట్రంలో వేసవి రాకముందే నీటి ఎద్దడి నెలకొని ఒక పక్క పంటలు మాడుతుంటే మరో పక్క తాగు నీరు అందక ప్రజల గొంతు ఎండు తుందని ఎంపీ నామ నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేసారు. ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలోని జెడ్పీటీసీ వరలక్ష్మి వ్యవసాయం క్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నామ నాగేశ్వరరావు నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు అత్యధిక ఓట్లు పోలయ్యాయని తెలిపారు. కృష్ణార్జునులులా ఎన్నికల సమరంలో కాంగ్రెస్‌తో సామాజిక యుద్ధం చేయడానికి ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు సమన్వయంతో పనిచేస్తున్నారని అన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ అశ్వారావుపేట నుండే వచ్చిందని, ఇప్పుడు కూడా అదే పునరావృతం కావాలని ఆశించారు. రాష్ట్ర వ్యాప్తంగా నీటి ఎద్దడి కారణంగా సుమారు 15 లక్షల ఎకరాల పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. కేసీఆర్ ఎప్పుడూ గ్రామాలు పచ్చగా ఉండాలని కోరుకునే వారు, ఆ విధంగానే సంక్షేమ పథకాలు కూడా ప్రవేశపెట్టారు.. దేశంలో ప్రతి ఇంటికీ నల్లా నీరు ఇచ్చిన రాష్ట్రం ఏదని పార్లమెంట్ లో నేను ప్రశ్నిస్తే తెలంగాణ అని సమాధానం వచ్చిందని గుర్తు చేశారు. అదే విధంగా వరి ఎక్కువ పండించే రాష్ట్రం ఏదంటే అక్కడ కూడా తెలంగాణనే ముందుంది, ఈ ఘనత కేసీఆర్‌దే అన్నారు. కాంగ్రెస్‌కి అధికారం కట్టబెట్టినందుకు గ్రామాల్లో ప్రజలు పశ్చాత్తాపపడుతున్నారని ఎద్దేవా చేసారు.

మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ 2 లక్షల మెజారిటీతో నామ నాగేశ్వరరావు విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేసారు. యుద్ధానికి మనం అందరం సిద్ధంగా ఉండాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని, హెూదాను మరిచిన ముఖ్యమంత్రి జులాయిగా మాట్లాడుతున్నారని చురకలు అంటించారు. ముగ్గురు మంత్రులతో ఖమ్మం జిల్లా అయోమయం అవుతుందని, ముగ్గురు మూడు దార్లులో నడుస్తున్నారని ఎద్దేవా చేసారు. అశ్వారావుపేట మండలంలో బీఆర్ఎస్ శ్రేణులను బెదిరిస్తున్నట్లు తెలిసిందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, ఎవరూ అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు.

మరో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డిసెంబర్ 9 తర్వాత మా రాజ్యం వస్తుంది అంటే ప్రజారాజ్యం అనుకున్నాం కానీ కాంగ్రెస్ దోపిడీ రాజ్యం వస్తుందని అనుకోలేదని ఎద్దేవా చేసారు. గెలిచి 100 రోజులు దాటినా రైతు బంధు డబ్బులు అకౌంట్ల లోకి చేరలేదని, కేసీఆర్ కల్యాణ లక్ష్మీ ఇస్తుంటే మేము తులం బంగారం ఇస్తామని అన్నారు. ఆ తులం బంగారం ఎక్కడ అని ప్రశ్నించారు. అత్తకు రూ.3 వేలు, కోడలికి రూ. 4 వేలు అన్న కాంగ్రెస్ నాయకులు అసలుకే ఎసరు పెట్టారని వాపోయారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి, అశ్వారావుపేట జెడ్పీటీసీలు సున్నం నాగమణి, చిన్నం శెట్టి వరలక్ష్మి, మాజీ జెడ్పీటీసీలు జూపల్లి కోదండ వెంకట రమణారావు, అంకత మల్లికార్జున రావు, స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, నియోజక వర్గం అధికార ప్రతినిధి యు.ఎస్ ప్రకాష్, దిశ కమిటీ చైర్మన్ గారపాటి సూర్యనారాయణ పాల్గొన్నారు.



బిర్రంను పరామర్శించిన ఎంపీ నామ

బీఆర్ఎస్ మండల నాయకులు, టెలీ కామ్ సలహా మండలి పూర్వ సభ్యులు బిర్రం వెంకటేశ్వరరావును ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావులు గురువారం పరామర్శించారు. బిర్రం ఇటీవల శ్వాస సంబంధం వ్యాధితో బాధపడుతూ ముక్కు శస్త్ర చికిత్స చేయించుకుని వినాయక పురంలోని తన స్వగృహంలో విశ్రాంతి పొందుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని అశ్వారావుపేట నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన మండల స్థాయి విస్తృత సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నామ నాగేశ్వరరావు కార్యక్రమం అనంతరం వినాయకపురంలోని బిర్రం నివాసానికి వెళ్ళి ఆయన ఆరోగ్యం స్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఐసీడీఎస్‌లో పైరవీలు

- డిప్యుటేషన్ రద్దు చేశారు.. తాత్కాలికంగా నిలిపివేశారు
- ఐసీడీఎస్‌లో వింత సంఘటన

నవతెలంగాణ-పాల్వంచ

పైరవీలకు నిలయంగా రాష్ట్ర ఐసీడీఎస్ కార్యాలయం నిలుస్తుందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. కొందరు సీడీపీఓలపై వచ్చిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు చేపట్టిన ఐసీడీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మంత్రుల పేరుతో అధికారులు తప్పుదోవ పట్టించి చర్యలను నిలుపుదల చేసుకునే విధంగా ప్రయత్నాలు జరిపారు. అంతేకాకుండా నాకు మంత్రి అండ ఉంది.. నన్ను ఎవరు ఏం చేయలేరని భావుటంగనే చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. సంబంధిత జిల్లా అధికారులు విచారణ జరిపి నివేదికలు అందజేసినప్పటికీ చర్యలు తీసుకున్నా, పైరవీలతో మళ్లీ విధుల్లో చేరుతున్నారు. అందుకు మణుగూరు సీడీపీఓ సాక్ష్యంగా నిలిచింది. వివరాల్లోకెళ్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సీడీపీఓ విజయలక్ష్మి డిప్యుటేషన్ రద్దుచేసి తన శాశ్వత ప్రాంతమైన ఖమ్మం అర్బన్ మండలానికి వెళ్లాలని ఉత్తర్వులు జారీ చేసిన రీజినల్ డైరెక్టర్, మత శిశు సంక్షేమ శాఖ అధికారి తాత్కాలికంగా నిలవాలని మౌలిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మణుగూరు సీడీపీఓపై అవినీతి, అక్రమాల ఆరోపణలు రావడంతో ఆమె విచారణ చేపట్టిన జిల్లా సంక్షేమ అధికారి విజేత, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. విజయలక్ష్మి వాస్తవంగా ఖమ్మం అర్బన్ మండలంలోని ఏసీడీపీఓగా పనిచేస్తోంది. కాగా 2019లో డిప్యుటేషన్‌పై మణుగూరు మండలానికి సీడీపీఓగా వచ్చారు. అప్పటినుంచి ఆమె మణుగూరు సీడీపీఓగా తిష్ట వేశారు. కాక ఇటీవల ఆమెపై వచ్చిన అవినీతి ఆరోపణపై జిల్లా సంక్షేమ అధికారి నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు విజయలక్ష్మి డిప్యుటేషన్ రద్దుచేసి ఖమ్మం అర్బన్ ప్రాంతానికి పంపాలని రెండు రోజుల కిందట ఆదేశాలు జారీ చేశారు. ఏమైందో కానీ ఆమె డిప్యుటేషన్ ఆదేశాలను తాత్కాలికంగా అమలు చేయకుండా వాయిదా వేశారని తెలుస్తుంది. ఇటీవల పాల్వంచ సీడీపీఓ ఇలాంటి అక్రమాలకు పాల్పడినందుకు ఆమె డిప్రెషన్ రద్దుచేసి ఖమ్మం జిల్లా తిరుమలాయ పాలెం బదిలీ చేశారు. కాగా తాజాగా మణుగూరు సీడీపీఓపై అదే తరహా చర్యలకు పాల్పడి తిరిగి వాయిదా వేయడం గమనార్హం.

విచారణ జరిపి నివేదిక అందించాం : జిల్లా సంక్షేమ అధికారి విజేత

మణుగూరు సిడిపిఓ సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తలపై స్పందించి విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం. ఏ నిర్ణయమయిన ఉన్నతాధికారులదే. తీసుకున్న చర్యలకు తాత్కాలిక ఉపసంహరణ నిజమే అన్నారు.



తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించండి

- ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్
- జిల్లాలో తాగునీటి ఎద్దటి నివారణపై సమీక్ష

నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాలో తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ అన్నారు.

గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, జిల్లా అధికారి కృష్ణ గౌడ్‌లతో కలసి ప్రత్యేక అధికారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలో తాగునీటి వనరులు, లభ్యత, సరఫరా తదితర వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. వార్తా పత్రికల్లో వచ్చిన తాగునీటి ఎద్దడి కథనాలపై వివరణను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మారుమూల గుత్తి కోయ గ్రామాలకు తాగునీటి సరఫరాకు ఎటువంటి సౌకర్యాలు లేవని, చలమల ద్వారా నీరుని తాగుతున్నారని, ట్యాంకర్ల ద్వారా రవాణాకు ఇబ్బందులు ఉన్నాయని, అడవి శాఖ అధికారులు అనుమతిలిస్తే రహదారులు ఏర్పరచుకొని తాగునీరు అందిస్తామని అధికారులు తెలుపగా, ఆయన అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్ ను సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్యలు పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, ప్రణాళికలు బాగున్నాయని అభినందించారు. ఏదైనా సమస్య రావడానికి ముందే గుర్తించి వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించివాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్లను ఆదేశించారు. రెడ్ క్రాస్ సొసైటీ వాలంటీర్లు తమ పరిధిలోని తాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావాల్సింది సమస్యలను ముందుగానే పరిష్కరించడానికి అవకాశం ఉందని రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు కాంతారావుకి సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రాబోవు రెండు నెలల్లో తాగునీటి ఎద్దడి రాకుండా జిల్లాలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆయన ఆదేశించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్యకు తీసుకుంటున్న నివారణ చర్యలు, ముందస్తు ప్రణాళికలు గురించి వివరించారు. జిల్లాలో తాగునీటి సమస్యలపై నిరంతర పర్యవేక్షణ చేస్తూ తాగునీటికి సరఫరాకు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డిఓ విద్యాచందన, మిషన్ భగీరథ సిఈఈ శ్రీనివాసరావు, ఎస్ ఈ సదాశివకుమార్, ఈఈ తిరుమలేష్, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, జెడ్పీ సీఈవో ప్రసూన రాణి, భూగర్భ జల శాఖ అధికారి బాలు, డీపీఓ చంద్రమౌళి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

శాసనమండలి తుది ఓటర్ జాబితా విడుదల

నవతెలంగాణ-పాల్వంచ

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలికి జరగనున్న పట్టభద్రుల ఎన్నికలకు తుది ఓటర్ జాబితాను జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 39,897 మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారని తెలిపారు. అందులో పురుషులు 22485, స్త్రీలు 17412 గా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో 29 ప్రదేశాలలో 55 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్సీ నోటిఫికేషన్ ప్రకటించి నామినేషన్ తేదీ వరకు అర్హులైన గ్రాడ్యుయేట్స్ ఓటర్ నమోదుకు అవకాశం ఉందనికలెక్టర్ తెలిపారు.

జిల్లాలో శిశు మరణాలు అరికట్టాలి : కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా అధ్యక్షతన శిశు మరణాల సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగిన 0-5 సంవత్సరాల లోపు శిశు మరణాల వివరాలు అడిగి తెలుసుకుని, వాటి నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో శిశు మరణాల నివారణకు వైద్య అధికారులు, గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలని, చిన్నపిల్లలకు ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే దగ్గర్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని ఆదేశించారు. జిల్లాలోని ఆసుపత్రులలో అన్ని రకాల ఎమర్జెన్సీ మందులు అందుబాటులో ఉంచాలని, చిన్నారుల మరణాలు జరగకుండా వైద్యం అందించాలని వైద్య విధాన పరిషత్, ఎంసిహెచ్ రామవరం వైద్యాధికారులను ఆదేశించారు. తదుపరి శిశు మరణాల సమీక్ష సమావేశానికి జిల్లాలోని వైద్య అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు.



ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సుకృత, డీఐఓ డాక్టర్ బాలాజీనాయక్, కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపర్డెంట్ డాక్టర్ నరసింహారావు, ఆర్ఎంఓలు డాక్టర్ వీరబాబు, డాక్టర్ పుష్పలత భద్రాచలం, పాల్వంచ ఆసుపత్రుల, సూపర్డెంట్లు, పిహెచ్సి వైద్యాధికారులు పాల్గొన్నారు.

టెట్‌ను ఎవరు రాయాలనేది స్పష్టతనివ్వాలి

- ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి
- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్

నవతెలంగాణ-పాల్వంచ

ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ను ఎవరు రాయాలననే విషయంలో ప్రభుత్వం స్పష్టతనివ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేటీపీఎస్ లను సందర్శించి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా చావా రవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రమోషన్లకు ఆటంకంగా మారిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌నకు సంబంధించి ఎవరికీ మినహాయింపు ఉంది ఎవరు(సెకండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్, పండితులు, పీఈటీలు) ఏ రకమైన పరీక్ష రాయాలనే విషయం మీద ప్రభుత్వం వెంటనే స్పష్టతను ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయాల్సిన అవసరం అయిన పక్షంలో ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు సంబంధించి డిపార్ట్మెంటల్ పరీక్షల తరహాలో ప్రత్యేక టెట్ ను నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తమ మేనిఫెస్టోలో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. చాలా కాలం నుండి ఈ కుబేర్ లో పెండింగ్లో ఉన్నటువంటి బిల్లులను విడుదల చేయాలన్నారు. సీపీఎస్ ను రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు, పాల్వంచ మండల బాధ్యులు ఎస్.కె యాకూబ్ పాషా, నరసింహారావు, బి.శ్రీనివాసరావు, విటిఆర్



మోహన్ రావు, టి.బాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత పాల్వంచ ప్రధానోపాధ్యాయులు ఏ పద్మలత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేటీపీఎస్ ప్రధానోపాధ్యాయులు బీపీఆర్ఎల్ కుమారి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి శుక్రవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం పట్టణంలోని శ్రీనగర్ కాలనీ, ఎస్ఆర్ గార్డెన్, ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి, రెడ్డిపల్లి, ఏదులాపురం, కూసుమంచి మండలంలో కూసుమంచి, గైగోళ్లపల్లి, జుజ్జుల్‌రావుపేట గ్రామాల్లోని పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

డ్రయినేజీ మరమ్మతులు





నవతెలంగాణ-దమ్మపేట

దమ్మపేట మేజర్ పంచాయతీకి ఎంతో కాలం నుండి డ్రైనేజీ వ్యవస్థ పటిష్టంగా లేకపోవడంతో వర్షాకాలంతో పాటు అన్ని కాలాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికను తీసివేస్తున్నారు. డ్రైనేజీ పైనే కొంతమంది గ్రామస్తులు నిర్మాణాలు సైతం చేపట్టారు. దీంతో ఆ నిర్మాణాలను సైతం తొలగించి పూడికతీతను తీయడంతో దమ్మపేట ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కె.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీ అధికారులు, పంచాయతీ ప్రత్యేక అధికారి సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కొంతమంది వ్యక్తులు కావాలని తనను ఇబ్బంది పెట్టడానికి సోషల్ మీడియాలో అనేక పోస్టులు పెడుతున్నారని అవన్నీ వాస్తవాలు కాదని కేవలం పంచాయతీ నిధులతో పంచాయతీ సిబ్బంది తమ దృష్టికి తీసుకురావడం పంచాయతీ ప్రజలు ఇబ్బందుల్ని నేరుగా మేము పరిశీలించి ఈ కార్యక్రమం చేపట్టామని దీనిలో దమ్మపేట గ్రామపంచాయతీకి తప్ప ఎటువంటి వ్యక్తులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. గురువారం పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను దమ్మపేట పంచాయతీ ప్రత్యేక అధికారి ఎంపిడిఓ రవీందర్ రెడ్డి, ఎంపిఓ రామారావు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తో పాటు పంచాయతీ సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు.

స్పెషలాఫీసర్‌కు ఆర్డీఓ స్వాగతం



నవతెలంగాణ-బూర్గంపాడు

జిల్లాలో మంచినీటి సమస్య ఉన్న గ్రామాలను పర్యవేక్షించేందుకు నియమించిన స్పెషలాఫీసర్ సురేంద్ర మోహన్‌ను సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్లో భద్రాచలం ఆర్డీవో దామోదరరావు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలకుండీని ఇచ్చి స్వాగతం పలికారు.



ఇద్దరు దొంగలు అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు పరిసర ప్రాంతాలలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను అరెస్ట్ చేసినట్టు డీఎస్పి రవీందర్ రెడ్డి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మణుగూరులోని పూల మార్కెట్ సెంటర్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పోలీసు వారిని చూచి పారిపోతుండగా అట్టి వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. విచారించగా గంటా ప్రవీణ్, మాట్ల రాము ఇద్దరు వ్యక్తులు మణుగూరుకు చెందినవారు వీరు ఇరువురు గతంలో రాత్రిపూట తాళం వేసిన ఇండ్లలో చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. అదేవిధంగా గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో ముత్యాలమ్మ నగర్, డిసెంబర్ నెలలో సమితి సింగారం అదేవిధంగా ఈ సంవత్సరం ఫిబ్రవరిలో అశోక్ నగర్ ప్రాంతంలో, శివలింగాపురం ప్రాంతంలో అదేవిధంగా గత నెల మార్చిలో సాయి నగర్, సుందరయ్య నగర్ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడ్డారని అన్నారు. తాళం వేసి ఉన్న ఇండ్లలో చొరబడి మొత్తంగా సుమారు 25 తులాల బంగారం ఆభరణాలు, 80 తులాల వెండి ఆభరణాలు దొంగిలించినట్టు తెలిపారు.

గురువారం ఇరువురు వద్ద నుండి మొత్తంగా అన్ని కేసులలో కలిపి 10 తులాల బంగారు ఆభరణాలు, 80 తులాల వెండి ఆభరణాలను స్వాధీన పరచుకున్నట్టు తెలిపారు. అదేవిధంగా మణుగూరు ప్రాంతంలో ఇంతకుముందు గంటా ప్రవీణ్ అనే వ్యక్తి మీద 15 దొంగతనం కేసులు నమోదు కాబడి ఉన్నాయి. ఇతను ఇంతకుముందు జైలు జీవితాన్ని గడిపి వచ్చాడు. ఇట్టి కేసులలో మణుగూరు ప్రాంతానికి సంబంధించిన మధు, సాగర్ అనే వ్యక్తులు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుండి మరికొన్ని బంగారు ఆభరణాలు రికవరీ చేయవలసి ఉన్నదన్నారు. ఈ సమావేశంలో సీఐ సతీష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వాలీబాల్ క్రీడా పరికరాలు వితరణ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా చేయూత ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్టు గురువారం వితరణగా అందజేశారు. క్రీడా చేయూత ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో 10 పాఠశాలలకు వాలీబాల్ పోల్స్, నెట్, వాలీబాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడా చేయూత అధ్యక్షుడు ఆయులురీ వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి గూడూరు కోటిరెడ్డి మాట్లాడుతు క్రీడల యందు ఆసక్తి గల క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో అవసరం అయిన చోట క్రీడా సామాగ్రి, క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కావలసిన సహాయం అందజేస్తున్నారు. దీనికి ముఖ్యంగా వెనుక ఉండి సహకారం అందిస్తూ ఉన్న వాసవి కాలేజీ మిత్రులందరికీ ధన్యవాదాలు అని తెలియజేశారు. జిల్లాలో ఖమ్మం, ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల, రికాబజార్, బాణాపురం, చెన్నూరు, మధిర, నేలకొండపల్లి, మామూనూరు, పాఠశాలకు అందించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు డీ.సతీరెడ్డి, శ్రీహరి, సుధాకర్, శ్యాంబాబు, సుధాకర్‌రెడ్డి పాల్గొని వితరణ చేశారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్రీడా చేయూత కమిటీని సునీల్ కుమార్‌రెడ్డి, గౌస్ సర్, అక్బర్ సర్, ఆదర్శ, ప్రధానోపాధ్యాయులు వెంకటరామిరెడ్డి తదితరులు అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆటోనగర్ సమీపంలో రోడ్డు పక్క ఉంటే బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని ఆచూకీ ఎవరికైనా తెలిస్తే ఖమ్మం రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రామారావు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ ఉమెన్స్ గిల్డ్ వితరణ



నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి

మండలంలోని అశోక్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అశోక్ నగర్-2 అంగన్వాడీ సెంటర్ నందు చిన్నారి బాలబాలికలకు ఆట వస్తువులు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ (ఎస్‌జీఎఫ్) ఉమెన్స్ గిల్డ్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ నూరి మెహరున్నిసా, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిమల్ల శ్వేత, ముఖ్య సలహాదారులు ఎం.జ్యోతి రాణి, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా జయ, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-కొత్తగూడెం



వికలాంగులు, వయోవృద్ధులు ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని, యువతకు ప్రేరణగా నిలవాలని కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. గురువారం ఓటర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్, సెక్స్ వర్కర్లకు ఓటు అవగాహన ర్యాలీని కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి జెండా ఊపి ప్రారంభించారు. ఓటు మనకు భారం కాదు బాధ్యత అనే నినాదంతో ర్యాలీ బస్టాండ్ సెంటర్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగులు, అంగన్వాడీ టీచర్లు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ వికలాంగులు, 80 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు, పోలింగ్ స్టేషన్ వరకు వెళ్లలేని వికలాంగుల కోసం ఎన్నికల కమిషన్ ఇంటి నుండే ఓటు హక్కు వినియోగించుకునే వీలు కల్పించిందని చెప్పారు. అందుకు అర్హత ఉన్న వారంతా '12-డి' ఫారం నింపాలని తెలిపారు. ఇందుకు ప్రభుత్వ అధికారులు, బీఎల్ఓలు సహకరిస్తారని తెలిపారు. జిల్లాలో ఉన్న ఓటర్లు తప్పక ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వికలాంగులు, వయోవృద్ధులు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకుని, తద్వారా మిగతా ఓటర్లకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రభుత్వం కల్పించిన ఓటు హక్కును బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన మహిళా సంక్షేమ అధికారి వేల్పుల విజేతను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, వేల్పుల విజేత, టీపీపీఎస్, జి.సతీష్, ఎం.ప్రవీణ్, ఖాదర్ భాబా, నగేష్, చాంద్ పాషా, రాజయ్య, కాసిం, ఐసిడిఎస్ అంగన్వాడీ టీచర్లు సూపర్‌వైజర్లు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఏకుల పోతమ్మ తల్లి దేవాలయ చైర్మెన్‌గా దొడ్డా



నవతెలంగాణ-దమ్మపేట

మండలంలోని అత్యంత ప్రతిష్ట కలిగిన ఏకుల పోతమ్మ తల్లి దేవాలయ చైర్మెన్‌గా దొడ్డ భాస్కరరావును గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని రాజమండ్రి-సూర్యాపేట హైవేకి ఆనుకొని మోద్దులగూడెం గ్రామంలో ఉన్న ఈ ఆలయానికి ఎంతో చరిత్ర కలదు. దేవాలయంలో ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. దొడ్డ భాస్కరరావు సంవత్సరానికి వచ్చే హుండీ ఆదాయాన్ని రూ.3,10,016 వేలం పాట పాడుకున్నారు. ఆ సొమ్మును వెంటనే డిపాజిట్ చేశారు. ఈ సొమ్ముతో దేవాలయ అభివృద్ధితోపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని దేవాలయ అభివృద్ధికి నిరంతరం తాను కృషి చేస్తానని తనపై నమ్మకం ఉంచిన కమిటీ సభ్యులకు గ్రామ ప్రజలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నాడు మూడు వేల మంది

నేడు మూడు వందల మంది

- విస్తృత సమావేశంలో స్వల్ప హాజరు
- బలహీన పడ్డ గులాబీ బలగం
- మోహం చాటేసిన పెద్దలు

నవతెలంగాణ-అశ్వారావుపేట



రాజకీయంలో వారు వీరు...వీరు వారు అవడం సహ జాతి సహజం అని నిరూపణ అవుతున్నాయి. నాయకులు, కార్యకర్తలు సైతం అధికారం ఉంటే ఓ రకం లేకుంటే మరో రకంగా తయారయ్యారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చిన వారు, నాయకులకు అభిమానులు సైతం ఆరు నెలల సహవాసంలో వారు వీరు అవడం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. గురువారం నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో పార్లమెంట్ ఎన్నికల్లో విజయాన్ని కాంక్షిస్తూ, ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించడం కోసం మండల స్థాయి విస్తృత సమావేశం ఏర్పాటు చేసారు. అయితే పంచాయతీకి 10 మంది చొప్పున 30 పంచాయతీల నుండి 300 మంది క్రియాశీల సభ్యులకు ఆహ్వానం పలికారు. 350 మందికి వసతి, భోజనం సదుపాయం కల్పించారు. కానీ హాజరు మాత్రం అనుకున్నంత కాలేదని హాజరైన ముఖ్యులు ఏ విస్మయానికి లోనయ్యారు అని తెలుస్తుంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇదే ప్రాంగణం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 3 వేలు పై చిలుకు హాజరు అయ్యారని, నేడు ఆ గులాబీ గుబాళింపు కళ తప్పిందని పలువురు నాయకులు వాపోతున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికలను అన్నీ వారై చూసిన ఓ పెత్తందారీ సామాజిక వర్గం పెద్ద తలలు మొహం చాటేయడంతో చర్చకు దారితీసింది. అసెంబ్లీ పోలింగ్ ముందు కాంగ్రెస్ నుండి వచ్చిన ఒకరిద్దరి ఆ బలగం సైతం కనిపించకపోవడంతో సభా ప్రాంగణం పేలవంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల్లో పుంజుకోకపోతే మరింత బలహీన పడే అవకాశం ఉందని సీనియర్ నాయకుల ఉవాచ.

తాగునీటి సమస్య రాకుండా చూడండి

- అదనపు కలెక్టర్ సత్య ప్రసాద్

నవతెలంగాణ-వేంసూరు



గ్రామాలలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్, స్థానిక సంస్థల జిల్లా అధికారి సత్య ప్రసాద్ అన్నారు. గురువారం లింగపాలెం, మర్లపాడు, రాయుడుపాలెం గ్రామాలలో పోలీస్ స్టేషన్‌లో, మండల కేంద్రంలో డబల్ బెడ్ రూమ్‌లో నీటి సమస్యను పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లుతో పాటు పాఠశాలలకు రంగులు వేసేందుకు నిధులు సక్రమంగా వినియోగించుకోవాలని, కరెంటు వైరింగ్, ఫ్యాన్లు, తాగునీరు ఉండే విధంగా చూడాలని సూచించారు. మండల అధికారులు గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అమ్మపాలెంలో గత కొన్ని సంవత్సరాలుగా మిషన్ భగీరథ నీరు రావడంలేదని గ్రామస్తులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నీటి సమస్య ఉన్నచోట అవకాశాలను బట్టి దగ్గరలో ఉన్న మోటార్లను ఉపయోగించుకొని అందించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో జీ.రమేష్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఉపాధి పనులను తనిఖీ చేసిన ఏపీడీ

నవతెలంగాణ-కారేపల్లి

మండలంలోని పోలంపల్లిలో జరుగుతున్న ఉపాధీ హామీ పనులను డీఆర్డీఏ ఏపీడీ శ్రీదేవి గురువారం తనిఖీ చేశారు. పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. వర్క్ డిమాండ్‌కు అనుగుణంగా పనులు కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ వేసవీ దృష్ట్యా రోజు కూలీ రూ.300 పడేలా పనులు చేయించాలని సూచించారు. ఉపాధీ నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళ్లాలో పనులు నిర్వహించటం ద్వారా వడ దెబ్బ నుండి రక్షించుకోవచ్చున్నారు. ఉపాధీ పనులలో హాజరు శాతం పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీఏ జీ.వసంత్, ఎఫ్ఏ ఎట్టి కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ దారావత్ భద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో పర్యటించిన పొంగులేటి ప్రసాద్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి మండలంలో గురువారం పర్యటించారు. బారుగూడెంలో కంటమహేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా, గోళ్లపాడులో విగ్రహ ప్రతిష్ఠాకు హజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గూడురుపాడు, జాన్‌బాద్ తండాలో వివాహాలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు బండి జగదీశ్, హరినాథబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి మండలంలోని పిండిప్రోలు పర్యటనకు వచ్చిన సందర్భంగా గురువారం కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ నాయకులు, కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ చావా శివరామకృష్ణ ఆధ్వర్యంలో 40 కార్లతో భారీ ర్యాలీగా ఎదురెళ్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం కొక్కిరేణి రెవిన్యూ పరిధిలో పిండిప్రోలు జాతీయ రహదారి పక్కన ఖమ్మం వరంగల్ జాతీయ రహదారి పక్కన నూతన అంగులతో ఏర్పాటుచేసిన సాయి మదిన ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తాటికొండ కిరణ్, కాంగ్రెస్ మండల యువజన నాయకులు దూదిమెట్ల వెంకట్, పోట్ల కిరణ్, పొట్ల ప్రవీణ్, రావూరి యాకూబ్ రావు, చామకూరి శ్రీనివాస్, షేక్ సలీం, కొలిచలం వెంకటేశ్వర్లు, కొమ్ము భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

నవతెలంగాణ-వైరా

వైరా మున్సిపాలిటీ కార్మికులకు మున్సిపాలిటీ కమిషనర్ వేణు గురువారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వేణు మాట్లాడుతూ వడదెబ్బ నివారణకు ఓఆర్ఎస్ తాగడం ఎంతో మంచిదని, ఎండ తీవ్రతను తట్టుకునే విధంగా కార్మికులకు ముందస్తు జాగ్రత్తగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు, ఇతర కార్మికులు ఎక్కడైనా పని చేసేటప్పుడు ఎండ వల్ల ఏమైనా ఇబ్బంది కలిగిన వెంటనే పక్కకు కూర్చొని ఆఫీస్ వద్దకు రావాలని సూచించారు. ఎండల మండుతున్న నేపథ్యంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపాలిటీ వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

- వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ఏదులాపురం పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలో గుదిమళ్ల, తీర్థాల, గోళ్లపాడు, కన్నాతండా గ్రామాల్లో నాలుగు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, అన్నదాతలు ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు సూచించారు. మద్దులపల్లిలో వేసవి వరి సాగును గురువారం పరిశీలించి అన్నదాతలకు పలు సూచనలు చేశారు. ఎండల తీవ్రత, నీటి ఎద్దడి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ విజయ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-కల్లూరు

పట్టణంలోని మధిర రోడ్డులో గోపి ఫ్లెక్సీ సెంటర్‌ను జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి, ఏనుగు సత్యం బాబు, పోట్రు సత్యం, పొట్రు శ్రీనివాసరావు, కేవీ, షేక్ యాకోబు అలి, భూక్యా శివకుమార్ నాయక్, యాసా శ్రీకాంత్, నోటి కృష్ణారెడ్డి, తోట సుబ్బారావు, రాజబోయిన శ్రీను, మట్టా రామకృష్ణ, నరుకుళ్ళ సురేష్, బొల్లం ఉపేందర్‌గౌడ్, బొడ్డు తిరుపతిరావుగౌడ్, టీడీపీ మండల నాయకులు కట్టా గోపాలరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాధారం పాఠశాలలో వార్షికోత్సవం

నవతెలంగాణ - కారేపల్లి



మండలంలోని మాధారం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. 7వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ 6వ తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ డే జరిపారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన మూడు చేపల కథ, ఏ మిస్టేక్ నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ సంద్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు ఆర్. మల్లేశ్వరరావు, అన్నవరపు దామోదర్‌రావు, జీ.వెంకటేశ్వర్‌రావు, బాలిన వెంకటరెడ్డి, డీ.నాగభూషణం, భవాని, హెచ్.భద్రు, ఎం. చైతన్యలక్ష్మి, గ్రామస్తులు నాగుల్‌మీర, సమ్మక, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావమ్మకు నివాళి

నవతెలంగాణ-కారేపల్లి

మండలంలోని గేటుకారేపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు గుడిపూడి నర్సయ్య మాతృమూర్తి గుడిపూడి వెంకట్రావమ్మ ఇటివల అనారోగ్యంతో మృతి చెందారు. వెంకట్రావమ్మ సంస్మరణ కార్యక్రమం గురువారం గేటుకారేపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రజినిధులు హాజరై వెంకట్రావమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. సొసైటీ చైర్మెన్ దుగ్గినేని శ్రీనివాసరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మెన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ బానోత్ దేవ్లానాయక్, సంత ఆలయ చైర్మెన్ అడ్డగోడ ఐలయ్య, ఎంపీటీసీ పెద్దబోయిన ఉమాశంకర్, ఎస్ఆర్ఐ గుడిపూడి తిరుమలరావు, మండెపూడి వెంకటయ్య, నాగయ్య, కెటల్లి కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు బానోత్ రామ్మూర్తి, సాయిన్ని తిరుపతిరావు, చెరుకూరి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్‌నాయకులు అజ్మీర వీరన్న, బానోత్ కోటి, గుగులోతు హారు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన ప్రముఖులు

నవతెలంగాణ-కారేపల్లి

పేరుపల్లిలో గురువారం జరిగిన వివాహ వేడుకకు ప్రముఖులు హాజరైనారు. పేరుపల్లిలో కాంగ్రెస్ నాయకులు బానోత్ వీరభద్రం కుమార్తె శ్రీనందిత పంచాయతీ కార్యదర్శి కుమార్ వివాహ వేడుకలో వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు ఇంచార్జీ, తంబూరు దయాకర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మెన్ బొర్రా రాజశేఖర్‌లు హాజరై వధువరులను ఆశీర్వదించారు.

బాధితునికి దయాకర్‌రెడ్డి పరామర్శ

పేరుపల్లిలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బండారు నాగేశ్వరరావును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు ఇంచార్జీ దయాకర్‌రెడ్డి పరామర్శించారు. నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని అన్ని రకాల సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ దుగ్గినేని శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ బానోత్ దేవ్లానాయక్, ఎంపీటీసీ ఆలోత్ ఈశ్వరినందరాజ్, కాంగ్రెస్ నాయుకలు ఇమ్మడి తిరుపతిరావు, బానోత్ రామ్మూర్తి, మల్లెల నాగేశ్వరరావు, గుగులోత్ శ్రీను, అజ్మీర నరేష్, గణపారపు లక్ష్మీనారాయణ, ధోని, హేమ్లా, తదితరులు పాల్గొన్నారు.

అభయ సాయి దేవాలయంలో అన్నదానం

నవతెలంగాణ-మధిర

మధిర పట్టణంలోని రెండో వార్డ్ ఎన్జీవోస్ కాలనీలో అభయ సాయి మందిరంలో ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమంలో భాగంగా దాతలు లిహెమ్ సాయి, చెడే సతీష్ ఈశ్వరి, కే.రామకృష్ణ భవాని తదితరుల ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని, భక్తులు తమ పెళ్లిరోజు, పుట్టినరోజు కానీ ఓ ప్రత్యేక రోజు అన్నదానం చేసి బాబా కృపకు పాత్రులు కాగలరని భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పదేండ్లుగా
రుణమాఫీ చేయని బీఆర్ఎస్ సిగ్గుపడాలి..

- నిమిషం కూడా కరెంట్ పోకుండా చూస్తున్నాం
- గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం
- తుక్కుగూడ సభను విజయవంతం చేయాలి : వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

పదేండ్లుగా రుణమాఫీ చేయనందుకు బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. గత ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అవినీతి రాజ్యం ఏలిందని, వారు చేసిన తప్పులను దిద్దుకుంటూ ఈ ప్రభుత్వం ముందుకు వెళుతుందని తెలిపారు. ఖమ్మం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. వర్షాలు సరిగ్గా లేకపోవడం వల్ల ప్రాజెక్టుల్లో నీళ్ల లేవన్నారు. నాగార్జున సాగర్‌లో గేట్లు ఎత్తినా నీళ్ళు రాని పరిస్థితి నెలకొందన్నారు. మంచి నీళ్లను పక్క రాష్ట్రాల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తుందని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలను దేశం మొత్తం చూస్తుందన్నారు. కష్టకాలం.. కరువు కాలంలో ఉన్నామని, పరిపాలన, ప్రభుత్వం మీద ఏ రకమైన అనుమానాలకు తావు లేదన్నారు. బీఆర్ఎస్ నేతలకు రుణమాఫీ మీద మాట్లాడేందుకు సిగ్గుండాలని, పదేండ్లుగా వారే రుణమాఫీ చేయలేకపోయారని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో సాగు నీరు లేక ఎక్కడా పంట ఎండిపోలేదని, రోజుకి రూ.50 కోట్లు ఖర్చు పెట్టి ఒక్క నిమిషం కూడా కరెంట్ పోకుండా చూస్తున్న ప్రభుత్వం తమదని తెలిపారు. పార్లమెంట్‌లో ఓట్ల కోసం కొంత మంది విమర్శలు చేస్తున్నారని, సాగర్ నుంచి పాలేరుకు నీళ్ల తెప్పించినట్టు చెప్పారు. చేతకాని, పనికిరాని మాటలు ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, ఇప్పటికీ వారి బుద్ధి మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్కటి, రెండు సీట్లు కూడా బీఆర్ఎస్ పార్టీకి రావని తెలిపారు. ధాన్యం అమ్ముకున్న వెంటనే డబ్బులు వచ్చేలా చేస్తున్నామని తెలిపారు. పంట నష్టం బీమా ప్రభుత్వం చెల్లిస్తుందని, రెండు లక్షల అప్పు ఈ ప్రభుత్వం తీర్చుతుందన్నారు. మంచినీటికి ఇబ్బంది ఉన్న మాట నిజమేనని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని సూచించారు. తుక్కుగూడ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షులు దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావీద్, దొబ్బల సౌజన్య, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని ఢీ కొట్టిన ఆటో..
- నలుగురు మృతి, 12 మందికి గాయాలు

నవతెలంగాణ-సూర్యాపేట రూరల్



విజయవాడ 65వ జాతీయ రహదారిపై సూర్యాపేట హైటెక్ బస్‌స్టాండ్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఆటో ఢీ కొట్టడంతో.. నలుగురు మృతి చెందాగా, 12 మందికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లి మండలకేంద్రం నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని సూర్యాపేటకు వస్తున్న ఆటో.. సూర్యాపేటలోని అంజనాపురి కాలనీ వద్దకు రాగానే ఆగి ఉన్న లారీని ఆటో.. వెనుక నుంచి ఢీ కొట్టింది. సూర్యాపేట మండలం బాలెంల సాంఘిక సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు చింతరెడ్డి సరిత, బొప్పని పావని, కలకోట్ల లావణ్య బాలెంల నుండి సూర్యాపేటకు ఆటోలో వస్తున్నారు. అక్కడికక్కడే మృతిచెందిన వారిలో.. చింతరెడ్డి సరితా (44), లక్ష్మీ తండాకు చెందిన మాజీ సర్పంచ్ భార్య లూనావత్ రుక్కమ్మ (63) ఉన్నారు. గాయపడిన గొలుసు వేదస్విని (17నెలలు)ని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. లావణ్య పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, అర్వపల్లి మండలం కసర్లపాడు గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆటోలో ఉన్నారు. తల్లి కొమ్ము సువర్ణ, ఆమె కూతురు గొలుసు సంధ్య, సంధ్య పిల్లలు మొక్షిత్, వేదస్విని కాగా.. వీరిలో వేదస్విని మరణించగా, మొక్షిత్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

సీజ్ చేసిన డబ్బు.. ఎవరికిచ్చారు?

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల సమయంలో ఎంత మంది విపక్షాలకు చెందిన డబ్బులను సీజ్ చేశారు? ఆ డబ్బులను ఎవరికిచ్చారు? అందులో స్వప్రయోజనానికి వాడుకున్నది ఎంత? అనే ప్రశ్నలు కూడా రాధాకిషన్‌రావుపై గుప్పించారని సమాచారం. అప్పటి, ఎస్ఐబీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు ఇచ్చిన ఆదేశాల మేరకే తాము ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడినట్టు రాధాకిషన్ మరోసారి స్పష్టం చేయగా.. మరి ప్రయివేటు వ్యక్తుల ఫోన్ ట్యాపింగ్ చేయాలని ఎవరు చెప్పారు? ఎందుకు చేశారు? అని కూడా అధికారులు రాధాకిషన్‌రావును నిలదీసినట్టు తెలిసింది. ఇందులో కొన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చిన రాధాకిషన్‌రావు.. మరికొన్నిటిని దాటవేసినట్టు సమాచారం.

మొయినాబాద్ ఫామ్ హౌజ్‌లో అధికార పక్ష ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పూర్తిగా రాధాకిషన్‌రావు నేతృత్వంలోనే జరిగినట్టు విచారణలో బయటపడింది. మొదట ఈ కేసులో బీజేపీ అభిమాని నందకుమార్ ఫోన్‌ట్యాపింగ్ ద్వారా ఈ ఎపిసోడ్‌కు తెరలేచినట్టు దర్యాప్తు అధికారుల దృష్టికి వచ్చింది. ఆ మేరకు ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాన్ని ముందుకు నడిపిన రాధాకిషన్‌రావు.. మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పైలట్ రోహిత్‌రెడ్డి, గువ్వలబాలరాజు, రేగా కాంతారావు, హర్షవర్ధన్‌రెడ్డిల కొనుగోలుకు సంబంధించి రామచంద్ర భారతీ, సింహయాద్రిల మధ్య బేరసారాలు మొయినాబాద్ ఫామ్ హౌజ్‌లో జరిగిన సందర్భంలో ఆ వ్యవహారాన్ని పూర్తిగా వీడియో చిత్రీకరణ చేయటానికి అవసరమైన ఏర్పాట్లను అక్కడ చేసింది రాధాకిషన్‌రావేనని విచారణలో వెలుగు చూసినట్టు సమాచారం. ఇందుకు అప్పటి సైబరాబాద్ ఐటీ ఇన్‌స్పెక్టర్ జూపల్లి రమేశ్ కూడా ముఖ్యపాత్ర వహించినట్టు దర్యాప్తు అధికారుల దృష్టికి వచ్చినట్టు తెలిసింది.

కాగా, ఎస్ఐబీ కార్యాలయంలో సాగిన విపక్ష నాయకులు, ప్రయివేటు వ్యక్తుల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు కూడా కీలక పాత్ర వహించినట్టు తమ ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని నగర పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ తెలిపారు. ఇక్కడి ఆధారాలను ధ్వంసం చేయటంలోనూ, మాయం చేయటంలోనూ, తగలబెట్టించటంలోనూ రాధాకిషన్‌రావు కూడా చురుగ్గా వ్యవహరించారని ఆయన చెప్పారు. అతనిని ఏడ్రోజుల పాటు కస్టడీలోకి తీసుకున్న తాము.. ఈ కేసును మరింత లోతుగా విచారిస్తున్నామని తెలిపారు.

యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలి

మృతుల కుటుంబాలకు రూ.41 లక్షల చొప్పున పరిహారం

- క్షతగాత్రులకు మెరుగైన వైద్యమందించాలి
- ఫ్యాక్టరీ ముందు ఆందోళన.. పోలీసుల లాఠీచార్జి
- మరణాలు, క్షతగాత్రులపై స్పష్టతివ్వని యాజమాన్యం
- క్షతగాత్రులను పరామర్శించి ఫ్యాక్టరీని సందర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు
- మృతుల కుటంబాలకు రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా
- గాయపడ్డవారిని పరామర్శించి ప్రమాద స్థలం పరిశీలించిన సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం
- కంపెనీ నుంచి ఎక్స్‌గ్రేషియా ఇప్పించేందుకు మంత్రి దామోదర చర్చలు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లాలోని హత్నూర మండలం చందాపూర్‌లోని ఎస్‌బీ ఆర్గానిక్ కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ఘోర ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. 30 మంది కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. రాత్రి వెలికితీసిన ఐదుగురితో పాటు గురువారం ఉదయం మరో మృతదేహాన్ని బయటకు తీశారు. 24 గంటలు గడిచినా పొగ వస్తుండటంతో ఫైరింగ్ సిబ్బంది మంటలార్పుతూనే ఉన్నారు. శిథిలాల కింద మృతదేహాలు ఇంకా ఉండే ఉంటాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఎంత మంది మరణించారో..? ఎంత మంది గాయపడ్డారనే విషయాల్లో ఫ్యాక్టరీ యాజమాన్యం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ఎంత నష్టపరిహారం ఇస్తారనే విషయంలోనూ యాజమాన్యం నాన్చుతోంది. దాంతో బంధువులు, స్థానికులు కంపెనీ ఎదుట బైటాయించి ఆందోళన చేశారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించడమే కాక లాఠీలకూ పని చెప్పారు. పోలీసుల తీరును విపక్షాలు తీవ్రంగా ఖండించాయి. సహాయక చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం, కంపెనీ యజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డాయి. ఎట్టకేలకు కంపెనీ నుంచి ఒక్కో మృతుని కుటుంబానికి రూ.41 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించింది.

ఆరుగురు మృతులు.. 50 మంది క్షతగాత్రులు

ఎస్‌బీ ఆర్గానిక్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, 50 మంది వరకు కార్మికులు గాయాలపాలయ్యారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మృతిచెందిన వారిలో.. కంపెనీ డైరెక్టర్ (గుంటూరు) రవిశర్మ, జనరల్ ఇన్‌చార్జి విష్ణు(చందాపూర్), ఆపరేటర్ సురేష్ పాల్(మధ్యప్రదేశ్), ప్లాంట్ ఇన్‌చార్జి దయానంద్(చెన్నై) యూనిట్-2 సీనియర్ ఎగ్జిక్యూటివ్ సుబ్రమణ్యం(కృష్ణా జిల్లా), ఆపరేటర్ కొనాయిగుల రమేష్ (హత్నూర మండలం కొనాయిగూల)గా గుర్తించారు. మృతదేహాలకు సంగారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం వారి బంధువులకు అప్పజెప్పారు. కంపెనీలో జరిగిన ప్రమాదం గురించి తెలుసుకున్న మృతుల బంధులు, స్నేహితులు.. హుటాహుటిన కంపెనీ వద్దకు వచ్చారు. అక్కడ లేకపోవడంతో మార్చురీలో ఉన్న భౌతికకాయాలను గుర్తించి బోరున విలపించారు. క్షతగాత్రుల్ని స్థానిక ఎంఎన్ఆర్ ప్రయివేట్ ఆస్పత్రితో పాటు సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చిన్న గాయాలతో బాధపడే వాళ్లను స్థానికంగా ఉంచి వైద్య సేవలందిస్తున్నారు. పరిస్థితి విషయంగా ఉన్న వాళ్లను గుర్తించి హైదరాబాద్‌లోని ఉస్మానియాతో పాటు ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. మధ్యప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్మికులే ఎక్కువగా గాయాలపాలయ్యారు. వీరి సమాచారం తెలుసుకున్న వాళ్ల బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. తమ చేతిలో చిల్లిగవ్వలేదని, ఇక్కడ ఎవ్వరూ పట్టించుకోవడంలేదని విలపిస్తున్నారు. తక్షణ సహాయం చేయాలని కోరారు.

న్యాయం చేయాలని ఆందోళన

ఎస్‌బీ ఫ్యాక్టరీ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతులతో పాటు క్షతగాత్రులైన వారి బంధువులు, స్నేహితులు కంపెనీ వద్దకు చేరుకున్నారు. కంపెనీలో ఎంత మంది పని చేస్తున్నారు..? ప్రమాదం జరిగిన షిఫ్ట్‌లో ఎంత మంది డ్యూటీలో ఉన్నారు..? మరణించిన వాళ్ల ఎంత మంది..? ఎంత మందికి గాయాలయ్యాయి..? అనే కనీస సమాచారం కూడా కంపెనీ యాజమాన్యం ఇవ్వకపోవడం, మృతుల కుటుంబాలకు ఎలాంటి నష్టపరిహారం ప్రకటించకపోవడంతో ఆవేదనతో కంపెనీ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. వీరి పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించడమే కాక కొందరిపై లాఠీలు ప్రయోగించారు. స్థానికులు సైతం బాధితుల పక్షం నిలబడటంతో గొడవ సద్దుమణిగింది.

సహాయ చర్యలు శూన్యం : మాజీ మంత్రి హరీశ్‌రావు



ఎస్‌బీ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన, గాయాలపాలైన వారికి కనీస సహాయక చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైంది కాదని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం ఆయన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీతో పాటు ఇతర నాయకులతో కలిసి ఎంఎన్ఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్ని పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి బంధువులతో మాట్లాడారు. ప్రమాదం జరిగిన కంపెనీ వద్దకు వెళ్లి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న మృతుల బంధువులను కలిసి ఓదార్చారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదన్నారు. న్యాయం చేయాలని ఆందోళన చేసిన వాళ్లపై పోలీసులు లాఠీలు ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ తరపున రూ.50 వేల తక్షణ సాయం అందించారు. క్షతగాత్రులకు బీఆర్ఎస్ తరపున సహాయ చర్యలు చేపట్టారు.

యాజమాన్యం లాభాపేక్ష వల్లే ప్రాణనష్టం: సీపీఐ(ఎం)

ఎస్‌బీ ఆర్గానిక్ ఫ్యాక్టరీ యాజమాన్యం లాభాపేక్ష వల్లనే ప్రమాదం సంభవించి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ అన్నారు. గురువారం ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం, కె.రాజయ్య, అతిమేల మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు ఎం.యాదగిరి, విద్యాసాగర్‌తో పాటు నాయకులు శేఖర్, రామాంజనేయులు, సీఐటీయూ నాయకులు చంద్రారెడ్డి, శ్రీరాములుతో కలిసిన ప్రతినిధి బృందం ఎంఎన్ఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్ని పరామర్శించారు. ప్రమాదం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం కంపెనీని సందర్శించి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతుల బంధువుల్ని కలిసి ఓదార్చారు. ఈ సందర్భంగా జయరాజ్, మల్లేశం మీడియాతో మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ. కోటి, క్షతగాత్రులకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగితే యాజమాన్యం కనీసం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. నైపుణ్యంలేని కార్మికులతో పనిచేయించడం వల్లనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. యాజమాన్యంపై హత్యానేరం కింద క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం: మంత్రి దామోదర

ఎస్‌బీ కంపెనీలో ప్రమాదం వల్ల మరణించిన వారి కుటుంబాలకు న్యాయం చేకూరే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీపరంగా అండగా ఉంటామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామన్నారు. నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మ్యాతరి సుదర్శన్, ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి కంపెనీని సందర్శించారు. మంత్రితో పాటు రాజిరెడ్డి కంపెనీ యాజమాన్యంతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడి బాధితులకు నష్టపరిహారం గురించి చర్చించారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంపెనీ ప్రతినిధులు అనేక కొర్రీలు పెడుతూ చివరికి ఒక్కో మృతుని కుటుంబానికి రూ.41 లక్షల చొప్పున నష్ట పరిహారం ఇస్తామని ప్రకటించారు.

ప్రాణాలు తీస్తున్న లాభాపేక్ష

(మొదటిపేజీ తరువాయి)

బల్క్‌డ్రగ్, కెమికల్ ఫ్యాక్టరీలే అధికంగా ఉన్నాయి. జిల్లాలో 1.25 లక్షల మంది కంపెనీ కార్మికులున్నారు. కంపెనీ ఖర్చులు తగ్గించుకుని లాభాలు పెంచుకునేందుకు.. వలస కార్మికుల శ్రమను దోచుకుంటున్న యాజమాన్యాలు.. నైపుణ్యంలేని, అనుభవంలేని సెమీ స్కిల్డ్ వర్కర్లను పెట్టుకుని పర్మినెంట్ నేచర్ ఆఫ్ వర్కులోనూ కాంట్రాక్టు కార్మికులతో పనిచేయిస్తున్నారు.

మొక్కుబడి తనిఖీలు.. భద్రతా వారోత్సవాలు

ఫ్యాక్టరీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. దాంతో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో మార్చి 4 నుంచి 10 వరకు పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా భద్రతా వారోత్సవాలు జరిపారు. వారోత్సవాలు జరుగుతుండగానే హత్నూర మండలంలోని కోవెలెంట్ ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలి నలుగురు కార్మికులు చనిపోయారు. వారోత్సవాలు ముగిసిన వెంటనే ఇదే ప్రాంతంలోని ఎస్‌బీ ఆర్గానిక్ కెమికల్ ఫ్యాక్టర్‌లో బాయిలర్, రియాక్టర్ పేలి ఆరుగురు మరణించారు. అంటే ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు మొక్కుబడి తనిఖీలు చేస్తూ నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ ఇచ్చేస్తున్నారు. అన్ని పరిశ్రమల్లో నిరంతర తనిఖీలు చేయడంతో ప్రమాదాల నివారణ కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారో కూడా పరిశీలించాలి. సేఫ్టీ మెజర్‌మెంట్స్ ఉండకపోతే కఠిన చర్యలు తీసుకోవాలి. బాయిలర్, రియాక్టర్స్ కాలం చెల్లినవి వాడకూడదు. కానీ.. అన్ని ఫ్యాక్టరీల్లో కాలం చెల్లిన రియాక్టర్లనే ఉపయోగిస్తున్నారు. ఆ ప్రాంతంలో నైపుణ్యం కల్గిన అంటే బీఎస్సీ, ఎంఎస్సీ చదవిన వాళ్లతోనే పని చేయించాలి. కానీ..! తక్కువ వేతనాలతో నైపుణ్యంలేని సెమీ స్కిల్డ్ వలస కార్మికుల్ని పెట్టి పని చేయిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. రామచంద్రాపురంలో కర్మాగారాల తనిఖీ అధికారి కార్యాలయం ఉన్నదన్న విషయం ఎవరికీ తెల్వదు. యాజమాన్యాలిచ్చే మాముళ్లతో అంతా బాగున్నట్టు సర్టిఫై చేయడం షరా మామూలుగా మారిపోయింది.



ఫలితంగా జరిగే ప్రమాదాలతో కార్మికుల ప్రాణాలు పోతున్నాయి.

సేఫ్టీ మెజర్‌మెంట్స్ శూన్యం

ఏదైనా కర్మాగారంలో ప్రమాదాలు సంభవించకుండా చూసుకోవాలి. అనివార్యంగా ప్రమాదం పొంచి ఉంటే వాటిని నివారించేందుకు అవసరమైన సేఫ్టీ మెజర్‌మెంట్స్ కూడా ఉండాలి. బాయిలర్స్, రియాక్టర్స్‌లో పొగలు, ఆవిరి, మంటలు రావడాన్ని గమనించిన వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలి. నైపుణ్యం కలిగిన వాళ్లతో ప్రమాదాల నివారణకు పూనుకునేందుకు వీలుగా అవసరమైన సేఫ్టీ మెజర్‌మెంట్స్ ఉండాలి. ఫార్మా బల్క్‌డ్రగ్, కెమికల్ ఫ్యాక్టరీల్లో ఇవేవీ లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. పాత కాలం నాటి బాయిలర్స్‌ను ఉపయోగించడం వల్లనే ఎస్‌బీ ఆర్గానిక్‌లో మంటలొచ్చి రియాక్టర్‌పై పడి పేలుళ్ల సంభవించాయి. రియాక్టర్‌లో పొగ వస్తుండటంతో చూసి డైరెక్టర్ రవిశర్మ అక్కడికి వెళ్లారు. అంతలోనే రియాక్టర్ పేలి తునకాతునకల య్యారు. రియాక్టర్‌లో మంటలు రాగానే నీళ్ల చల్లడం వల్ల అది మరింత శక్తివంతంగా పేలినట్టు కార్మికులు చెబుతున్నారు. దీన్ని బట్టి కనీస నైపుణ్యంలేని వాళ్ల రియాక్టర్ ప్రాంతంలో పనిచేస్తున్నారన్న విషయం అర్థమవుతోంది. రియాక్టర్ల కాలం తీరగానే వాటిని తీసేసి కొత్తవి పెట్టాల్సిన యాజమాన్యాలు.. ఖర్చుల పేరిట పాత వాటితోనే నెట్టుకొస్తున్నారు. దాంతో 20 రోజుల వ్యవధిలోనే జిల్లాలో మూడు ప్రమాదాలు జరిగి 11 మంది చనిపోగా 50 మంది క్షతగాత్రులయ్యారు. కోవలెంట్‌లో రియాక్టర్ పేలి 4మంది కార్మికులు చనిపోయారు. పాశమైలారంలోని సీఎంహెచ్‌లో ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందగా 18 మంది గాయపడ్డారు. ఎస్‌బీ ఆర్గానిక్‌లో రియాక్టర్ పేలి 6మంది మరణించగా 30 మంది క్షతగాత్రులయ్యారు.

నైపుణ్యంలేని వలస కార్మికులతో పని

ఫార్మా కెమికల్, బల్క్‌డ్రగ్స్ వంటి ఫ్యాక్టరీస్‌లో నైపుణ్యం కల్గిన వాళ్లే పనిచేయాలి. ఎంఎస్సీ, బీఎస్సీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ వంటి చదువులు చదివిన అనుభవమున్న వాళ్లు కాకుండా.. రసాయనాలు, ఫ్యాక్టరీ నిర్వహణ పట్ల కనీస అవగాహన లేని వలస కార్మికులతో పనిచేయిస్తున్నారు. నైపుణ్యం, అనుభవరాహిత్యంతో కూడిన వాళ్లను కాంట్రాక్టు ఏజెన్సీల ద్వారా తీసుకుంటున్నారు. యూపీ, ఎంపీ, తమిళనాడు, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, బెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలుండవు. ప్రమాదాలు జరిగి ప్రాణం పోయినా, క్షతగాత్రులైనా ఎవరూ పట్టించుకునే వారుండకపోవడంతో కంపెనీలు వాళ్లను బలిపశువుల్ని చేస్తున్నాయి.

ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం

ఫ్యాక్టరీస్ చట్టాలు అనేకమున్నాయి. కర్మాగారాల్ని తనిఖీ చేసే ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు, పొల్యూషన్ కంట్రోల్ మండలి ఇంజనీర్లు, లేబర్ కమిషనర్లు, పరిశ్రమల శాఖ అధికారులు, అగ్నిమాపక శాఖ, క్వాలిటీ కంట్రోల్ టీమ్స్‌తో పాటు వీటిని సమన్వయం చేయాల్సిన జిల్లా కలెక్టర్ సమన్వయంతో పనిచేయకపోవడంతో ఫ్యాక్టరీస్ యాజమానులది ఇష్టారాజ్యంగా మారింది. సమన్వయంతో ఫ్యాక్టరీలను నిరంతరం తనఖీ చేసి అన్నీ సక్రమంగా ఉండేలా చూస్తే ప్రమాదాలుండవు. ఫ్యాక్టరీస్ యజమానులకు రాజకీయ నాయకుల అండదండ లుండటంతో అధికార యంత్రాంగం కూడా అనుకూలంగా వ్యవహరిస్తుంది.



రాజ్యసభ సభ్యునిగా..
వద్దిరాజు ప్రమాణస్వీకారం

నవతెలంగాణ-ఖమ్మం

రాజ్యసభ సభ్యులుగా రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర ప్రమాణస్వీకారం చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం ఉదయం ఆయన చేత ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా చైర్మెన్‌తో పాటు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి పీయూష్ గోయల్, రాజ్యసభ సభ్యులు పలువురు రవిచంద్రకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

కొండంత నష్టం... గోరంత పరిహారం

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడుతోంది. 2015-16 నుంచి 2019-20 వరకు రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ప్రకృతి వైపరీత్యాల కమిషన్ నివేదిక ప్రకారం ఐదేండ్లలో రూ.14.812 కోట్ల పంట నష్టం జరగ్గా, కేంద్రం రూ.2,306 కోట్లు మాత్రమే పరిహారంగా ఇచ్చింది. 2018 నుంచి 2023-24 వరకు

వరదలు, వడగండ్ల వానల వల్ల రూ. 12,700 కోట్ల పంట నష్టం జరగ్గా, రూ. 1,787 కోట్ల నామ మాత్రం సాయం అందించింది. డిసెంబర్ 2023 వరకు వరదల వల్ల 1,21,353 మంది రైతులకు చెందిన 60.99 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మొత్తంగా చూస్తే గడిచిన పదేండ్ల కాలంలో మొదటి ఐదేండ్లు కరువు తాండవించగా, తర్వాత ఐదేండ్లు వరదలు, వడగండ్ల వానలు ప్రతాపాన్ని చూపించాయి. అతివృష్టి, అనావృష్టితో రాష్ట్రం 2015-16 నుంచి 2023-24 వరకు రూ. 27,512 కోట్ల పంటలు నష్టపోగా, బీజేపీ ప్రభుత్వం మాత్రం రూ.4,093 కోట్ల గోరంత పరిహారాన్ని అందించింది. తెలంగాణ ఏర్పడి పదేండ్లు గడుస్తున్నప్పటికీ విభజన హామీలు పూర్తిగా అమలు కాలేదు. రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటాలు, ప్రాజెక్టులకు జాతీయ హోదా, వివిధ పథకాల కేటాయింపులతో పాటు కరువు సాయం అందించండలోనూ అడుగడుగునా వివక్షను ప్రదర్శించింది. కమలం పార్టీ రాష్ట్రం పట్ల అనుసరిస్తున్న పక్షపాత వైఖరి, వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టడంలో రెండు పార్టీలూ విఫలమయ్యాయి. పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న ప్రస్తుత కీలక తరుణంలో బీజేపీని అడ్డుకోవడాన్ని పక్కన పెట్టి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడానికే పరిమితమవుతున్నారు. బీజేపీ బలపడితే రాష్ట్రానికి ప్రమాదకరమని ప్రజాస్వామిక వాదులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏనుగు దాడిలో మరో రైతు మృతి

- లభించని గజరాజు ఆచూకీ.. ఆందోళనలో పరిసర గ్రామాలు
- నాలుగు మండలాల్లో 144 సెక్షన్
- గాలింపు చర్యలు చేపట్టిన అటవీశాఖ అధికారులు
- ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యం
- గస్తీ ముమ్మరం : కాళేశ్వరం జోన్ సీఎఫ్ శాంతారామ్

నవతెలంగాణ - పెంచికల్‌పేట్



ఏనుగు దాడిలో మరో రైతు మృతిచెందిన ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం కొండపెల్లి గ్రామంలో గురువారం ఉదయం జరిగింది. చింతల మానెపెల్లి మండలంలో బుధవారం ఏనుగు దాడిలో రైతు మరణించి 24 గంటలు గడవకముందే మండలంలోని కొండపెల్లి గ్రామానికి చెందిన మరో రైతు ఏనుగు దాడిలో మృతి చెందడం కలకలం రేపుతోంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కారు పోచయ్య(65) గ్రామ సమీపంలో తన పొలం వద్దకు మోటారు వేయడానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పొలాలకు దగ్గర రోడ్డుపక్కన ఉన్న ఏనుగు ఒక్కసారిగా ఆయనపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖకు సమాచారం అందించగా.. వారు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏనుగు జాడ కోసం అటవీ శాఖ అధికారులు గాలిస్తున్నారు. ఏనుగు కాలి ముద్రల ఆధారంగా ఏ వైపునకు వెళ్లిందో తెలుసు కోవడానికి గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, అదనపు కలెక్టర్ వేణు, రేంజ్ అధికారి సుధాకర్ చేరుకొని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారితో మాట్లాడారు. మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఐదెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాల్సిందిగా గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేశారు. అధికారులు రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని గ్రామస్తులు పట్టుబట్టారు. బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా కొంత నగదును అధికారులు అందజేశారు. మృతునికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో అటవీ పరిసర గ్రామాల్లోని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పెంచికల్ పేట్, బెజ్జూరు ప్రధాన రహదారి గుండా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కొండపెల్లి మాజీ సర్పంచ్ సుధాకర్ ఏనుగును చూడడం..అది ఆయన వెంట పడటంతో గ్రామంలోకి పరుగులు తీశారు. ఏనుగును పరిసరాల నుండి వెళ్లేలా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. బాధిత కుటుంబాన్ని బీజేపీ నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు పరామర్శించారు. సంఘటనా స్థలానికి కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ కొమురయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు వెళ్లి పరిశీలించారు.

ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యం : కాళేశ్వరం జోన్ సీఎఫ్ శాంతారామ్

బెజ్జూర్ :కుమురం భీం జిల్లాలో ఇద్దరు రైతులపై ఏనుగు దాడి చేసి చంపడం దురదృష్టకరమని కాళేశ్వరం జోన్ సీఎఫ్ శాంతారామ్ అన్నారు. గురువారం బెజ్జూరు మండల కేంద్రంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పెంచికల్‌పేట, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏనుగు దాడిలో మరణించిన ఒక్కో రైతుకు ప్రభుత్వం రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తోందన్నారు. అటవీ ప్రాంత గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఏనుగు కోసం ప్రత్యేకంగా 40 మానిటరింగ్ టీమ్‌లు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. మగ ఏనుగు ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్ర మీదుగా తెలంగాణకు వచ్చినట్టు వెల్లడించారు. ఈ ఏనుగు ప్రతిరోజు సాయంత్రం వేళల్లో 20 నుంచి 30 కిలో మీట.ర్లు ప్రయాణిస్తుందన్నారు. ప్రజల ప్రాణాలే తమకు ముఖ్యమని ఇండ్ల నుండి బయటకు వెళ్లొద్దని సూచించారు. ఏనుగు కోసం డ్రోన్ కెమెరాలు, థర్మల్ డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో ఏనుగులకు ఆహారం దొరకక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో నీటి సౌకర్యం ఉండడం వల్ల ఈ ప్రాంతానికి ఏనుగు వచ్చినట్టు తెలిపారు. ఛత్తీస్‌గడ్‌లో 100 ఏనుగులు, మహారాష్ట్రలోని గఢ్చిరోలిలో 25 ఏనుగులు ఉన్నాయని వివరించారు. తెలంగాణలో మొదటిసారి ఏనుగులు వచ్చి హల్‌చల్ చేస్తున్నట్టు తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో డప్పు చాటింపు చేపట్టినట్టు తెలిపారు. సమావేశంలో ఆసిఫాబాద్ డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రీవాల్, బెజ్జూర్ రేంజ్ అధికారి దయాకర్, డిప్యూటీ రేంజర్ శ్రావణ్ కుమార్ సిబ్బంది ఉన్నారు.



అల్లంతో ఇలా చేస్తే..

మనం ఎటువంటి అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించాలంటే రోగ నిరోధక వ్యవస్థ పని తీరు బాగుండాలి. ఈ వ్యవస్థ పనితీరు సరిగ్గా లేకపోతే బ్యాక్టీరియా, వైరస్, పారసైట్స్ వంటివి మన శరీరానికి హాని చేస్తాయి. ఎప్పుడైతే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్ వంటివి మన శరీరంలోకి ప్రవేశిస్తాయో మన రోగనిరోధక వ్యవస్థ వాటిపై దాడి చేస్తుంది. ఇటువంటి హానికరమైన వాటి నుంచి రక్షించడమే కాదు.. శరీరంలో ఉండే మృతకణాలను తొలగించడానికి కూడా ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుంది.

ప్రతి ఇంట్లో తయారుచేసే వంటకాల్లో రుచి కోసం అల్లం వాడతారు. నిజానికి అల్లం ఓ దివ్య ఔషధం. ఖరీదైన మందులు కొనుక్కొని ఉపయోగించినా అల్లం చేసే మేలు చేయలేవు. కనుక ప్రతి ఒక్కరూ ప్రతిరోజు క్రమం తప్పకుండా అల్లాన్ని ఆహారంలో ఉపయోగించండి.

మసాలా దినుసులను వాడే వంటకాల్లో అల్లంను తప్పకుండా ఉపయోగిస్తుంటాం. . మసాలా దినుసుల వల్ల మనకు ఏదైతే ప్రయోజనం ఉంటుందో, అదేవిధంగా అల్లంతోనూ చాలా ప్రయోజనాలుంటాయి. అలాగే విటమిన్ సి ఉండే పండ్లు, క్యాప్సికం, బ్రోకలి, అల్లం, వెల్లుల్లి, పాలకూర, బాదం, పసుపు, గ్రీన్ టీ, బొప్పాయి, కివి వంటివి రోగనిరోధక వ్యవస్థకు చాలా అవసరం.

ఇటువంటి ఆహార పదార్థాలను మీ రోజువారి ఆహారంలో భాగంగా తీసుకుంటే మీ రోగ నిరోధక వ్యవస్థ బలపడుతుంది. వీటి వల్ల జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారు. ఇలాంటి ఆహార పదార్థాల్లో అల్లం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందనే చెప్పాలి.

అల్లంలో మినరల్స్, ఎమినో ఆసిడ్స్, ఎంజైమ్స్, కో- ఎంజైమ్స్ కూడా ఉన్నాయి. వీటన్నిటి వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. గొంతు నొప్పి వంటి సమస్యలు తొలగిపోతాయి. దాంతో పాటు తల నొప్పి సమస్య కూడా తగ్గుతుంది. శరీరంలో ఉండేటువంటి అదనపు లాక్టిక్ యాసిడ్‌ను మజిల్ టిష్యూ నుండి బయటకు పంపిస్తుంది.

వికారం వల్ల ఉదయాన్నే చాలా ఇబ్బంది పడుతూ ఉంటారు. అలాంటప్పుడు జింజర్ షాట్స్ లేదా అల్లంను ఉదయాన్నే తీసుకోండి. ఈ సమస్య చాలా త్వరగా తొలగిపోతుంది. వీటన్నిటితో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ పారాసైటిక్ గాను, బీ12 ఉత్పత్తి అవడానికి, హైపర్ రియాక్టివిటీని తగ్గించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఈ విధంగా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

అల్లం యాంటీ బ్యాక్టీరియల్ యాంటీ పారాసైటిక్ మాత్రమే కాదు ఒత్తిడిని దూరం చేయడానికి ఎంతో సహాయం చేస్తుంది. స్టమక్ అప్సెట్ ఉన్నవారు కూడా అల్లం తప్పకుండా తీసుకోండి.



పాలు త్రాగటం ఆరోగ్యకరమైన అలవాటే కానీ, కచ్చితంగా పాలు తాగాలని ఏమీ లేదు. ఎందుకంటే తెల్ల నువ్వుల్లోనూ పాలలోకన్నా ఎక్కువ కాల్షియం దొరుకుతుంది. కాబట్టి పాల మీద మనకున్న అవగాహనలో మార్పు రావాలి.

బాలీవుడ్‌లో అగ్రహీరోయిన్ మాత్రమే కాదు ఎప్పుడూ బిజీగా ఉంటుంది ప్రియాంక చోప్రా. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన దుస్తులు, నగలు, కార్లు వాడే నటిగా కూడా ఆమెకు పేరుంది. విలాసవంతమైన స్టార్ హొటళ్లు, ప్రైవేట్ ఐలాండ్ బీచ్‌లు, రిసార్టుల్లో సేదతీరుతుంది. నిత్యం ఫ్యాషన్‌వీక్‌లలో మెరుస్తుంది. బాలివుడ్ సినిమాల్లో ఎంత బిజీగా ఉంటుందో... వరల్డ్ వెబ్‌సిరిస్‌లోనూ అంతే బిజీగా నటిస్తుంటుంది. ఆమె ఏం చేసినా డబ్బు అలా కురుస్తుంది. ఆస్తులకు కొదవలేదు. అయినా సరే విచ్చలవిడిగా ఖర్చు పెట్టదు. లెక్కాపత్రం లేకుండా చిన్న నిర్ణయం కూడా తీసుకోదు. అయితే ఆమె పాటిస్తున్న పొదుపు ప్రణాళిక ఇప్పటిది కాదు. 'చిన్నతనంలో మా అమ్మ నేర్పితే వచ్చింది ఈ మనీ ప్లానింగ్' అంటూ ఆమె చెబుతున్న పొదుపు సూత్రాలేంటో మనమూ తెలుసుకుందామా...

అమ్మ నేర్పిన పొదుపు



జీవితంలో తొలి పొదుపు నేర్పింది అమ్మనే. ముఖ్యంగా మహిళలు ఇతరులపై ఆధారపడకుండా ఆర్థిక స్వేచ్ఛను సంపాదించుకోవాలి. తమకంటూ సొంత ఆదాయం, సంపాదన తప్పనిసరి. అప్పుడే ఆత్మవిశ్వాసం వస్తుంది. బతికే ధైర్యం కూడా అలవడుతుంది. జీవితం ఎటు వెళుతుంది? ఎవర్ని పెండ్లి చేసుకుంటాం? అనే ఆలోచనలే అనవసరం. ఆర్థిక స్వాతంత్ర్యంతో జీవిస్తున్నామా? లేదా? అనేదే ప్రధానం. ఈ ధైర్యం వచ్చినప్పుడు మిగిలిన సమస్యలు ఎన్ని వచ్చినా అధిగమించడం చాలా సులభం. నేను ఈ విషయాలన్నీ అమ్మ నుండే నేర్చుకున్నాను.

పొదుపు ఒక్కటే పరిష్కారం

సంపాదించిన సొమ్ములో ముందు కొంత పొదుపు చేయాలి. ఆ తరువాతే మిగిలిన మొత్తాన్ని ఖర్చు పెట్టుకోవచ్చు. నేను చిన్నప్పుడు పాకెట్‌మనీ తీసుకునే సమయంలోనే పొదుపును అలవాటు చేసుకున్నాను. అయితే నేనేమీ పిసినారిని కాదు. ఇప్పుడున్న దానికంటే రేపు ఇంకా బాగా ఆనందించాలంటే పొదుపు ఒక్కటే పరిష్కారం మార్గం. చీమలు తమ తిండిని కొద్దికొద్దిగా దాచుకుని ఆహార కొరత ఉన్నప్పుడు హాయిగా తింటాయి. చీమల ముందుచూపు నన్ను ఎంతగానో ఆలోచింపజేసింది. అందుకే ముందుగా చిన్న చిన్న ఆర్థిక లక్ష్యాలను ఏర్పరచుకుని డబ్బును మదుపు చేయాలి. మనకు వచ్చిన ఆదాయంలో ఎంత ఖర్చు పెడతామో అంత మొత్తాన్ని పొదుపు చేయాలన్న నిబంధన పెట్టుకోవాలి.

ముందే ఆలోచించుకోవాలి

ఎన్ని ఇబ్బందులు వచ్చినా అర్థాంతరంగా పొదుపును ఆపకూడదు. రేపటిని దృష్టిలో పెట్టుకుని చేసే పెట్టుబడులను కూడా కొనసాగించాలి. ఆలోచించకుండా ప్రారంభించడం, హఠాత్తుగా ఆపేయడం రెండూ నష్టమే. ఆఖరి వరకు కొనసాగించగలమా? లేదా? అని ఆలోచించుకుని పెట్టుబడులు పెట్టాలి. అప్పుడే దీర్ఘకాలిక లాభాలు వస్తాయి. మధ్యలో కొన్ని కుదుపులు వచ్చినా భయపడకూడదు. ఒక్కోసారి పెట్టుబడుల అనుభవం కూడా లాభదాయకమే.

నిపుణుల సలహాతో...

నా పెట్టుబడులు, ఆర్థిక నిర్వహణ కోసం మంచి నిపుణుల బృందాన్ని నియమించుకున్నాను. అమెరికా, ఇండియాలలో వారు నిత్యం పని చేస్తుంటారు. పర్యవేక్షణ బాధతను కొందరు మేనేజర్లకు వదిలేస్తాను. రెండు దేశాల్లోని టీమ్‌లకు మా అమ్మ అధిపతి. నేను ఎప్పుడో తప్పిస్తే జోక్యం చేసుకోను. మీరు కూడా మీ వ్యక్తిగత పొదుపు ప్రణాళికల కోసం అర్హతలున్న ఒక ఆర్థిక నిపుణుల సహకారం తీసుకోండి. ఆ ప్రకారం ముందుకు వెళ్లండి.



డైరీ రాసుకుంటే...

కెరీర్ మొదట్లో నేనూ, అమ్మ కలిసి చిన్న డైరీ రాసేవాళ్లం. సినిమాలున్నప్పుడు ఏడాదిలో ఆర్నెల్లు బాగా డబ్బు వచ్చేది. మిగిలిన నెలలు వచ్చేవి కావు. అందుకని ఏడాది మొత్తం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకునేందుకు డైరీ రాసుకునే అలవాటు మాకెంతో ఉపకరించేది. కొన్ని సార్లు ఆర్థిక విషయాలను గుర్తుపెట్టుకోవడం కష్టం అవుతుంది. మనకు వచ్చేది ఎంత? ఇతరులకు చెల్లించేది ఎంత? మిగిలేది ఎంత? ఇవన్నీ రాసుకోవడం, ప్లాన్ చేసుకోవడం డైరీ వల్లనే అలవాటయింది. ఎంత సంపద ఉన్నప్పటికీ ప్రణాళిక ప్రకారమే నడుచుకోవాలి. దాన్నొక అలవాటుగా మార్చుకోవాలి. లేకపోతే చిక్కుల్లో పడతాం. అందరూ ఒక్క విషయం గుర్తు పెట్టుకోవాలి. ఆశపడితే డబ్బు రాదు. పనిని ప్రేమిస్తే వస్తుంది. అలా వచ్చిన డబ్బుతో మన ఆశలను నెరవేర్చుకోవచ్చు.



తెలంగాణ భవన్‌కు వాస్తు మార్పులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయానికి వాస్తు మార్పులు చేస్తున్నారు. పార్టీ అధికారం కోల్పోవడం, నేతలు ఇతర పార్టీల్లోకి జంప్ చేయడం తదితర పార్టీకి వచ్చిన కష్టాలకు అంతా వాస్తు దోషమే కారణమని భావించిన నేతలు మార్పులు, చేర్పులు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. అయితే ట్రాఫిక్ సమస్య కారణంగా మార్పులు ...చేర్పులు చేపట్టిన తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి.

ప్రస్తుతం కార్యాలయంలోకి వెళ్లే గేటు. తెలంగాణ భవన్ తూర్పు అభిముఖంగా ఉండగా.. వాయువ్య దిశలో ఉన్న గేటు నుంచి రాకపోకలు సాగుతున్నాయి. అలా రావడం మంచిది కాదనీ, ఈశాన్యం వైపు ఉన్న గేటును ఇక నుంచి రాకపోకలకు వినియోగించాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ఈశాన్యం వైపు ఉన్న గేటును సిద్ధం చేస్తున్నారు. వాహనాల రాకపోకలు సాగించేందుకు వీలుగా ర్యాంపును నిర్మిస్తున్నారు. వీధి పోటును దృష్టిలో ఉంచుకుని లక్ష్మీనరసింహస్వామి చిత్రంతో కూడిన ఫ్లెక్సీని కూడా గేటుకు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్యల కారణంగానే మార్పులు చేర్పులు చేస్తున్నట్టు చెబుతున్న పార్టీ వర్గాలు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 వైపు వెళ్లే ప్రధాన రహదారి వెంట వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయని ఉటంకిస్తున్నాయి. దీంతో తెలంగాణ భవన్‌లోకి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది ఎదురవుతోంది. ఒకటి, రెండు వాహనాలు కూడా వాయువ్యం దిశలో ఉన్న గేటు వద్ద కాసేపు కూడా నిలిపి ఉంచే పరిస్థితి లేదు. దీంతో ఈశాన్యం గేటును రాకపోకలకు ఉపయోగించడం ద్వారా ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చని భావిస్తున్నారు. వీటితో పాటు ప్రాంగణం లోపల కూడా అవసరమైన మేరకు స్వల్ప మార్పులు.. చేర్పులు చేస్తున్నారు.

దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వమే ఉందని, కరువుకు వాళ్లే బాధ్యత వహించాలని తెలిపారు. మూడు నెలల తర్వాత మాజీ సీఎం కేసీఆర్ బయటకు వచ్చి లేనిపోని ఆరోపణలు చేయడం దారుణమని విమర్శించారు. విద్యుత్ వ్యవస్థను నాశనం చేసిందే గత పాలకులు అని, వాటిని బాగు చేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో 'గుమ్మడి కాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకోవడం ఎందుకు' అని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యనించారు. కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్‌తో తనకు సంబంధం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు రక్షణ కల్పించాల్సింది పోయి.. వారి హక్కులను హరించే విధంగా వ్యవహరించిందని అన్నారు. మంత్రులు మాట్లాడుతూ 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తుక్కుగూడలో నిర్వహించిన సభలో సోనియాగాంధీ మ్యానిఫెస్టో విడుదల చేసినట్టు గుర్తు చేశారు. దాన్ని ఆశీర్వదించి ప్రజలు తమను గెలిపించారని అన్నారు. మరోసారి ఇక్కడే మ్యానిఫెస్టో విడుదల చేస్తున్నామని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. ప్రజా పాలనలో అన్నివర్గాలకు మేలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం తుక్కుగూడ జనజాతర బహిరంగ సభ ఏర్పాట్ల స్థలంలో సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే ఎంపీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 14 మంది ఎంపీ అభ్యర్థులు పాల్గొన్నారు. సీఎం వెంట.. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు కొండా సురేఖ, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, తదితరులు ఉన్నారు. ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి కాంగ్రెస్ తడాఖా చూపించాలని భట్టి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు చల్లా నరసింహా రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్, నాయకులు దేపా భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం పదవి నుంచి 'కేజ్రీ'ని తొలగించలేం

న్యూఢిల్లీ: ప్రస్తుతం జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను పదవి నుండి తొలగించాల్సిందిగా దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు గురువారం తోసిపుచ్చింది. మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న విషయం తెలిసిందే. ఆయనను పదవి నుండి తొలగించాల్సిందిగా గతంలోనే ఓ పిటిషన్ దాఖలైంది. దానిని హైకోర్టు తోసిపుచ్చింది. తాజాగా మరో పిటిషన్ దాఖలు కాగా దానిని కూడా తిరస్కరించింది. పదవిలో కొనసాగాలా వద్దా అనే దానిపై నిర్ణయం తీసుకోవాల్సింది కేజ్రీవాలేనని హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది.

'కొన్ని సందర్భాలలో వ్యక్తిగత ప్రయోజనాలు దేశ ప్రయోజనాలకు సహాయకారిగా ఉండాల్సి ఉంటుంది. కానీ అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం. పదవిలో ఉండాలా వద్దా అనేది ఆయన నిర్ణయమే. మనకు ఓ న్యాయస్థానం ఉంది. న్యాయస్థానం రాష్ట్రపతి పాలన లేదా గవర్నర్ పాలన విధించిన సంప్రదాయం ఏదైనా ఉన్నదా?' అని తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. కేజ్రీవాల్‌ను పదవి నుండి తొలగించాలంటూ సామాజిక కార్యకర్త, హిందూసేన జాతీయ అధ్యక్షుడు విష్ణు గుప్తా ఈ పిటిషన్ దాఖలు చేశారు. కొద్దిసేపు వాదనలు కొనసాగిన తర్వాత ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఉపసంహరిం చుకుంటు న్నామని గుప్తా న్యాయవాది కోర్టుకు తెలిపారు. లెఫ్టినెంట్ గవర్నరును ఆశ్రయిస్తామని చెప్పారు.

గత నెల 21న కేజ్రీవాల్ అరెస్ట్ తర్వాత దేశ రాజధానిలో ప్రభుత్వమన్నదే లేకుండా పోయిందని గుప్తా న్యాయవాది అంతకుముందు కోర్టు దృష్టికి తెచ్చారు. కేజ్రీవాల్ అరెస్ట్ అనంతరం రాజ్యాంగ ప్రతిష్టంభన ఏర్పడిందని చెప్పారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ ఎక్కడైనా పరిష్కారం లభిస్తుందని, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వారిని ఆశ్రయించవచ్చునని సూచించింది. ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది లెఫ్టినెంట్ గవర్నర్ లేదా రాష్ట్రపతి మాత్రమేనని తెలిపింది. 'ప్రభుత్వం పనిచేయడం లేదని మేము ఎలా ప్రకటిస్తాం? దానిని నిర్ణయించే అధికారం పూర్తిగా లెఫ్టినెంట్ గవర్నరుదే. మా మార్గదర్శనం ఆయనకు అవసరం లేదు. చట్టప్రకారం ఏం చేయాలనుకుంటే ఆయన అది చేయవచ్చు' అని తెలియజేసింది.

తొలిసారి పెద్దల సభకు..



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం నాడిక్కడ ఆమెతో పాటు మరో 14 మందితో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ ప్రమాణ స్వీకారం చేయించారు. సోనియా గాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా ఉన్నారు. ఆయన ఒరిస్సా నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అజయ్ మాకెన్ (కర్నాటక), సయ్యద్ నసీర్ హుస్సేన్ (కర్నాటక), ఆర్ఎన్ పి సింగ్ (ఉత్తరప్రదేశ్), సమిక్ భట్టాచార్య (పశ్చిమ బెంగాల్), సంజయ్ కుమార్ ఝా (బీహార్), సుభాశిష్ ఖుంటియా (ఒరిస్సా), దేబాశిష్ సామంతరాయ్ (ఒరిస్సా), మదన్ రాథోడ్ (రాజస్థాన్) తదితరులు ఉన్నారు.

ముగ్గురు వైసీపీ, ఒక బీఆర్ఎస్ ఎంపీ ప్రమాణ స్వీకారం

ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ముగ్గురు వైసీపీ ఎంపీలు వైవి సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే తెలంగాణకు చెందిన ఒక బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలుగులో ప్రమాణం చేశారు.

మోడీని తిరస్కరించండి

(మొదటిపేజీ తరువాయి)

మద్దతుగా ఆయన బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమల్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సామాజిక న్యాయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తోందని విమర్శించారు. బీజేపీ కూడా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని, మరోసారి దానికి అధికారం ఇస్తే ప్రజాస్వామిక సూత్రాలను కాలరాస్తుందని హెచ్చరించారు.

దేశంలో ప్రజాస్వామ్యం పెను ప్రమాదంలో పడిందని కమల్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, బీజేపీ కుతంత్రాల నుండి దేశాన్ని రక్షించేందుకు లౌకిక, భావసారూప్యత కలిగిన శక్తులతో చేతులు కలిపానని ఆయన చెప్పారు. రాజకీయాల్లో తన తొలి శత్రువు కులమేనని అంటూ తన జీవితంలోనూ, సినీ జీవితంలోనూ కులానికి చోటులేదని స్పష్టం చేశారు. గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. వారిపై నీటి ఫిరంగులు ప్రయోగించిందని, అత్యంత దురుసుగా ప్రవర్తించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని గుర్తు చేశారు. తమిళ మత్స్యకారులకు రక్షణ కల్పించడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలమైందని కమల్ విమర్శించారు. రైతులు, యువకులు, మహిళలు సహా అన్ని వర్గాలనూ విస్మరించిందని అన్నారు. మైనారిటీలను పరాయివారిగా చూస్తోందని, దీంతో వారు భయంతో కాలం గడుపుతున్నారని చెప్పారు. దేశాన్ని పాలించేందుకు వారికి మరో అవకాశం ఇవ్వరాదని కమల్ అన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవితే సూత్రధారి

- బెయిల్ పిటిషన్ పై విచారణ ముగించిన స్పెషల్ కోర్టు
- 8న తీర్పు వెల్లడించనున్న స్పెషల్ జడ్జి కావేరి బవేజా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితే సూత్రధారి అని, అందుకే ఆమె బెయిల్ అప్లికేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని ఈడీ తరపు న్యాయవాది జోహెబ్ హుస్సేన్ కోర్టుకు తెలిపారు. అవినీతి కార్యకలాపాల్లో ఉన్న మహిళకు బెయిల్ ఇవ్వకూడదని వాదించారు. అయితే కొడుకు పరీక్షల నేపథ్యంలో కవితకు బెయిల్ ఇవ్వాలని ఆమె తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. ఈ పిటిషన్‌పై ఇరువైపు వాదనలు విన్న స్పెషల్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా తీర్పును రిజర్వ్ చేశారు. ఈనెల 8న ఉదయం తీర్పు వెలువరించనున్నారు. లిక్కర్ స్కాంలో అరెస్టై... తీహార్ జైల్‌లో జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న కవిత తన చిన్న కొడుకు పరీక్షల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ట్రయల్ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం స్పెషల్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా విచారణ జరిపారు. కవిత తరపున సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీ, ఈడీ తరపున జోహెబ్ హుస్సేన్ వాదనలు వినిపించారు. బెయిల్ పిటిషన్‌పై ఈడీ దాఖలు చేసిన కౌంటర్‌కు రిజాయిండర్ ఫైల్ చేసినట్లు సింఘ్వీ కోర్టుకు తెలిపారు. పీఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం మహిళగా, అలాగే కొడుకు పరీక్షల నేపథ్యంలో కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. కవిత అరెస్ట్‌తో ఆమె కుమారుడు మానసికంగా కుంగిపోయాడని, ఈ ప్రభావంతో పరీక్షలకు గైర్హాజరయ్యే అవకాశం ఉందని అన్నారు. పిల్లల పరీక్షల సందర్భంలో తల్లి మద్దతు పిల్లలకు అవసరమన్నారు. తండ్రి, తల్లి పాత్రను భర్తీ చేయలేరని, ఇదే అంశంపై ప్రధాని మోడీ పరీక్షా పే చర్చ నిర్వహిస్తున్నారని కోర్టుకు వివరించారు. ఇలాంటి సందర్భంలో గతంలో పలు కేసుల్లో మహిళలకు న్యాయస్థానాలు బెయిల్ మంజూరు చేసిన కేసుల వివరాలు తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రీతి చంద్రా, సౌమ్య చౌరసియా కేసులను సింఘ్వీ ఉదాహరించారు. కవితకు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చినా... తమకు అభ్యంతరం లేదన్నారు. 'తల్లి తో ఉన్న ఆత్మీయత, అనుబంధాన్ని ఎవరూ తీర్చలేరు. మన కుటుంబాలకు ఓ విధానం ఉంది. దీంట్లో తల్లి పాత్ర కీలకం. కొడుకు హైదరాబాద్‌లో ఉన్నాడు. తల్లి జైల్లో ఉంది. తండ్రి కోర్టు కేసుల కోసం ఢిల్లీలో ఉన్నారు' అని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

ఆమె ఆధారాలు, సాక్ష్యాలను ప్రభావితం చేస్తారు: ఈడీ

లిక్కర్ కేసులో కవిత పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ తరపు న్యాయవాది జోహెబ్ హుస్సేన్ కోర్టుకు వివరించారు. దర్యాప్తు కీలక దశలో ఉన్న సమయంలో కవితకు బెయిల్ ఇవ్వడం వల్ల పూర్తి దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందన్నారు. అలాగే ఆమె బెయిల్‌పై బయటకు వస్తే ఆధారాలు, సాక్ష్యాలను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని ఆరోపించారు. కవితకు వ్యతిరేకంగా ఆధారాలు ఉన్నాయని కోర్టుకు నివేదించారు. 'లిక్కర్ కేసు ప్లాన్ చేసింది కవిత. ఆధారాలను ధ్వంసం చేసిన వ్యక్తికి మధ్యంతర బెయిల్ ఇవ్వకూడదు. కవిత మొబైల్ ఫోన్లను మార్చడంతో పాటు ఆధారాలు ధ్వంసం చేశారు.' అని చెప్పారు. ఆమె ఈడీకి సమర్పించిన ఫోన్లలో సమాచారాన్ని డిలీట్ చేశారన్నారు. ఇందులో 9 ఫోన్లను ఫార్మాట్ చేసి, డేటా డిలీట్ చేశారని కోర్టుకు వివరించారు. ఆమె సమర్పించిన మొత్తం 10 ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కి పంపినట్లు తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్ డేటా ప్రకారం 4 ఫోన్లు ఫార్మాట్ చేయబడ్డాయని తెలిపారు. ఈ కేసులో వందల కొద్దీ డిజిటల్ పరికరాల్లో డేటా డిలీట్ చేయబడిందని చెప్పారు. మధ్యలో ఈడీ జాయింట్ డైరెక్టర్ భాను ప్రియా మీనా... కవితకు వ్యతిరేకంగా సేకరించిన సున్నితమైన ఆధారాలను నేరుగా జడ్జి కావేరి బవేజాకు చూపించారు. కవిత తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దంటూ అప్రూవర్ గా మారిన వ్యక్తిని బెదిరించారని ఆరోపించారు. కవితకి లిక్కర్ వ్యాపారంలో 33 శాతం వాటా ఉందని వాదించారు. 'పరీక్షలు రాస్తోన్న కవిత కొడుకుకు... 22 ఏండ్ల సోదరుడు, తండ్రి, కవిత అక్కా చెల్లెళ్లు ఉన్నారు" అని తెలిపారు. భారతీయ కుటుంబాల్లో ఇతర కుటుంబ సభ్యులు కూడా పిల్లలకు మద్దతుగా నిలుస్తారని వాదించారు. ఇప్పటికే కొన్ని పరీక్షలు ముగిసాయని, కవిత కుమారుడికి ఎగ్జామ్ యాంగ్జైటీ ఉందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదన్నారు. 19 ఏండ్ల కవిత పెద్ద కొడుకు స్పెయిన్‌లో ఉన్నాడని, అరెస్టైన తల్లిని చూసి తాను వెళ్ళిపోయాడని తెలిపారు. కవిత తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు, ఐటీఆర్ వివరాలు, కుటుంబ వ్యాపార వివరాలు ఇవ్వడం లేదన్నారు. మహిళ కాబట్టి మధ్యంతర బెయిల్ ఇవ్వమనడం సరికాదన్నారు. మధ్యంతర బెయిల్‌పై వాదనలు ఇవ్వకుండా కేస్ డైరీపై వాదనలు వినిపిస్తున్నారని అభిషేక్ మను సింఘ్వీ అభ్యంతరం తెలిపారు. కాగా, ఇరువైపు వాదనలు ముగించిన స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా తీర్పును రిజర్వ్ చేశారు. ఏప్రిల్ 8 (సోమవారం) ఉదయం 10:30 గంటలకు తీర్పు వెలువరించనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే కవిత రెగ్యులర్ బెయిల్ పిటిషన్ పై ఏప్రిల్ 20న విచారణ చేపడతామని వెల్లడించారు.

నేడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ పొలం బాట

ఎండిన పంటలను పరిశీలించనున్న కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖరరావు పొలంబాట కొనసాగుతున్నది. ఇటీవల నల్లగొండ, సూర్యాపేట, జనగామ జిల్లాల్లో పర్యటించగా శుక్రవారం కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించనున్నారు. నీరులేక ఎండిపోయిన పంటలను పరిశీలించి, నష్టపోయిన రైతులను పరామర్శించనున్నారు. రెండు జిల్లాలకు పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 8.30 గంటలకు ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి బయలుదేరి 10.30 గంటలకు ముక్దంపూర్ చేరుకొని ఎండిపోయిన పంటలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం ఒంటిగంటకు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో మధ్యాహ్నం భోజనం చేస్తారు. 2గంటలకు రాజన్న సిరిసిల్లలోని బోయినపల్లికి చేరుకుంటారు. అక్కడ నీరందక ఎండిపోయిన పంటలను పరిశీలించి, శాభాష్‌పల్లి వద్ద మధ్యమానేరు జలాశయాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 4 గంటలకు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు బయలుదేరి రాత్రి 7 గంటల వరకు ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి చేరుకుంటారు.

నవచిత్రం

తెలుగులోనూ బ్లాక్ బస్టర్ ఖాయం



సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ భాసి ప్రధాన పాత్రలలో చిదంబరం ఎస్ పొదువల్ దర్శకత్వం వహించిన మలయాళ సర్వైవల్ థ్రిల్లర్ 'మంజుమ్మల్ బాయ్స్'. ఈ సినిమా మలయాళ ఇండస్ట్రీ హిట్ అయ్యింది. అంతేకాదు 200 కోట్లకు పైగా గ్రాస్‌తో ఈ సంవత్సరం ఇండియాలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. పరవ ఫిలింస్ పతాకంపై బాబు షాహిర్, సౌబిన్ షాహిర్, షాన్ ఆంటోని నిర్మించిన ఈ చిత్రం తమిళంలో కూడా మంచి విజయం సాధించింది. మైత్రీ మూవీ మేకర్స్ తెలుగు ప్రేక్షకుల కోసం ఈ సర్వైవల్ థ్రిల్లర్‌ను తీసుకువస్తోంది. తెలుగు వెర్షన్‌ను నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పిస్తున్నారు. ఈనెల 6న తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, శశిధర్ రెడ్డి, నవీన్ యెర్నేని, నిరంజన్ రెడ్డితో పాటు చిత్ర యూనిట్ సభ్యులంతా పాల్గొన్న ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది.

నిర్మాత శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, 'మొదటి రోజు ఈ సినిమా చూసిన వెంటనే సినిమాని తెలుగులో విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. రవి, నవీన్ ఈ సినిమాని ఇక్కడ గ్రాండ్‌గా ప్రమోట్ చేయాలని నిర్ణయించారు. ఇది బ్లాక్ బస్టర్ అని ముందే అనుకున్నాం. ఈ సినిమాకి లాంగ్వేజ్ బ్యారియర్ లేదు. ఇది పదిమంది బాల్య స్నేహితులకు సంబంధించిన కథ. ఇలాంటి స్నేహితులు జీవితంలో ఉండాలని ఎవరైనా కోరుకుంటారు. ఈనెల 5న ప్రీమియర్స్ కూడా వేస్తున్నాం. ఓ మలయాళం సినిమాని పెయిడ్ ప్రీమియర్స్‌తో వేయడం ఇదే తొలిసారి. ఇది బిగ్ ఎచీవ్మెంట్. దాదాపు 300 వందల స్క్రీన్స్‌లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం' అని అన్నారు. 'ఈ సినిమాని యుఎస్‌లో చూశాను. ఎక్స్‌ట్రార్డినరీ ఫిలిం. ఈ మధ్య కాలంలో చూసిన బెస్ట్ ఫిలిం. ఈ సినిమా ఇప్పటికే 200 కోట్లకు పైగా కలెక్ట్ చేసి బిగ్ హిట్ అయ్యింది. తెలుగులో కూడా పెద్ద విజయాన్ని సాధిస్తుంది' అని నిర్మాత నవీన్ యెర్నేని చెప్పారు.

7న చెన్నైలో ఉగాది పురస్కారాలు



ఏటా ఉగాది పురస్కారాలు అందిస్తూ చెన్నైలో తెలుగు వారి కీర్తిని చాటుతున్న శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఈ ఏడాది కూడా సిల్వర్ జూబ్లీ ఉగాది పురస్కారాలను అందించబోతోంది. ఈ సంస్థ స్థాపించి పాతికేళ్ల అవుతుంది. ఈ నెల 7వ తేదీన చెన్నైలోని మ్యూజిక్ అకాడెమీలో ఈ ఉగాది పురస్కారాల కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమ వివరాలను కమిటీ సభ్యులు గురువారం మీడియాకి తెలిపారు.

శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు బేతిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, 'చెన్నై మహానగరంలో తెలుగు వారి ఘన కీర్తిని చాటుతూ పాతిక సంవత్సరాలుగా శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఉగాది పురస్కారాలు అందిస్తున్నాం. 1998, నవంబర్ 21వ తేదీన ఈ అవార్డ్స్ ప్రారంభించాం. శ్రీ కళా సుధ తెలుగు అసోసియేషన్ స్థాపించి ఇరవై ఐదేళు పూర్తయింది. ఉగాదికి రెండు రోజుల ముందే ఈ నెల 7వ తేదీన సాయంత్రం 5 గంటల నుంచి చెన్నై మ్యూజిక్ అకాడెమీలో ఈ కార్యక్రమం నిర్వహిస్తాం. ఈ సందర్భంగా సావనీర్ రిలీజ్ చేయబోతున్నాం. ఈ వేడుకలో మహిళా రత్న పురస్కారం, ఒక నటి, దర్శకుడికి బాపు రమణ పేరు మీద బాపుబొమ్మ అవార్డ్ ఇస్తున్నాం. అలాగే నిర్మాత ఆదిత్య రామ్‌కి విశిష్ట ఉగాది పురస్కారం, రవి ప్రసాద్ యూనిట్ అధినేత చంగయ్యకి లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డ్ ఇవ్వబోతున్నాం. జనవరి నుంచి డిసెంబర్ వరకు రిలీజైన తెలుగు సినిమాల్లో మన తెలుగుదనం ఉట్టిపడేలా ఉన్న చిత్రాలకు పురస్కారాలు ఇస్తాం. ఈ కార్యక్రమానికి తెలంగాణ నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు అతిథిగా పాల్గొంటారు. సభాధ్యక్షుడిగా మండలి బుద్ధ ప్రసాద్ గారు వ్యవహరిస్తారు' అని అన్నారు.

'ఈ అసోసియేషన్‌లో నేను కమిటీ మెంబర్‌గా పదేళ్లుగా కొనసాగుతున్నాను. శ్రీనివాస్ ఏడాది అంతా చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్స్‌లో తెలుగు సినిమాలను అక్కడ ఉన్న తెలుగు వారికీ చూపిస్తూ, వాటిలో బాగున్న వాటిని అవార్డ్స్ కోసం సెలెక్ట్ చేస్తుంటారు. ఈసారి ఇరవై ఐదేళ్ళ పూర్తి చేసుకున్న సందర్భంగా వచ్చిన ప్రతి కుటుంబానికి సిల్వర్ కాయిన్ రిటన్ గిఫ్టుగా ఇస్తున్నారు. ప్రసన్నకుమార్ ఈ కార్యక్రమంలో భాగమవడం సంతోషంగా ఉంది' అని కమిటీ మెంబర్ పర్వతనేని రాంబాబు చెప్పారు.

స్వయంభూలో పవర్‌ఫుల్ రోల్


నభా నటేష్

హీరో నిఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'స్వయంభూ'. లెజెండరీ యోధుడిగా నటిస్తున్న నిఖిల్ తన పాత్ర కోసం ఆయుధాలు, మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నిఖిల్ నటిస్తున్న 20వ చిత్రం కావడం విశేషం. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్‌పై భువన్, శ్రీకర్ ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు.

ఈ చిత్రంలో సంయుక్త ఒక కథానాయికగా నటిస్తోంది. ఆమె తన పాత్ర కోసం శిక్షణ కూడా తీసుకుంది. మేకర్స్ గురువారం మరొక అప్‌డేట్ ఇచ్చారు. చేతికి గాయమైన నభా నటేష్ మళ్లీ వర్క్‌లో చేరారు. ఈ మాస్టర్‌పీస్‌లో ఒక మహిళా ప్రధాన పాత్రను పోషించడానికి ఆమె ఈ టీమ్‌లోకి వచ్చారు. మేకర్స్ ఆమె లుక్‌ని రివీల్ చేశారు. నభా గాయం నుంచి కోలుకుని టీంలో చేరినట్లు వీడియోలో ప్రజెంట్ చేశారు. ఈ పాత్ర కోసం ఆమె ట్రాన్స్‌ఫర్మేషన్ అద్భుతంగా ఉంది. మేకర్స్ విడుదల చేసిన పోస్టర్‌లో, చీరలో నగలతో ఆమె యువరాణిలా కనిపిస్తోంది. నిఖిల్ కూడా వీడియోలో ఆమె లుక్ చూసి ఆశ్చర్యపోతున్నారు.

ఈ చిత్రంలో నభా నటేష్ కీలకమైన, శక్తివంతమైన పాత్రను పోషిస్తోంది. అది పోస్టర్‌లో ఆమె గెటప్, లుక్‌లలో స్పష్టంగా కనిపిస్తుంది. ఆమె పాత్రకు పర్ఫెక్ట్ ఛాయిస్. కేజీఎఫ్, సలార్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటోంది. నిఖిల్, సంయుక్త, నభా నటేష్ నాయకానాయికలుగా నటిస్తున్న ఈచిత్రానికి రచన, దర్శకత్వం: భరత్ కృష్ణమాచారి, నిర్మాతలు: భువన్, శ్రీకర్, సమర్పణ: ఠాగూర్ మధు, సంగీతం: రవి బస్రూర్, డైలాగ్స్: వాసుదేవ్ మునెప్పగారి, ప్రొడక్షన్ డిజైనర్: ఎం ప్రభాహరన్, సహ నిర్మాతలు: విజయ్ కామిశెట్టి, జిటి ఆనంద్.

తండ్రీ కొడుకుల అనుబంధంతో సత్య


అమరేష్, ప్రార్థన సందీప్

సీనియర్ జర్నలిస్ట్ శివ మల్లాల నూతనంగా స్థాపించిన శివమ్ మీడియా సంస్థ నుంచి గురువారం 'సత్య' చిత్ర టీజర్, సాంగ్ లాంచ్ చేశారు.

ప్రసాద్ ల్యాబ్స్ వేదికగా జరిగిన ఈ ఈవెంట్‌లో డైరెక్టర్ వాలి మోహన్ దాస్ మాట్లాడుతూ, 'సత్య సినిమా నాకు చాలా స్పెషల్ ఎందుకంటే ఇది నా మొదటి సినిమా. మొదటి హీరో, మొదటి హీరోయిన్, మొదటి ప్రొడ్యూసర్.. నా అనుభవం నుండి తీసిన కథ ఇది' అని అన్నారు.

'నిర్మాతగా శివ మొదటి సినిమానే సత్య లాంటి పేరుతో మొదలు పెట్టారు. పెద్ద పెద్ద విజయాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని నిర్మాత కె బాబు రెడ్డి చెప్పారు. మరో నిర్మాత సతీష్ మాట్లాడుతూ, 'తెలుగువాడిని అయిన నేను చెన్నైలో స్థిరపడ్డాను. శివకి ఈ సినిమా చూపించాను. వెంటనే నేను తెలుగులో రిలీజ్ చేస్తాను అని చెప్పారు. 'నాన్న' మూవీలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా, లోకేష్ కనగరాజ్ నగరంలో, ప్రియదర్శి దర్శకత్వంలో అమరేష్ సినిమాలు చేశాడు. గోపురం ప్రొడక్షన్స్‌లో 'రంగోలి' పేరుతో ఈ సినిమాని స్టార్ట్ చేశాం. పెద్ద సక్సెస్ అయ్యింది' అని తెలిపారు. ప్రొడ్యూసర్ శివ మల్లాల సతీమణి సుజాత మాట్లాడుతూ,'శివకి మంచి సక్సెస్ రావాలని, సత్య టీమ్‌కి అల్ ది బెస్ట్' అని చెప్పారు. శివమ్ మీడియా అధినేత శివ మల్లాల మాట్లాడుతూ,'ఈసినిమా కోసం అన్ని అవే కలిసొచ్చాయి.. నాన్న అంటే ఎవరికీ ఇష్టం ఉండదు.. నాకు నాన్న లేరు, అందుకని నాకు అయన విలువ బాగా తెలుసు. అందరు పిల్లలు నాన్న మనకి ఏం ఇచ్చారు అనుకుంటారు, కానీ ఈ సినిమాలో హీరో సత్య మాత్రం నేను నాన్నకి ఏమన్నా ఇవ్వాలి అని అనుకుంటే ఏమన్నా చెయ్యగలను అని తన జర్నీని స్టార్ట్ చేశారు' అని తెలిపారు.

సీనియర్ రిపోర్టర్ ప్రభు మాట్లాడుతూ, 'శివ జర్నీ ఒక్కసారి చూస్తే. రీల్ కెమెరా వచ్చినప్పటి నుండీ ఇప్పుడు డిజిటల్ ఎరా వరుకు.. ఎప్పుడు కష్టపడుతునే ఉంటాడు.. తన మార్క్‌ని చూపించడానికి పరిగెడుతునే ఉంటాడు. హార్డ్ వర్క్‌ని నమ్ముకుని రిలేషన్స్‌ని మెయింటైన్ చేసుకుంటూ వెళ్ళే వ్యక్తికి సక్సెస్ కచ్చితంగా వస్తుంది' అని అన్నారు.





ధోని దంచికొట్టేనా?

- మహి కోసం అభిమానుల ఎదురుచూపు
- నేడు సూపర్‌కింగ్స్‌తో సన్‌రైజర్స్ ఢీ



మహేంద్రసింగ్ ధోని.. భారత క్రికెట్‌లో అభిమానుల గుండె చప్పుడు. అత్యంత విజయవంతమైన కెరీర్‌లో చివరి అంకంలో అలరిస్తున్న మహేంద్రుడి కోసం తెలుగు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విశాఖ తీరంలో ఇప్పటికే ' ఎల్లో సముద్రం' చూసిన ధోని నేడు ఉప్పల్‌లోనూ అటువంటి అనుభూతి పొందనున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం కాంక్షిస్తూనే... ఎం.ఎస్ ధోని విన్యాసాల కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. నేడు చెన్నై సూపర్‌కింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ పోరు.

నవతెలంగాణ-హైదరాబాద్

అందరూ అనుకుంటున్నట్టు ఎం.ఎస్ ధోని కెరీర్ చివరి ఐపీఎల్ సీజన్‌లో ఫ్యాన్స్ టూర్‌లో ఉన్నాడు!. ధోని అడుగుపెట్టిన ప్రతిచోట అభిమానులు నీరాజనం పలుకుతున్నారు. చెపాక్ స్టేడియం వీడి తొలుత తెలుగు రాష్ట్రాల్లోనే అడుగుపెట్టిన మహేంద్రుడు నేడు ఉప్పల్ స్టేడియంలో మెరువనున్నాడు. ఐపీఎల్ 17 సీజన్ గ్రూప్ దశ మ్యాచ్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో చెన్నై సూపర్‌కింగ్స్ తలపడనుంది. బలమైన బ్యాటింగ్, బౌలింగ్ లైనప్‌తో సూపర్‌కింగ్స్ నేడు సన్‌రైజర్స్‌తో సమరానికి సిద్ధమవుతోంది. బ్యాటింగ్ లైనప్ అదిరేలా కుదిరినా.. బౌలింగ్ బలహీనత సన్‌రైజర్స్ శిబిరంలో కలవరం రేపుతోంది. నేడు రాత్రి 7.30 గంటలకు సూపర్‌కింగ్స్, సన్‌రైజర్స్ సమరం ఆరంభం. చెన్నై సూపర్‌కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడిన గత ఐదు మ్యాచుల్లో నాలుగింట చెన్నై విజయం సాధించింది. చివరగా 2022లో చెన్నైపై హైదరాబాద్ గెలుపొందింది. నేడు ఉప్పల్‌లో ఆ రికార్డును సన్‌రైజర్స్ మెరుగుపరుస్తుందేమో చూడాలి.

ఆ ఇద్దరు రాణిస్తే..

సన్‌రైజర్స్ హైదరాబాద్ సంప్రదాయంగా భీకర బౌలింగ్ విభాగం కలిగిన జట్టు. ఉప్పల్ స్టేడియం సైతం ఐపీఎల్‌లోనే అత్యల్ప స్కోర్లకు వేదిక. కానీ ఈ సీజన్‌లో ఈ రెండూ మారాయి. సన్‌రైజర్స్ బ్యాటింగ్ మెరుగవగా.. ఇదే సమయంలో బౌలింగ్ లైనప్ బలహీనపడింది. బౌలింగ్ విభాగం ప్రధానంగా కెప్టెన్ పాట్ కమిన్స్‌పై ఆధారపడింది. సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ ఆశించిన ప్రభావం చూపటం లేదు. ఈ సీజన్లో భువనేశ్వర్ ఒక్క వికెట్ కూడా పడగొట్టలేదు. 10.92 ఎకానమీతో పరుగులు ఇస్తున్న భువనేశ్వర్ తీవ్రంగా నిరాశపరిచాడు. ఉమ్రాన్ మాలిక్ వేగంపై పెట్టిన దృష్టి.. వైవిధ్యంపై నిలుపటం లేదు. ఫలితంగా పేస్‌ను వాడుకుంటున్న బ్యాటర్లు అలవోకగా బౌండరీలు బాదుతున్నారు. జైదేవ్ ఉనద్కత్ నిలకడ లేకపోయినా ఫర్వాలేదు అనిపిస్తున్నాడు. మయాంక్ మార్కండే, షాబాజ్ అహ్మద్‌లు స్పిన్ బాధ్యతలు చూసుకుంటున్నారు. కానీ మిడిల్ ఓవర్లలో ఆశించిన ప్రభావం చూపించటం లేదు. బ్యాటింగ్ లైనప్‌లో మయాంక్ అగర్వాల్ భారంగా మారాడు. మూడు మ్యాచుల్లో కేవలం 59 పరుగులే చేశాడు. యువ బ్యాటర్ అభిషేక్ శర్మ విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగుతుండగా.. మయాంక్ అగర్వాల్ కనీసం వన్డే స్థాయి ఆట తీరు కనబరచటం లేదు. ట్రావిశ్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, ఎడెన్ మార్క్రామ్ మరోసారి సన్‌రైజర్స్‌కు కీలకం కానున్నారు. బ్యాట్‌తో మయాంక్ అగర్వాల్, బంతితో భువనేశ్వర్ కుమార్ రాణిస్తే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఎదురుండదు.



చెన్నైలో నయా జోశ్

తొలి రెండు మ్యాచుల్లో విజయాలు సాధించిన సూపర్‌కింగ్స్.. విశాఖలో ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఓడినా గెలిచినంత సంతోషంగా కనిపించింది. ఈ సీజన్‌లో తొలిసారి బ్యాటింగ్‌కు వచ్చిన ఎం.ఎస్ ధోని మునుపటి జులపాల మహిని గుర్తు చేశాడు. ధనాధన్ ఇన్నింగ్స్‌తో అభిమానులను అలరించాడు. ధోని దంచికొట్టిన ఉత్సాహంలో సూపర్‌కింగ్స్ నేడు రెట్టించిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతుంది. లోతైన బ్యాటింగ్ లైనప్ సూపర్‌కింగ్స్ ప్రధాన బలం. రచిన్ రవీంద్ర, అజింక్య రహానె, డార్లీ మిచెల్, శివం దూబె, రవీంద్ర జడేజా మంచి ఫామ్‌లో ఉన్నారు. యువ సంచలనం సమీర్ రిజ్వీ తనదైన ఇన్నింగ్స్ ఆడేందుకు ఎదురుచూస్తున్నాడు. బౌలింగ్ విభాగంలో ముస్తాఫిజుర్ రెహమాన్ నేడు ఆడేది అనుమానంగా ఉంది. ముస్తాఫిజుర్ రెహమాన్ లేకపోయినా చెన్నై బౌలింగ్ విభాగానికి వచ్చిన లోటేమీ లేదు. మతీశ పతిరణ, దీపక్ చాహర్, తుషార్ దేశ్‌పాండే అంచనాలను అందుకుంటున్నారు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ నాయకుడిగా, ఆటగాడిగా మెప్పిస్తున్నాడు. ఓటమి తర్వాత ఆడుతున్న మ్యాచ్‌లో జట్టును రుతురాజ్ ఏ విధంగా నడిపిస్తాడో చూడాలి.

పరుగుల పిచ్



ఉప్పల్ పిచ్ సంప్రదాయంగా బౌలర్లకు అనుకూలం. భారీ స్కోర్లు నమోదు కావటం అత్యంత అరుదు. కానీ ఈ సీజన్లో సన్‌రైజర్స్ యాజమాన్యం బ్యాటింగ్ పిచ్‌ల వైపు మొగ్గుచూపింది. నేడు సూపర్‌కింగ్స్‌తో మ్యాచ్‌కు సైతం పరుగుల పిచ్‌నే సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఇరు జట్లు భీకర బ్యాటింగ్ లైనప్ కలిగి ఉండటంతో ఉప్పల్‌లో నేడు మరోసారి పరుగుల వరద పారనుంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తుంది.

శుభ్‌మన్ గర్జన

- గిల్ అజేయ అర్ధ సెంచరీ
- గుజరాత్ టైటాన్స్ 199/4

నవతెలంగాణ-అహ్మదాబాద్



గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (89 నాటౌట్, 48 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సులు) అజేయ అర్ధ సెంచరీతో గర్జించాడు. ఓపెనర్‌గా వచ్చిన శుభ్‌మన్ గిల్ ఆఖరు వరకు క్రీజులో నిలబడి గుజరాత్ టైటాన్స్‌కు భారీ స్కోరు అందించాడు. సాయి సుదర్శన్ (33, 19 బంతుల్లో 6 ఫోర్లు), కేన్ విలియమ్సన్ (26, 22 బంతుల్లో 4 ఫోర్లు), రాహుల్ తెవాటియ (23 నాటౌట్, 8 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో మెరిసిన వేళ పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 199 పరుగుల భారీ స్కోరు సాధించింది. పంజాబ్ కింగ్స్ పేసర్ కగిసో రబాడ (2/44) రెండు వికెట్లు పడగొట్టాడు.

అతనొక్కడే : టాస్ నెగ్గిన పంజాబ్ కింగ్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. టైటాన్స్ ఓపెనర్ వృద్ధిమాన్ సాహా (11)ను ఆరంభంలో అవుట్ చేసినా కింగ్స్‌కు ఆశించిన పట్టు చిక్కలేదు. కేన్ విలియమ్సన్ (26) తోడుగా గిల్ 33 బంతుల్లో 40 పరుగులు జోడించాడు. బరార్ ఓవర్లో కేన్ నిష్క్రమించినా.. సాయి సుదర్శన్ (33) తోడుగా ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 31 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన శుభ్‌మన్ గిల్.. ఎక్కువగా స్ట్రయిక్ తీసుకోలేదు. జోరుమీదున్న సాయి సుదర్శన్ ఆరు బౌండరీలతో అదరగొట్టాడు. విజయ్ శంకర్ (8) నిరాశపరిచినా.. రాహుల్ తెవాటియ (23 నాటౌట్) తోడుగా గిల్ ధనాధన్ ముగింపు అందించాడు. తెవాటియ మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 8 బంతుల్లోనే 23 పరుగులు పిండుకున్నాడు. 48 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో శుభ్‌మన్ అజేయంగా 89 పరుగులు చేశాడు. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో హర్‌ప్రీత్ బరార్, కగిసో రబాడ, హర్షల్ పటేల్ వికెట్ల వేటలో మెప్పించారు.

పి.వి సింధు దూరం

- థామస్, ఉబెర్ కప్ జట్ల ప్రకటన



న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మక థామస్, ఉబెర్ కప్‌లకు భారత జట్లను బాయ్ (భారత బ్యాడ్మింటన్ సంఘం) గురువారం ప్రకటించింది. ఏప్రిల్ 27 నుంచి మే 5 వరకు చైనాలోని చెంగ్డూలో జరిగే ఈ టోర్నీలో మెన్స్ జట్టు డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. అగ్ర షట్లర్ పి.వి సింధు పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధత కోసం ఉబెర్ కప్‌కు దూరమైంది. థామస్ కప్‌లో పది జట్లు షట్లర్లకు చోటు దక్కగా అందులో ఐదుగురు సింగిల్స్ ప్లేయర్లు ఉన్నారు.

థామస్ కప్ : హెచ్.ఎస్ ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్ (సింగిల్స్). సాత్విక్‌సాయిరాజ్,చిరాగ్ శెట్టి, ఎంఆర్ అర్జున్, ధ్రువ్ కపిల, సాయి ప్రతీక్ (డబుల్స్) **ఉబెర్ కప్ :** అన్మోల్, తన్వీ శర్మ, అష్మిత చాలిహ, ఇషారాణి (సింగిల్స్). శృతి మిశ్రా, ప్రియా, సిమ్రన్, రితిక (డబుల్స్)

ఎల్బీలో పికిల్‌బాల్ పోటీలు



హైదరాబాద్ : పికిల్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచులు గురువారం ఎల్బీ స్టేడియంలో ఆరంభమయ్యాయి. అమేచర్ తెలంగాణ పికిల్‌బాల్ సంఘం (ఏటీపీఏ) నిర్వహించిన ఈ పోటీలను ఏటీపీఏ అధ్యక్షులు రావుల శ్రీధర్ రెడ్డితో కలిసి శాట్స్ వైస్ చైర్మెన్, ఎండీ డా. కె లక్ష్మి ప్రారంభించారు. తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ (శాట్స్) నిర్వహించే వేసవి శిక్షణ శిబిరంలో పికిల్‌బాల్‌ను సైతం చేర్చాలని ఈ సందర్భంగా ఆ సంఘం ప్రతినిధులు కోరారు.

భారత్‌లో డోపింగ్ కలవరం!



న్యూఢిల్లీ : ఇప్పుడిప్పుడే క్రీడా దేశంగా ఎదుగుతున్న భారత్‌ను డోపింగ్ పిడుగు కలవరపాటుకు గురి చేస్తుంది. 2000కు పైగా శాంపిల్స్ పరీక్ష చేసిన దేశాల్లో అత్యధిక పాజిటివ్‌లు భారత్‌లోనే ఉన్నాయి. భారత్‌లో 3,865 శాంపిల్స్ (యూరిన్, బ్లడ్ కలిపి) పరీక్ష చేయగా.. అందులో 125 శాంపిల్స్‌లో నిషేధిత ఉత్ప్రేరకాల అవశేషాలు బయటపడ్డాయి. భారత్‌లో పాజిటివ్ టెస్టుల శాతం 3.2 శాతంగా వాడా తాజాగా విడుదల చేసిన నివేదికలో తెలిపింది. ఓవరాల్‌గా పరీక్ష చేయబడిన శాంపిల్స్ అంశంలో భారత్ 11వ స్థానంలో నిలిచినా.. పాజిటివ్ విషయంలో మాత్రం అగ్రస్థానంలో నిలిచింది. రష్యా (85), అమెరికా (84), ఇటలీ (73), ఫ్రాన్స్ (72)లో తక్కువ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దక్షిణాఫ్రికా 2033 శాంపిల్స్ పరీక్ష చేయగా 2.9 పాజిటివ్ రేట్‌తో భారత్ తర్వాతి స్థానంలో నిలిచింది. చైనా అత్యధికంగా 19228 శాంపిల్స్ టెస్టు చేయగా.. కేవలం 0.2 శాతం పాజిటివ్‌గా తేలాయి.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886